RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 07.11.2026 | సంపుటి:13 సంచిక:108 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్







లెక్కలు చెప్పాల్సిందే..

- పెరుగుతున్న బియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు రంగంలోకి కేంద్ర ప్రభుత్వం
- వ్యాపారులు, మిల్లు యజమానులు బియ్యం, ధాన్యం నిల్వల ప్రకటించాలని ఆదేశం
- ఆహార మంత్రిత్వ శాఖ కఠిన ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా వ్యాపారులు, మిల్లు యజమానులు తమ వద్ద ఉన్న బియ్యం, ధాన్యం నిల్వలను తప్పనిసరిగా ప్రకటించాలని ప్రభుత్వం ఆదేశించింది. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న బియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి సాగు తగ్గడం, బియ్యం ధరలు భగ్గుమంటుండటంతో

మిగతా 2లో..

కొడంగల్‌లో సీఎం రేవంత్

3రోజుల పర్యటన

- రూ.9100 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 9న 10 జిల్లాల రైతులతో భారీ బహిరంగ సభ

హైదరాబాద్(జనంసాక్షి):
సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించనున్నారు. వీటితో పాటు రూ.9,100 కోట్ల వ్యయంతో చేపట్టే 13 అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు సీఎం ఎంసీహెచ్‌ఆర్డీ (మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం) నుంచి హెలికాప్టర్‌లో వికారాబాద్ జిల్లా హకీంపేటకు చేరుకుంటారు. అక్కడ మెగా రైతు మేళా, పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం స్టాళ్లను సందర్శించనున్నారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో రేవంత్ రెడ్డి ముఖాముఖి నిర్వహిస్తారు. పారిశ్రామికవేత్తలతోనూ సమావేశమవుతారు. అనంతరం హకీంపేట నుంచి రోడ్డు మార్గంలో కొడంగల్ వెళ్లి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం ఉదయం నివాసం నుంచి హకీంపేట చేరుకుని, అక్కడ స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు.లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ ఆయిల్‌పామ్ కర్మాగారానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు.

వివరాలు 3వ పేజీలో..





మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ ఇక చవక

రూ.8500 ఉన్న నెలవారీ పాస్ ధర రూ.4000కు కుదింపు

హైదరాబాద్(జనంసాక్షి):
తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గించారు. సీఎం

మిగతా 2లో..

ఓటు గల్లంతైన వారికి మరో'సారి' అవకాశం

తెలంగాణ, ఏపీ సహా 7రాష్ట్రాల్లోని ఓటర్లకు వర్తింపు : ఈసీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటర్ల జాబితాల నుంచి కోట్ల మంది పేర్లను తొలగించారనే తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు కోల్పోయిన వారికి మరో అవకాశం కల్పించింది. ఫారం-6 ఎఖీలో భాగంగా గైర్హాజరు, ఇల్లు మారినవారు, మరణించినవారు, డూప్లికేట్ కేటగిరీల కింద గుర్తించిన వారికి అలాగే ఎన్యూమరేషన్ ఫారాలు జారీ చేసినప్పటికీ తిరిగి సమర్పించని కారణంగా ముసాయిదా జాబితాలో పేర్లు కోల్పోయిన ఓటర్లకు తమ పేర్లను చేర్చుకునేందుకు మరో అవకాశం ఇచ్చింది.తుది ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునే అవకాశాన్ని అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా కోల్పోకుండా చూడాలని అదే సమయంలో డూప్లికేట్ ఓట్లు చేరకుండా పకడ్బందీ పర్యవేక్షణ

మిగతా 2లో..

సంక్షేమపథకాలకు ఓటుకు

ముడిపెట్టొద్దు

- ఓటు చోరీ అంటే పౌరహక్కుల దోపిడీ:రాహుల్
- సంక్షేమ పథకాలకు ఓటర్ ఐడీ లింక్‌పై ఆగ్రహం
- ధరాఘాతంతో ప్రజల అవస్థలు పడుతున్నారని మండిపాటు



న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆధార్ కార్డుకు బదులుగా ఓటర్ ఐడీ కార్డుతో ముడిపెట్టాలన్న ప్రతిపాదనను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. దీని వెనుక పౌరుల ఓటు హక్కును, ప్రాథమిక హక్కులను కాలరాసి శాశ్వతంగా అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండే లోతైన కుట్ర దాగి ఉందని ఆరోపించారు. బీజేపీకే మెజారిటీ వచ్చేలా ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నారని, ఇప్పుడు అదే జాబితా ఆధారంగా ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలా వద్దా అనేది నిర్ణయించబోతున్నారని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు అనేది పౌరుల హక్కు అని, పేదవాడి పెన్షన్‌ను ఓటర్ కార్డుకు బానిసగా మార్చలేరని ఆయన తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. ఈ హక్కుల చోరీని తాము ఎట్టిఎ రిస్థితుల్లోనూ జరగనివ్వబోమని తేల్చిచెప్పారు.

మిగతా 2లో..



ఢిల్లీలో ఆందోళనకరంగా వాయు కాలుష్యం

- సుప్రీం కోర్టు ఆందోళన
- కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్రాప్-3 అమలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వాయు కాలుష్యం ఆందోళన కలిగిస్తోంది. దీపావళి పండుగ వేళ వాయు నాణ్యత (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) ప్రమాదకర స్థాయికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ మరిన్ని చర్యలకు

మిగతా 2లో..



అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణిచివేయలేరు

బాలరాజు యాదవ్ అరెస్టుపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలను

మిగతా 2లో..



పంట బీమాతో రైతులను ఆదుకోండి

ఎండిపోయిన ప్రతి ఎకరానికి నష్టపరిహారం ఇవ్వాల్సిందే..

హరీశ్‌రావు డిమాండ్

పార్ట్ 2 లో



మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ ఇక చవక

రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రూ.8500 ఉన్న నెలవారీ పాస్ ధర రూ.4000కు తగ్గించినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించి, ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు."ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ.275కు తగ్గించాం. ఇందులో రూ.200 మెట్రో ప్రయాణానికి, రూ.75 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించాం. ఈ పాస్ ద్వారా రోజుకు 4 సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది. ప్రస్తుతం రూ.8,500గా ఉన్న నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను ఏకంగా రూ.4,000కు తగ్గించాం. ఇందులో రూ.3,000 మెట్రో ప్రయాణానికి, రూ.1,000 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించాం. ఈ పాస్ ద్వారా నెలలో గరిష్ఠంగా 50 రౌండ్ ట్రిప్పులకు అనుమతి ఉంటుంది.ఈ ధరల తగ్గింపుతో నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ వినియోగదారులకు రూ.4,500 ఆదా అవుతుంది. రోజువారీ ఉమ్మడి పాస్ వినియోగదారులకు రూ.125 ఆదా అవుతుంది. ప్రభుత్వం ప్రకటించిన తగ్గింపు ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి వస్తాయి. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత సంస్థలను ఆదేశించాం. ప్రజల సంక్షేమం, ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఎంతో ఊరటనిస్తుంది" అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

మెట్రో–ఆర్టీసీ కామన్ పాస్ ధర భారీగా తగ్గింపు

నెలవారీ మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్ ధరను రూ.8500 నుంచి రూ.4000కు తగ్గించినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకను ప్రకటించింది. మెట్రో–ఆర్టీసీ కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించింది. రూ.8500 ఉన్న నెలవారీ పాస్ ధరను రూ.4 వేలకు తగ్గించినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్?లో పోస్ట్ చేశారు. ప్రజలపై రవాణా ఖర్చుల భారం తగ్గించి, సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ప్రజాభిప్రాయం.. బెయిల్‌ను నిర్దేశించలేదు

కేరళ హైకోర్టు

తిరువనంతపురం(జనంసాక్షి):మినీ కూపర్ కారు ప్రమాద ఘటనలో కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాభిప్రాయాలు బెయిల్‌ను నిర్దేశించకూడదని పేర్కొంది. నిందితుల బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. నలుగురు నిందితులకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. వారిలో ప్రధాన నిందితుడి విడుదలపై మాత్రం పరిమితులు విధించింది. 10 రోజుల తర్వాత అతడిని బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. అలప్పుళ సౌత్‌కు చెందిన 19 ఏళ్ల సజీవ్.. గత నెల తన స్నేహితుడితో కలిసి నెడుంబస్సెరి సమీపంలోని ఎయిర్‌పోర్టు రోడ్డుపై మినీకూపర్‌లో వేగంగా వెళ్తూ.. ఓ స్కూటర్‌ను ఢీకొట్టాడు. దాంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు యువతులు, ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సమయంలో నిందితులు మద్యం మత్తుల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన రాష్ట్రంలో తీవ్ర ప్రజాగ్రహానికి దారితీసింది. ఈ క్రమంలోనే నిందితుల బెయిల్ పిటిషన్ విచారణ జరిగింది. " కేవలం ప్రజల అభిప్రాయాల ఆధారంగా న్యాయస్థానాలు నిర్ణయాలు తీసుకోవు. చట్టపరమైన నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి" అని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది.

సంక్షేమపథకాలకు ఓటుకు ముడిపెట్టొద్దు

గల్లీకో సంస్థ ఐదు నిమిషాల్లోనే ఆధార్ కార్డులు తయారు చేసి ఇస్తోందని, అందుకే ఆధార్ బదులు బయోమెట్రిక్, ఓటర్ ఐడీ ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని కేంద్రమంత్రి లలన్‌సింగ్ మాట్లాడిన వీడియోను రాహుల్ గాంధీ పంచుకున్నారు.

కాలుష్య నివారణకు సంస్కరణలు అవసరం

ఇదిలా ఉండగా, దేశంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్? ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధానిలో కాలుష్యం కోరలు చాస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా కాలుష్యాన్ని నివారించడానికి, దాదాపు ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన జాతీయ స్వేచ్ఛా వాయు కార్యక్రమానికి తక్షణ సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (అకీఇం) విశ్లేషణ ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్య సంక్షోభం మరింత తీవ్రంగా ఉందని మాజీ పర్యావరణ మంత్రి అన్నారు.

పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజల అవస్థలు

మరోవైపు, దేశంలోని సాధారణ ప్రజలు ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల), అప్పుల ఊబిలో కూరుకుపోయారని కాంగ్రెస్ ఆరోపించింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో బీజేపీని ఓడించి, పెరుగుతున్న ధరలపై తమ నిరసనను తెలియజేసే బాధ్యత ఇప్పుడు ఆయా రాష్ట్రాల ఓటర్లపైనే ఉందని పేర్కొంది. మోదీ ప్రభుత్వ హయాంలో సామాన్యుల జీవితాలు ద్రవ్యోల్బణం, అప్పుల్లో చిక్కుకుపోయాయని కాంగ్రెస్? ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. కూరగాయలు, పండ్లు, పప్పులు, వంట నూనె, పాలు, పిండి వంటి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల భారంతో పేద, మధ్యతరగతి ప్రజల నడుము విరిగిపోతోందని అన్నారు.

లెక్కలు చెప్పాల్సిందే..

కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా వ్యాపారులు, మిల్లు యజమానులు తమ వద్ద ఉన్న బియ్యం, ధాన్యం నిల్వలను తప్పనిసరిగా ప్రకటించాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు బియ్యం, ధాన్యం నిల్వలపై పరిమితులు విధించేందుకు కేంద్రం అంగీకరించింది.

ఆహార మంత్రిత్వ శాఖ కఠిన ఉత్తర్వులు జారీ

దేశవ్యాప్తంగా లోటు వర్షపాతం కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు సుమారు 4 శాతం తగ్గి 4.26 కోట్ల హెక్టార్లకు పరిమితమైంది. గత ఏడాది 15.4 కోట్ల టన్నులుగా ఉన్న ధాన్యం దిగుబడి ఈసారి 14.7 కోట్ల టన్నులకు పడిపోతుందని అంచనా వేస్తున్నారు. దీంతో బియ్యం ధరలు అకస్మాత్తుగా పెరిగిపోయాయి. సెప్టెంబర్‌లో రిటైల్ బియ్యం ద్రవ్యోల్బణం 8.25 శాతానికి చేరింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో సోనా మసూరి వంటి ప్రీమియం రకాల హోల్‌సేల్ ధర నెల రోజుల క్రితం ఉన్న 50 రూపాయల నుంచి ఏకంగా 70 నుంచి 80కి ఎగబాకింది. ఈ ధరల పెరుగుదలను, కృత్రిమ కొరతను అరికట్టేందుకు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ నవంబర్ 6న కఠిన ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోని ట్రేడర్లు, రిటైలర్లు, హోల్‌సేలర్లు, ప్రాసెసర్లు, మిల్లు యజమానులందరూ తమ వద్ద ఉన్న బాస్మతి, నాన్–బాస్మతి ప్రీమియం, సాధారణ నాన్–బాస్మతి, ఉప్పుడు బియ్యం, నూకలు , ధాన్యం ఈ ఆరు రకాల నిల్వల వివరాలను ప్రకటించాల్సి ఉంటుంది. ప్రతి శుక్రవారం 'ఫుడ్ స్టాక్ పోర్టల్'లో ఈ వివరాలను అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. పోర్టల్‌లో నమోదు కానివారు లేదా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం–1955 కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ నిల్వల కట్టడికి ప్రత్యేక అధికారం

మరోవైపు, అక్రమ నిల్వల కట్టడికి తెలుగు రాష్ట్రాలతో సహా ఐదు దక్షిణ రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేక అధికారం కల్పించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు బియ్యం, ధాన్యం నిల్వలపై పరిమితులు విధించేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ నిబంధనలు వచ్చే ఏడాది జనవరి 31 వరకు అమల్లో ఉంటాయి. మరోవైపు బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించేందుకు 'భారత్ రైస్' విక్రయాలను పెంచడంతో పాటు, ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ కింద ఈ ఏడాది బియ్యం విక్రయాల లక్ష్యాన్ని 25 లక్షల టన్నుల నుంచి 50 లక్షల టన్నులకు కేంద్రం రెట్టింపు చేసింది. ప్రభుత్వం వద్ద తగినంత బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించేది లేదని కేంద్రం స్పష్టం చేసింది.

ఓటు గల్లంతైన వారికి

మరో'సారి' అవకాశం

వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులను కమిషన్ ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దిల్లీ, మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్, నాగాలాండ్ మొత్తం ఏడు రాష్ట్రాల్లోని ఓటర్లకు ఈ నిర్ణయం వర్తిస్తుందని ప్రకటించింది. గతంలో ఈ రాష్ట్రాల్లోని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు జారీ చేసినప్పటికీ, అవి తిరిగి సకాలంలో అందకపోవడం వల్ల వారి పేర్లు ముసాయిదా జాబితా నుంచి తొలగించారు. అయితే, అలాంటి వారందరికీ తుది ఓటర్ల జాబితాలో చోటు కల్పించేలా సదుపాయాలు చేయాలని ఈసీ తాజా ఆదేశాలు జారీ చేసింది.

'ఇంటింటికి వెళ్లి సంప్రదించాలి'

జాబితాలో లేని ఓటర్లను గుర్తించి, వారిని తిరిగి చేర్చుకునే ప్రక్రియలో భాగంగా బూత్ వారీగా సేకరించిన ఓటర్ల లిస్టులను, వారు జాబితాలో లేకపోవడానికి గల ప్రాథమిక కారణాలతో సహా ఆయా పోలింగ్ స్టేషన్‌లలో ప్రదర్శిస్తారు. అంతేకాకుండా, ఈ జాబితాలను ఆయా రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల అధికారిక వెబ్‌సైట్లలో కూడా అప్‌లోడ్ చేయనున్నారు. తొలగించిన ఓటర్లకు కొత్త ఎన్యూమరేషన్? పత్రాలను అందించాలని, అలాగే బూత్ స్థాయి అధికారుల ద్వారా, ఇంటింటికీ వెళ్లి, వాట్సాప్, ఈ–మెయిల్, ఫోన్ ద్వారా సాధ్యమైనంత వరకు అన్ని ప్రయత్నాలు చేసి వారిని సంప్రదించాలని కమిషన్ అధికారులను ఆదేశించింది. ఒకవేళ ఓటర్లు తమ పాత నివాసంలోనే ఉంటూ, కేవలం ఫారం అందకపోవడం వల్ల పేరు పోతే, వారు నింపిన ఎన్యూమరేషన్ ఫారంతో పాటు, గతంలో ఎందుకు సమర్పించలేకపోయామో తెలియజేస్తూ ఒక లేఖ (స్టేట్‌మెంట్) ఇస్తే సరిపోతుంది. అదేవిధంగా, రాష్ట్రంలోనే వేరే ప్రాంతానికి ఇల్లు మారిన వారు అడ్రస్ మార్పు కోసం ప్రత్యేకంగా ఫారం–8 నింపాల్సిన అవసరం లేదు. ఎన్యూమరేషన్ ఫారంతో పాటు తమ కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు, అడ్రస్ ప్రూఫ్ తప్పనిసరిగా సమర్పించాలి. ఇక, ఇల్లు లేని నిరాశ్రయులైన ఓటర్ల వద్ద ఎలాంటి చిరునామా పత్రాలు లేనట్లయితే, బూత్ స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో జరిపే పరిశీలన నివేదికనే నివాస ధ్రువీకరణ పత్రంగా అంగీకరిస్తారు. ఈ అప్లికేషన్లన్నింటినీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారని ఈసీ పేర్కొంది.

'తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం'

మరోవైపు, ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిచారు. ఈసీ నిర్ణయాన్ని 'యూ–టర్న్'గా అభివర్ణించారు. ఓటు చోరీకి ఎస్ఐఆర్ సరికొత్త రూపమని, ఇప్పుడు ఆ దొంగ పట్టుబడటంతో, ఈసీఐ, ప్రధాని–హోం మంత్రి ద్వయం తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాగా, ఎస్ఐఆర్ ప్రక్రియపై గత కొద్దిరోజులుగా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ, దాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. బీజేపీ ఆదేశాల మేరకు కోట్లాది మంది అర్హులైన పౌరుల పేర్లను ఓటర్ల జాబితాల నుంచి ఈసీ తొలగిస్తోందని ఆరోపించాయి. అయితే, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ఈసీ గట్టిగానే బదులిచ్చింది.

డెమోక్రాట్ల విజయకేతనం

చరిత్రను తిరగరాసే దిశగా అడుగులు

వాషింగ్టన్(జనంసాక్షి):చరిత్రను తిరగరాసే దిశగా డెమోక్రాట్లు అడుగులు వేస్తున్నారు. అమెరికా ప్రజలు ఆ పార్టీకి భారీ మెజారిటీని కట్టబెడుతున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఓటమి పాలైన దాదాపు అన్ని స్థానాల్లోనూ ఇప్పుడు డెమోక్రాట్లు విజయకేతనం ఎగురవేశారు. 2024 మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందిన 234 జిల్లాల్లో 52 జిల్లాలను డెమోక్రాట్లు కైవసం చేసుకున్నారు. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం.. డెమోక్రాట్లు 253 స్థానాలను కైవసం చేసుకోగా.. రిపబ్లికన్లు 155 స్థానాలకు పరిమితమయ్యారు. మరో 27 చోట్ల ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. ఈ క్రమంలో డెమోక్రాట్లు 260 ఫిగర్‌ను దాటే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అంతకుమించి సాధించినా పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఒకవేళ అదే జరిగితే ప్రతినిధుల సభలో డెమోక్రాట్లకు 85 పైచిలుకు స్థానాల మెజారిటీ లభిస్తుంది. సభలో 60 శాతం మంది వాళ్లే ఉంటారు. 1990 ప్రారంభంలో ఆ పార్టీ అత్యధికంగా 267 స్థానాలను దక్కించుకుంది.

ఢిల్లీలో ఆందోళనకరంగా వాయు కాలుష్యం

ఉపక్రమించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్)–3ని అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. దిల్లీలో గురువారం వాయునాణ్యత 382 మార్కును తాకింది. ఏక్యూఐ 301–400 మధ్య ఉంటే బాగా తక్కువగా ఉన్నట్లు లెక్క. అంతకుమించి నాణ్యత పడిపోయే అవకాశం ఉన్నప్పుడు గ్రాప్–3 ఆంక్షల్ని అమలు చేస్తారు. దీపావళి సందర్భంగా కాలుష్యం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రాప్–3 ఆంక్షలు అమల్లోకి వస్తే.. అత్యవసరం కాని నిర్మాణ పనులపై నిషేధంతో పాటు, బీఎస్–3 లేదా అంతకంటే పాత ప్రమాణాల పెట్రోల్ కార్లు, బీఎస్–4 లేదా అంతకంటే పాత ప్రమాణాల డీజిల్ కార్ల రాకపోకలపై పరిమితులు విధిస్తారు. అంతేకాకుండా కంకర రోడ్లపై భవన నిర్మాణ సామగ్రిని తరలించకుండా నిషేధం విధిస్తారు. స్టోన్ క్రషర్స్, గనుల తవ్వకాలను నిలిపివేస్తారు.

దూసుకొచ్చిన మృత్యుశకటం

ట్రక్కు ఢీకొని ఏడుగురి దుర్మరణం

రాంచీ(జనంసాక్షి):ఝార్ఖండ్‌లోని ఖూంటీ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి ప్రమాదానికి గురైన ఓ స్కూటీని చూసేందుకు వెళ్లిన జనంపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో ఏడుగురు దుర్మరణం చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. కర్ర–తోర్పా మార్గంలో ఓ స్కూటీ ప్రమాదానికి గురికావడంతో ఏం జరిగిందో చూసేందుకు స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో అతివేగంగా వచ్చిన ట్రక్కు వారిపైకి దూసుకెళ్లింది.



అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు

ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకుడిని అరెస్టు చేయడం ఏమిటని నిలదీశారు. రాజకీయ విమర్శలకు రాజకీయంగానే సమాధానం చెప్పాలని, పోలీసు కేసులతో అణచివేయాలని చూడటం సరికాదని మండిపడ్డారు .కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ భార్య ఇందుజా రెడ్డి ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుపై బల్మూరి వెంకట్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయడమేంటని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ అరెస్టుపై తాజాగా కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను నగరమంతా తిప్పుతూ ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమని రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదని హితవు పలికారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని కేటీఆర్ స్పష్టం చేశారు.కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని, అధికార పార్టీ నేతలను ప్రశ్నించే హక్కును కాలరాయలేరని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం

ఫారం-VII

(Declaration)

రూఢీ ప్రకటన

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

NO. G2/998/2026 **తేది: 03.10.2026.**

Gaz. No. 169/2026

నాగర్‌కర్నూల్ జిల్లా **తాడురు** మండలములోని **పొల్మూర్** గ్రామము వద్ద ప్యాకేజి నెం. 29 డిస్ట్రిబ్యూటరీ 26 యొక్క మైనర్ 22ఎల్ గ్రామా పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.0.21 గుంటలు/సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరీ 26 యొక్క మైనర్ 22 ఎల్ నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ.లు.0.21 గుం॥ భూమి డిస్ట్రిబ్యూటరీ 26 యొక్క మైనర్ 22ఎల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకుగాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

గ్రామము : పొల్మూర్ మండలం : తాడురు జిల్లా : నాగర్‌కర్నూల్

క్ర. సం.	సర్వే నెం./ ఎస్. డి. నెం.	పట్టా/ ఇనాం etc.	భూవర్గీకరణ మెట్ట /ఆరుతడి /తరి	భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ ఎ.గుంటలు	పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు చెట్ల పేర్లు	చెట్ల సంఖ్య	నిర్మాణములు వర్గము	విస్తీర్ణము
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	203	పట్టా	మెట్ట	0.17	కొలను వెంకటరెడ్డి తండ్రి జానారెడ్డి (0.17) కొలను నర్సింహ్మారెడ్డి తండ్రి జానారెడ్డి కెంచె నారమ్మ భర్త బాలయ్య కొలను రేసుపాల్‌రెడ్డి తండ్రి నరసింహ్మారెడ్డి వెంట వినిత భర్త వెంకటయ్య	202	VB	196	204	లేవు	లేవు	లేవు	లేవు
2	202	పట్టా	మెట్ట	0.04	పెరుమాళ కృష్ణయ్య తండ్రి బాల్‌రాం (0.04) కొలను సురేందర్ రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి చిందం మల్లయ్య తండ్రి పర్వతాలు చిందం వెంకటయ్య తండ్రి పర్వతాలు చిందం మల్లమ్మ భర్త సలెయ్య	199	203	200	204	లేవు	లేవు	లేవు	లేవు
	మొత్తం			0.21									

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్–I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్ సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO.NO: 1113/LA/PP/Advt/Pub/2026-27

ఏడు డిమాండ్లు అంగీకరిస్తేనే

శాంతి చర్చలు

అమెరికాకు తేల్చిచెప్పిన ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి):యుద్ధం వల్ల రాజకీయంగా నష్టం జరిగినా.. ఇరాన్‌పై సైనిక చర్య విషయంలో వెనక్కి తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త అణు ప్రతిపాదనను అగ్రరాజ్యానికి ఇరాన్ పంపింది. శాంతి చర్చలు కొనసాగాలంటే తాము అమెరికాకు పంపిన ఏడు డిమాండ్లు అంగీకరించాల్సిందేనని టెహ్రాన్ తేల్చిచెప్పింది. అప్పుడే అణు చర్చలు జరుపుతామని స్పష్టం చేసింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఈ డిమాండ్లు అమెరికాకు చేరాయి. ఇరాన్ పంపిన డిమాండ్ల జాబితా అధికారికంగా బయటకు వెల్లడికాలేదు. అయితే వాటి గురించి అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధాన్ని, ఆంక్షలను ఎత్తివేయడం, ఫ్రీజ్ చేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, యుద్ధం కారణంగా కలిగిన నష్టాలకు పరిహారం చెల్లించడం, లెబనాన్ వంటి ఇతర ప్రాంతాలలో జరుగుతోన్న ఘర్షణలను పూర్తిగా ముగించడం, ఇరాన్ భూభాగాలపై దాడులు నిలిపివేయడం వంటివి అందులో ఉన్నాయని పేర్కొన్నాయి.ఇరాన్ వద్ద ఉన్న అత్యంత శుద్ధి చేసిన యురేనియం నిల్వలను పూర్తిగా వదిలేయాలని అమెరికా డిమాండ్ చేస్తోంది (ఎతీజీని–జూం). తమ దేశంలోనే అంతర్జాతీయ పర్యవేక్షకుల ఆధ్వర్యంలో దానిని నిర్వీర్యం చేయడానికి సిద్ధమే కానీ.. దేశం దాటించేది లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది.

పంట బీమాతో రైతులను ఆదుకోండి

హైదరాబాద్(జనంసాక్షి):కాంగ్రెస్ ప్రభుత్వ విద్యుత్ కోతల కారణంగా వేలాది ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలిపిచెడ్, హత్నూర మండలాల్లో ఎండిపోయిన వరి పంట పొలాలను ఆయన సందర్శించారు. పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలవుతున్నా కనీసం ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని హరీశ్ రావు ఎదుట వాపోయారు. రైతుబంధు పథకం కింద పూర్తిస్థాయిలో సాయం అందలేదని, కేవలం ఒక్క ఎకరానికే డబ్బులు వేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ప్రకటించిన రైతు రుణమాఫీ కూడా బోగస్ అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో పది మందిలో కనీసం ఒక్కరికైనా రుణమాఫీ కాలేదని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ ఇతగబచ్చిన హామీలను నమ్మి మోసపోయామని, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే తమ కష్టాలు తీరుతాయని హరీశ్ రావు వద్ద పేర్కొన్నట్లు బీఆర్ఎస్ వెల్లడించింది.ఈ సందర్భంగా హరీశ్ రావు రైతులకు ధైర్యం చెప్పారు. రైతులు అధైర్యపడవద్దని, రానున్న రెండేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి మెడలు వంచి రైతుల సమస్యలను పరిష్కరించేలా పోరాడతామని భరోసా ఇచ్చారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులను విడుదల చేయడంతోపాటు రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

సోకులకు నిధులుంటాయి.. రైతులకు ఇవ్వడానికి ఉండవా రేవంత్


బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దేవునిగుట్ట తండాలో ఎండిపోయిన వరి పంట పొలాలు పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మూసి) సుందరికరణ, ఫ్యూచర్ సిటీ ఫుట్ బాల్ సోకులకి డబ్బులు ఉంటాయి . కానీ రైతులకు ఇవ్వడానికి నిధులు లేవా? రైతుల కన్నీళ్లు కనిపించడం లేదా అంటూ సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు.రేవంత్ తెచ్చిన కరువని ఆరోపించారు. దేవాదులలో ఎన్ని గంటలు మోటార్లు నడిపారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ నీళు విడిచిపెడితే చంద్రబాబు ఆ నీళ్లను వినియోగించుకున్నారని విమర్శించారు. రైతు భరోసా పడ్డట్టు ఫేక్ మెసేజులు పంపిన రేవంత్ రెడ్డి ఫేక్ మెసేజ్, ఫేక్ మాటలకు కేరాఫ్ గా మారారని దుయ్యబట్టారు. ఫేక్ మెసేజ్ లు పంపిన వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని కోరారు. సీఎం రేవంత్ కు ప్రజలు హాలిడే ఇచ్చే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని జోస్యం చెప్పారు. కరువును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తుందని, కరువు మండలాల ప్రకటనలో ఇష్టరాజ్యాంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న చోట కరువు మండలాల ప్రకటన చేయలేదని విమర్శించారు.

రేవంత్ పాలనకు సున్నా మార్కులు

రేవంత్ పాలనకు సున్నా మార్కులు ఇవ్వొచ్చని అన్నారు.కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటలు కరెంట్ వస్తే రేవంత్ వచ్చాక 12 గంటల కరెంట్ కూడా ఇవ్వలేదని వెల్లడించారు. మెదక్ జిల్లా అంటేనే సీఎం రేవంత్ కి చిన్న చూపని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో సింగూరు ప్రాజెక్టులో తాగునీటి సమస్య ఏర్పడిందని,సంగారెడ్డి జిల్లాలో కేంద్ర సంస్థలకు నీళ్లు ఇచ్చే పరిస్థితి లేదని, బీరు కంపెనీలకు మాత్రం దర్జాగా నీళ్లు ఇస్తున్నారని మండిపడ్డారు.నిన్నటి క్యాబినెట్‌లో రైతు అంశాలపై చర్చిస్తారని అనుకున్నామని,, గ్లోబల్ సమ్మిట్, ఫ్యూచర్ సిటీ పై దృష్టి సారించి రైతులను విస్మరించారని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక బోర్, మోటార్ వేయిద్దామంటే ఒక ఎమ్మెల్యే దగ్గర, కలెక్టర్ దగ్గర రూపాయి నిధి లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల సింగూరును ఖాళీ చేసి ఎండబెట్టారని ఆరోపించారు.

యెమెన్‌లోని రద్దీ మార్కెట్‌పై వైమానిక దాడి..

- 20 మంది మృతి
- దాడికి సౌదీ అరేబియా కారణం
- హూతీ తిరుగుబాటు వర్గం ప్రకటన




టెహ్రాన్(జనంసాక్షి):యెమెన్‌లోని ఓ రద్దీ మార్కెట్‌పై జరిగిన వైమానిక దాడిలో 20 మంది మృతి చెందారు. అనేక మందికి గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని హూతీ తిరుగుబాటు వర్గం పేర్కొంది. ఈ దాడికి సౌదీ అరేబియా కారణమని ఆరోపించింది. తైజ్ ప్రావిన్సులో ఈ ఘటన జరిగిందని, అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా ధ్రువీకరించింది. హల్ అదారా మార్కెట్‌పై మూడు వైమానిక దాడులు జరిగాయని, అనేక మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారని హూతీ సైనిక అధికార ప్రతినిధులు వెల్లడించారు. కామిస్ ముషాయిత్ వైమానిక స్థావరం నుంచి యుద్ధ విమానాలు టేకాఫ్ అయ్యాయని, తైజ్ ప్రావిన్సు మీదుగా వెళ్లాయని అన్నారు. మరోవైపు, తైజ్ ప్రావిన్సు అధికారులు మాత్రం వీటిని తోసిపుచ్చారు. ఇది హూతీల చర్యేనని.. ఇక్కడ ఎలాంటి వైమానిక దాడులు జరగలేదని పేర్కొన్నారు. హూతీ తిరుగుబాటుదారులే క్షిపణులతో విచక్షణారహితంగా దాడులు జరుపుతున్నారని స్థానిక ప్రభుత్వ మీడియా కార్యాలయం పేర్కొంది.

వైద్యం పేరుతో ఇంటికి పిలిచి..

డాక్టర్‌ను దోచేసిన నటులు

కేసు నమోదు చేసిన పోలీసులు



తిరువనంతపురం(జనంసాక్షి):అత్యవసర వైద్య పరిస్థితి ఉందని.. ఇంటికి రావాలని ఓ డాక్టర్‌ను తమ ఫ్లాట్‌కు రప్పించిన నటులు ఆయన నుంచి రూ.3.5 లక్షల విలువైన వస్తువులు దోచుకున్నారు. ఈ ఘటన కేరళలోని కొచ్చిలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమవారం కొచ్చిలోని ఎసెన్ స్ప్రింగ్‌డేల్ అపార్ట్‌మెంట్ నుంచి నటి అతుల్య చంద్ర నటుడు–నిర్మాత బిబిన్ పెరుంబిల్లి స్థానిక వైద్యుడికి ఫోన్ చేశారు. తమ బంధువుకు అత్యవసర వైద్యసాయం అందించేందుకు ఇంటికి రావాల్సిందిగా కోరారు. ఉదయం 6.30 గంటల సమయంలో వైద్యుడు వారి ఫ్లాట్‌కు వెళ్లే సరికి నటీనటులతో సహా 12మంది యువతీ యువకులు ఉన్నారు.వైద్యుడు లోపలికి వెళ్లిన వెంటనే వారు అతడిపై దాడి చేశారు అతడి వద్ద ఉన్న ఫోన్, స్మార్ట్‌వాచ్, వైర్‌లెస్ ఇయర్‌ఫోన్‌లను లాక్కున్నారు. ఈ విషయం పోలీసులకు చెబితే వైద్యం చేయడానికి వచ్చి.. తమ బంధువుపై అత్యాచారానికి పాల్పడినట్లు కేసు పెడతామని బెదిరించారు. కొన్ని గంటల తర్వాత అపార్ట్‌మెంట్ నుంచి తప్పించుకున్న డాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇద్దరు నటులతో పాటు మరొకరికి అరెస్ట్ చేశామని.. మిగిలిన వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

కల్తీ పాల దందా గుట్టురట్టు

100 లీటర్ల కల్తీ పాలు, హైడ్రోజన్ పెరాక్సైడ్ స్వాధీనం

- 35 కిలోల పాలపొడి ప్యాకెట్లు పట్టివేత
- పోలీసుల అదుపులో పాల వ్యాపారి అండె శ్రీశైలం



రంగారెడ్డి, నవంబర్ 6 (జనంసాక్షి) : లాభాల పేరాశతో అమాయక ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పాల ముఠా గుట్టును ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ మహేశ్వరం జోన్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌వోటీ) పోలీసులు రట్టు చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచారం గ్రామంలో రసాయనాలతో పాలు తయారు చేస్తున్న పాల వ్యాపార కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు మెరుపు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో 100 లీటర్ల కల్తీ పాలు, హైడ్రోజన్ పెరాక్సైడ్, 35 కిలోల పాలపొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామానికి చెందిన అండె శ్రీశైలం (43) పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్, థోల్‌పూర్ పాలపొడిని కలిపి కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ విధంగా తయారు చేసిన కల్తీ పాలను హైదరాబాద్‌లోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు పోచారంలోని తయారీ కేంద్రంపై దాడి చేసి శ్రీశైలంను అదుపులోకి తీసుకున్నారు.

భారీగా సామగ్రి స్వాధీనం..

ఎస్‌ఓటీ పోలీసుల దాడి సందర్భంగా 100 లీటర్ల కల్తీ పాలు, ఒక లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్, ఒక్కొక్కటి కిలో బరువున్న 35 థోల్‌పూర్ పాలపొడి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన శ్రీశైలంతో పాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల నిమిత్తం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. చిన్నపిల్లలు, వృద్ధులు నిత్యం వినియోగించే పాలలోనే కల్తీ జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాల నివారణకు సంయుక్త ప్రణాళిక రూపొందించాలి

- గుత్తికోయలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి
- ములుగు ప్రకృతి సంపదను కాపాడుతూ పర్యాటక అభివృద్ధికి కృషి
- ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ
- రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్



ములుగు ప్రతినిధి, నవంబర్ 06(జనంసాక్షి) : అటవీ సంపదను కాపాడుతూ, వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాలను నివారించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో సంయుక్త ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శుక్రవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ బోర్డాడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాలతో కలిసి తాడ్వాయి అటవీ ప్రాంతం, ఏటూరునాగారం అభయారణ్యం, జలగలంచ దుర్గం గుట్ట ప్రాంతం, కొండాయి ఫారెస్ట్ వాచ్ టవర్ గుత్తికోయ హాబిటేషన్ ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల విశిష్టతలు, అటవీ సంరక్షణ చర్యలు, పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ, ప్రస్తుత పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సుందరమైన ప్రకృతి, తాడ్వాయి, ఏటూరునాగారం ప్రాంతాల్లోని అటవీ అందాలను పరిశీలించాలని నిర్ణయించుకున్నానని, అందులో భాగంగానే ఈ పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. దట్టమైన అడవులు, సమృద్ధమైన జీవవైవిధ్యం ములుగు జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతున్నాయని అన్నారు. వన్యప్రాణులను వేటాడటం అమానవీయమని, చట్టవిరుద్ధమైన ఇటువంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని తెలిపారు. ఇటీవల ఒక అడవి దున్నను వేటాడిన ఘటనను జిల్లా అటవీ అధికారి తన దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వాటి వెనుక ఉన్న కారణాలను సమగ్రంగా పరిశీలించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వన్యప్రాణుల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వేటను అరికట్టేందుకు పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అటవీ అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత వేగంగా స్పందించడం ఎంత అవసరమో, అసలు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. వన్యప్రాణుల వేట, అగ్ని ప్రమాదాల నివారణకు కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, అటవీ సంరక్షణాధికారులు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గుత్తికోయల గుంపును సందర్శించి, వారి జీవన పరిస్థితులు, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు. అడవులను నరికివేయకుండా జీవనోపాధి పొందేందుకు వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించవచ్చనే అంశంపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. అడవులను నరికివేయడం చట్టవిరుద్ధమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వారికి వివరించారు. అటవీ సంపదకు నష్టం కలిగించకుండా ఇతర ఉపాధి మార్గాల ద్వారా జీవనోపాధి పొందాలని సూచించారు. అభయారణ్యాన్ని మరింత మెరుగ్గా సంరక్షిస్తూ అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలను కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు. ప్రకృతి, అటవీ సంపదతోపాటు చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలు ములుగు జిల్లాలో ఉన్నాయని అన్నారు. అటవీ సంరక్షణ, పర్యాటక అభివృద్ధి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తే జిల్లాలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యటనలో పరిశీలించిన అంశాలపై రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్కతో చర్చించి, ఆమె సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిన అనంతరం జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాలపై ముందస్తు కార్యాచరణ అవసరమని జయేశ్ రంజన్ తెలిపారు. వచ్చే నెల హైదరాబాద్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో ఈ అంశంపై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, అటవీ జీవులతోపాటు అధిక ఉష్ణోగ్రతల్లో ఆరుబయట పనిచేసే కార్మికులు, గిగ్ వర్కర్లపై పడే ప్రభావాలను చర్చించనున్నట్లు వివరించారు. నిపుణుల సలహాలు, ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాల ఆధారంగా తక్షణ, ఏడాది, ఐదేళ్ల కాలానికి అవసరమైన చర్యలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రభావం తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా ముందుగానే సన్నద్ధమవుతామని పేర్కొన్నారు.



ఇద్దరు బాల కార్మికులకు విముక్తి

- టీ, మెకానిక్ షాపుల్లో అధికారుల తనిఖీలు

అయిజ, నవంబర్ 06 (జనంసాక్షి) : అయిజ పట్టణంలో వెట్టి చాకిరీ చేస్తున్న ఇద్దరు బాల కార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద ఆదేశాల మేరకు అయిజ పట్టణంలో టీ దుకాణాలు, మెకానిక్ షాపుల్లో డీడబ్ల్యూఓ సిబ్బంది తనిఖీలు నిర్వహించి ఇద్దరు బాలలను గుర్తించారు. వారిని విముక్తి కల్పించి బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరిచారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పద్మ, నవీన్, కార్మిక శాఖ సిబ్బంది అయ్యన్న, పోలీసులు పాల్గొన్నారు.

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్ రెడ్డి రాక

- భారీ పెట్టుబడులకు ప్రణాళికలు
- ప్రపంచ పారిశ్రామిక వేతలతో సమావేశం
- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- ఆధునిక వ్యవసాయ సాగుపై రైతులకు దశ దిశ నిర్దేశం
- మహిళా సాధికారత దిశగా మహిళా సంఘాలతో సీఎం ముఖాముఖి
- ప్రపంచ దేశ పారిశ్రామిక నేతలకు ఆకర్షించే వేదికగా కొడంగల్



వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 6 (జనం సాక్షి): ప్రపంచ దేశాల పెట్టుబడులు బడ పారిశ్రామికవేతలను ఆకట్టుకోవడానికి ఒక గ్రామంలో హీరో మహేష్ బాబు శ్రీమంతుడు సినిమాలో వేదికను ఏర్పాటు చేసిన సన్నివేశం వెండితెరపై చూసాం... కానీ అదే తరహాలో ప్రపంచ పారిశ్రామికవేత్తలను తెలంగాణ రాష్ట్రానికి పరిచయం చేసి పెట్టుబడులను ఆకర్షించడానికి శ్రీమంతుడు సీన్ సీఎం రేవంత్ రెడ్డి ఇలాఖా వికారాబాద్ జిల్లా కొడంగల్ లో వేదిక ఏర్పాటయింది. దాదాపు 9100 కోట్ల పెట్టుబడులతో సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ వేదికగా భారీ ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగానే ఈ నెల ఏడవ తేదీ నుంచి 9వ తేదీ వరకు వరుసగా వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. అందులో భాగంగానే జిల్లా అధికార యంత్రాంగం గత వారం రోజులుగా కసరత్తు చేసి కార్యక్రమాలను రూపొందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం రోజున రైతు మేళ ప్రారంభిస్తారు. ఆధునిక వ్యవసాయ పనిముట్లు ఆధునిక వ్యవసాయం తక్కువ వర్షపాతంతో ఎక్కువ పంటలు పండించే విధానం. రైతులకు అధిక లాభాలు వచ్చే పంటలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపడతారు. ఆదర్శ రైతులకు అర్థమయ్యే విధంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సాగుబడి కొనసాగించడానికి శాస్త్రవేత్తలు వారికి దిశ దశ నిర్దేశం చేస్తారు. ప్రపంచ దేశాల పెట్టుబడులను ఆకర్షించే కొడంగల్ ను వేదికగా చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమావేశమై భారీ ప్రణాళికలకు రూపకల్పన చేయనున్నారు. తెలంగాణ లోని వివిధ ప్రాంతాలతో పాటు కొడంగల్ లో పారిశ్రామిక వాడ ఏర్పాటు కు అనువైన ప్రాంతంగా గుర్తింపు తెస్తూ ఇక్కడ భారీ పెట్టుబడులు పెట్టడానికి ప్రణాళికలు రూపొందించనున్నారు. ఫలితంగా నిరుద్యోగ యువతీ యువకులకు అధిక ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. అంతేకాకుండా లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ ఎక్స్టెన్షన్ ప్రారంభించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం రోజున మహిళా సాధికారత దిశగా మహిళా సంఘాలతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నవారు. అంతేకాకుండా ఆదివారం రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు జరగనున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పగ్గాలు చేపట్టిన తర్వాత రెండోసారి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నారు. ఈసారి పుట్టినరోజు వేడుకలకు కొడంగల్ వేదిక కానున్నది. సొంత నియోజకవర్గం పుట్టినరోజు వాటికి తోడు దీపావళి పండగ అన్ని కలిసి రావడంతో ధూంధాంగా కార్యక్రమాలు జరగనున్నాయి. బర్త్ డే గిఫ్ట్ దీపావళి సందర్భంగా కొడంగల్ కు మరిన్ని వరాలను సీఎం రేవంత్ రెడ్డి కురిపించే అవకాశం ఉంది. అదే రోజు పాఠశాలలు కళాశాలలు పోలీస్ భవనాలు సమీకృత భవనాలు ఆరోగ్య ఉప కేంద్రాలు అంగన్వాడి భవనాలు ప్రారంభించి కొన్నిటికి శంకుస్థాపనలు చేయమన్నారు. సోమవారం రోజున సాయంత్రం కొడంగల్ లో భారీ రైతు బహిరంగ సభ జరగనున్నది. ఈ కార్యక్రమం ముగించుకొని సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ వెళ్తారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు రైతులు మహిళలు పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యేలు మంత్రులు కార్పొరేషన్ చైర్మన్లు భారీగా తరలి రావడానికి అవకాశం ఉన్నందున వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి చర్యలు చేపట్టారు.



వెయ్యి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు

- మందమర్రి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్, నవంబర్ 06(జనంసాక్షి): మందమర్రి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శుక్రవారం మందమర్రిలోని బి-1 క్యాంపు కార్యాలయంలో 68 మంది కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి చెక్కులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మందమర్రిలో సింగరేణి భూములను సేకరించి సుమారు వెయ్యి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలో నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, విధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీప్‌ఫేక్ వీడియోలతో ఎమ్మెల్సీకి బెదిరింపులు

- ఆరుగురు అరెస్ట్

రాజేంద్రనగర్, నవంబర్6 (జనంసాక్షి) : ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌కు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని, డబ్బులు ఇవ్వకపోతే ప్రాణహాని కలిగిస్తామని బెదిరించిన ఆరుగురు నిందితులను నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా ఎమ్మెల్సీని రూ.5 కోట్లు డిమాండ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్థిక ఇబ్బందులతో త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిందితులు ఎమ్మెల్సీని లక్ష్యంగా చేసుకున్నారు. ఆయన రాజకీయ, సామాజిక ప్రతిష్టకు భంగం కలిగించేలా మార్ఫింగ్ ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని బెదిరించారు. ఇప్పటికే రూ.5 లక్షలు వసూలు చేసి, మరో రూ.5 లక్షలు డిమాండ్ చేశారు.ఈ క్రమంలో నవంబర్ 5న ఇబ్రహీంబాగ్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద నగదు తీసుకుంటుండగా పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మరో నిందితుడిని అరెస్టు చేశారు.అరెస్టయిన వారిలో మహ్మద్ మోసిన్ ఖాన్ (35), ఫాతిమా బేగం అలియాస్ రీమా (29), మహ్మద్ సమీర్ (20), మహ్మద్ జమీర్ (20), మహ్మద్ ఇమ్రాన్ (18), సయ్యద్ రెహాన్ (20) ఉన్నారు. వీరి నుంచి రూ.4.70 లక్షల నగదు, రెండు ఆటోలు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు ఏ-1తో పాటు ఏ-4 నుంచి ఏ-9 వరకు, ఏ-14 పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం గాలింపు కొనసాగుతోందని వెల్లడించారు. డీప్‌ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫొటోలతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే డబ్బులు చెల్లించకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సైబరాబాద్ పోలీసులు ప్రజలకు సూచించారు.

మహిళా శక్తే రాష్ట్ర ప్రగతికి మూలం

కంగన్ హాల్ నుంచి పెట్రోల్ బంక్ దాకా... మహిళలే వ్యాపారవేత్తలు!

- ప్రాజెక్టుల నుంచి పింఛన్ల దాకా... మహిళల ఆర్థిక పురోగతికే ప్రభుత్వం ప్రాధాన్యం
- ములుగుకు 22 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, నవంబర్ 06(జనంసాక్షి) : మహిళా శక్తే రాష్ట్ర ప్రగతికి మూలమని, మహిళా సంఘాల సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించేందుకు ఇందిరా మహిళా శక్తి ద్వారా ప్రభుత్వం విభిన్న వ్యాపార అవకాశాలను అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. శుక్రవారం ములుగు మండలంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జంగాలపల్లి, ఇంచర్ల గ్రామాల్లో మొత్తం రూ.11 లక్షలతో ఏర్పాటు చేసిన ఐదు దుకాణాలను మంత్రి ప్రారంభించారు. బ్యాంకు లింకేజీ ద్వారా జంగాలపల్లిలో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణం, కంగన్ హాల్, కిరాణా దుకాణంతోపాటు గ్రామ సంఘం కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ఇంచర్లలో ఏర్పాటు చేసిన రెండు కిరాణా దుకాణాలను ప్రారంభించారు.

తదనంతరం ములుగు మండలం గట్టమ్మ ప్రాంతంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సహకారంతో రూ.150 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న గట్టమ్మ మహిళా సమాఖ్య ఫిల్లింగ్ స్టేషన్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంచర్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కిరాణా, వస్త్ర, గాజుల దుకాణాలతో పాటు పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ యూనిట్లు, బస్సుల నిర్వహణ, యూనిఫాంల కుట్టు వంటి రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గట్టమ్మ మహిళా సమాఖ్య పెట్రోల్ బంకు నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి మహిళా సంఘాలకు అప్పగించాలని బీపీసీఎల్ ప్రతినిధులను మంత్రి కోరారు. శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన బీపీసీఎల్ ప్రతినిధి సుధీర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత జిల్లాలోని మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో పెద్ద ఎత్తున ప్రారంభోత్సవం నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ విక్రయాల నిర్వహణను మహిళలు చేపట్టి, సమాఖ్య సభ్యులకు ఆదాయం సమకూర్చేలా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళల రాకపోకలకు ఆర్థిక భారం తగ్గిస్తోందని, మహిళల పురోగతికి ఉపయోగపడే అవకాశాలను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నెల 8న ఆదివారం కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రంలో కొత్తగా దాదాపు నాలుగున్నర లక్షల మందికి పింఛన్లు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. వీరిలో మూడున్నర లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 22 సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, ఎం సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ, బీపీసీఎల్ ప్రతినిధి సుధీర్, విద్యుత్ శాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు ఖర్చు చేయట్లేదేంటి?

కలెక్టర్లపై సీఎస్ ఆగ్రహం

- సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచండి: సీఎస్ సంజయ్ జాజు
- ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటిపై సీఎస్ కీలక ఆదేశాలు



మహబూబ్‌నగర్, బ్యూరో నవంబర్ 06 (జనం సాక్షి): ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, సంక్షేమ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మరింత మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్ఓ నిర్మల తదితరులు పాల్గొన్నారు. పీఎం శ్రీ పథకం కింద రూ.538 కోట్లు కేటాయించగా 10% కూడా ఖర్చు కాలేదని, సమగ్ర శిక్ష కింద రూ.1,763 కోట్లలో రూ.79 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని సీఎస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జనవరి మొదటి వారంలోగా నిధుల వ్యయాన్ని గరిష్ట స్థాయికి తీసుకెళ్లాలని, పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వేసవి వరకు తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని, నవంబర్ 15లోగా చేతిపంపులు, బోర్ల మరమ్మతులు పూర్తి చేయాలని, నవంబర్ 15 నుండి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి తాగునీటి కమిటీ వేయాలని ఆదేశించారు. విబిజి రాంజీ ద్వారా మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని, నాణ్యతతో పనులు చేపట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, మొదటి విడతలో లక్ష ఇళ్ల మంజూరు పెండింగ్‌లో ఉందని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఉచిత ఇసుక, రూ.230కే సిమెంట్ బస్తా అందించాలని సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
7 నవంబర్ 2026

పండుగ పేరుతో మనిషి మనుగడకే ప్రమాదం!

సంపాదకీయం

పండుగ అంటే ఆనందం. వెలుగులు నింపుకోవడం. కుటుంబాలతో కలిసి సంబరాలు చేసుకోవడం. కానీ ఆ సంబరాలే మనిషి ప్రాణాల మీదకు వస్తే? ఆనందం పేరుతో గాలిలో విషాన్ని నింపి, పీల్చే ప్రతి శ్వాసనూ ప్రమాదకరంగా మారిస్తే? ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలో కనిపిస్తున్న దృశ్యం ఇదే. దీపావళి వెలుగుల వెనుక కాలుష్యపు చీకట్లు కమ్ముకున్నాయి. ఆకాశంలో బాణసంచా వెలుగులు మెరుస్తుంటే.. నేలపై మనుషుల ఊపిరి ఉక్కిరిబిక్కిరవుతోంది. పండుగ పేరుతో మనిషి మనుగడకే ముప్పు వాటిల్లుతున్న దుస్థితి నెలకొంది.

ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 382కు చేరడం సాధారణ పరిణామం కాదు. ఇది అత్యంత తీవ్రమైన హెచ్చరిక. ఇప్పటికే 'చాలా పేలవమైన' స్థాయికి చేరిన గాలి నాణ్యత ప్రజారోగ్యంపై ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇండియా గేట్ పరిసరాల్లోనే కాలుష్యపు దట్టమైన పొరలు కనిపిస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గాలి నాణ్యత మరింత దిగజారకుండా గాలి నాణ్యత నిర్వహణ కమిషన్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్)-3 ఆంక్షలు విధించాల్సి వచ్చింది. నిర్మాణ పనులపై ఆంక్షలు, పాత వాహనాల రాకపోకలపై పరిమితులు, క్రషర్లు, గనుల కార్యకలాపాల నిలిపివేత వంటి చర్యలు చేపట్టడం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో చెబుతోంది. అయితే ప్రశ్న ఒక్కటే.. ప్రజలు ఊపిరి పీల్చుకోలేని స్థితికి చేరిన తర్వాతే ప్రభుత్వాలకు ఈ ప్రమాదం కనిపిస్తుందా?

కాలుష్యం అనేది కేవలం కంటికి కనిపించే పొగ కాదు. అది మనిషి శరీరంలోకి ప్రవేశించే నిశ్శబ్ద విషం. సూక్ష్మ ధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయి రక్తప్రసరణ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ వ్యాధులున్నవారే కాదు.. ఆరోగ్యంగా ఉన్నవారూ దీని బారిన పడుతున్నారు. గుండె సంబంధిత సమస్యలు, పక్షవాతం ముప్పు పెరుగుతోంది. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు మరింత ప్రమాదంలో పడుతున్నారు. పీల్చే గాలే విషపూరితమైతే ఆసుపత్రులు ఎన్ని పెంచినా ప్రజారోగ్యాన్ని కాపాడలేవు. మందులు ఎన్ని అందించినా కాలుష్యాన్ని శరీరం నుంచి పూర్తిగా తొలగించలేవు. మనిషికి ప్రాణాధారమైన గాలినే విషతుల్యం చేస్తున్న అభివృద్ధి ఎవరికి అవసరం?

ఇది ఒక్క దీపావళి వల్ల ఏర్పడిన సమస్య కూడా కాదు. పంట వ్యర్థాల దహనం, వాహనాల నుంచి వెలువడే పొగ, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ రంగం నుంచి వెలువడే ధూళి, నగరాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, వాతావరణ పరిస్థితులు.. ఇవన్నీ ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలు. వీటికి తోడు పండుగల సమయంలో విచ్చలవిడిగా కాల్చే బాణసంచా కాలుష్య తీవ్రతను మరింత పెంచుతోంది. ఏటా శీతాకాలం సమీపించగానే ఢిల్లీ గ్యాస్ ఛాంబర్‌గా మారడం, ఆ తర్వాత ప్రభుత్వాలు ఆంక్షలు ప్రకటించడం, కొన్ని రోజులు గడిచాక సమస్యను మరిచిపోవడం ఒక ఆనవాయితీగా మారింది. సంక్షోభం వచ్చినప్పుడు సమీక్షలు.. పరిస్థితి చక్కబడగానే నిర్లక్ష్యం. ఇదేనా పాలన?

గ్రాప్-3 ఆంక్షలతో నిర్మాణ రంగం, రవాణా, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు నష్టపోవచ్చు. వారి ఉపాధిపై ప్రభావం పడవచ్చు. కానీ ప్రజలు ప్రాణాలతో ఉండటమే ప్రశ్నార్థకమైనప్పుడు ఆర్థిక కార్యకలాపాల గురించి మాత్రమే ఆలోచించడం ఎంతవరకు సమంజసం? అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ భారాన్ని కేవలం సామాన్యులపైకి నెట్టేయడం కూడా సరికాదు. కాలుష్యాన్ని సృష్టిస్తున్న పరిశ్రమలు, నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలు, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న యంత్రాంగంపై కఠిన చర్యలు తీసుకోవాలి. కాలుష్య నియంత్రణలో ప్రభుత్వాల వైఫల్యాలకు ప్రజలు తమ ఆరోగ్యంతో మూల్యం చెల్లించాల్సిన అవసరం లేదు.

ఢిల్లీ సమస్య ఢిల్లీతోనే ఆగిపోదు. జాతీయ రాజధాని ప్రాంతంతో పాటు దేశంలోని ఇతర మహానగరాలూ ఇదే ప్రమాదం వైపు పయనిస్తున్నాయి. హైదరాబాద్ సహా అనేక నగరాల్లోనూ వాహనాల రద్దీ, నిర్మాణ ధూళి, పారిశ్రామిక కాలుష్యం ఆందోళన కలిగిస్తున్నాయి. అందువల్ల ఇది ఒక నగరానికి, ఒక రాష్ట్రానికి పరిమితమైన సమస్యగా చూడరాదు. కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించాలి. ప్రజా రవాణాను బలోపేతం చేయాలి. పరిశ్రమల ఉద్గారాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. పంట వ్యర్థాలను కాల్చకుండా రైతులకు ఆచరణ సాధ్యమైన ప్రత్యామ్నాయాలు, ఆర్థిక సహకారం అందించాలి. నిర్మాణ ధూళి నియంత్రణను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలి. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించే వారిపై రాజకీయ పలుకుబడితో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలి.

ప్రజల బాధ్యత కూడా తక్కువేమీ కాదు. పండుగ అంటే విచ్చలవిడిగా బాణసంచా కాల్చడం కాదు. ఇతరుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి ఆనందాన్ని వెతుక్కోవడం సంస్కృతి కాదు. ఒకరి సంబరం మరొకరి అనారోగ్యానికి కారణమైతే ఆ సంబరానికి అర్థమే లేదు. పర్యావరణహిత పండుగల దిశగా సమాజం అడుగులు వేయాలి. అయితే వ్యక్తిగత బాధ్యతను గుర్తుచేస్తూనే ప్రభుత్వ బాధ్యత నుంచి దృష్టి మళ్లించకూడదు.

స్వచ్ఛమైన గాలి ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలతో లభించే వరం కాదు. అది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. ఆ హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత పాలకులదే. అభివృద్ధి పేరుతో ప్రకృతిని ధ్వంసం చేస్తూ, పండుగల పేరుతో గాలిని విషతుల్యం చేస్తూ, ఆ తర్వాత ఆసుపత్రుల్లో చికిత్సలు అందించడం పాలన అనిపించుకోదు. మనిషి బతకడానికి అవసరమైన గాలినే అందించలేని వ్యవస్థ సాధించిన అభివృద్ధి ఎవరి కోసం?

దీపావళి చీకటిని పారద్రోలే పండుగ కావాలి. కానీ బాణసంచా పొగతో భవిష్యత్తునే చీకటిమయం చేసే పండుగ కాకూడదు. వెలుగుల కోసం విషాన్ని పీల్చే దుస్థితి నుంచి సమాజం బయటపడాలి. లేకపోతే రాబోయే తరాలకు మనం అందించేది వెలుగుల వారసత్వం కాదు.. విషవాయువులతో నిండిన ఒక ప్రమాదకర ప్రపంచం. పండుగలు ఏటా వస్తాయి.. కానీ విషపూరితమైన గాలి మనిషి ఆయుష్షును ఏటా కుదిస్తోంది. ఇప్పటికైనా మేల్కొనకపోతే రేపు పీల్చడానికి గాలి కూడా మిగలకపోవచ్చు.

దీపావళి

ఒక్కో పండుగకు
ఒక్కో కథనం విశ్వాసం
కొన్నిటికి పురాణాలు శాస్త్రాలు మూలం
కొన్నిటికి ఘనచరిత్రలు ఆధారం
కానీ విశ్వంలో త్రివేణి సంగమ
అరుదైన సమ్మేళన పండుగ మాత్రం
అతిపెద్ద సమ్మోహన వేడుక మాత్రం
కచ్చితంగా కేవలం దీపావళి!
ఇది కోట్లాది దీపజ్యోతుల ప్రవాహ హేళి!!
ఇది కోట్లాది జనుల పరవళ్ల కేళి!!!
దీపావళి త్రేతా ద్వాపర
యుగాల కథ మాత్రమే కాదు!
ఒక రామాయణా మహాభారత
కావ్యాల సారాంశం మాత్రమే కాదు!!
పురాణమో శాస్త్రమో కేవలం చరిత్రనో
అసలే కాదు! దీపావళి మూడిటిని
ఒక్క తాటి మీదకు తెచ్చిన
అద్భుత కాలప్రకృతి ఆవిష్కరణ!!!
కారణం ఈ పండుగకు
భగవంతుడే స్వయంగా
సృష్టించిన శాస్త్రమయ్యాడు!
భూమి మీదకు దిగివచ్చిన
పవిత్ర అవతారమయ్యాడు!!
సకలజనుల ఉద్ధరణకు బ్రతికి చూపించిన
ఉత్తమ మానవుడయ్యాడు!!!

కోటం త్రిశూల్
8523005678

ఎంసీపీఐ(యు) కమ్యూనిస్టు ఐక్యతకు సిద్ధంగా ఉంది

మరి ఇతర కమ్యూనిస్టు పార్టీలు ఎందుకు వెనుకడుగు వేస్తున్నాయి? భారత కమ్యూనిస్టుల ఐక్యతకు ఇదే సరైన సమయం - విభజనల చరిత్రకు ముగింపు పలికి ఐక్యత చరిత్రను నిర్మిద్దాం! విభజనలతో బలహీనపడిన కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునర్నిర్మించాల్సిన చారిత్రక బాధ్యత నేటి కమ్యూనిస్టు నాయకత్వంపై ఉంది. మార్క్సిజం మనకు నేర్పిన ఐక్యతా స్ఫూర్తిని ఆచరణలో పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.



ఐక్యత గురించి మాట్లాడటమే కాదు, ఆచరణలో చూపించాలి! భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఒక చారిత్రక వారసత్వం. కార్మికవర్గ హక్కుల కోసం, రైతాంగ విముక్తి కోసం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా, సామాజిక సమానత్వం కోసం కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు దేశ చరిత్రలో చెరగని ముద్ర వేశాయి. ముఖ్యంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక గొప్ప చారిత్రక ఘట్టం.

అయితే నేడు ఆ ఉద్యమం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఏమిటి? ఒకప్పుడు దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన కమ్యూనిస్టు శక్తులు ఎందుకు బలహీనపడ్డాయి? ప్రజా సమస్యలు పెరుగుతున్నా కమ్యూనిస్టు ఉద్యమం ఎందుకు సమగ్ర రాజకీయ ప్రత్యామ్నాయంగా ఎదగలేకపోతోంది? దీనికి అనేక కారణాలున్నప్పటికీ, కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగుతున్న విభజనలు, పరస్పర దూరం, నాయకత్వాల మధ్య సమన్వయ లోపం ప్రధానమైన అంశాలు. ఈ పరిస్థితుల్లో భారత కమ్యూనిస్టు ఉద్యమం ముందు ఒక చారిత్రక ప్రశ్న నిలుస్తోంది.

కమ్యూనిస్టు ఐక్యత అవసరమని అందరూ అంగీకరిస్తున్నప్పుడు, ఆ ఐక్యతను ఆచరణలోకి తీసుకురావడానికి ఎందుకు ముందుకు రావడం లేదు? ఎంసీపీఐ(యు) ఈ ప్రశ్నను ఇతర పార్టీలపై వ్యక్తిగత విమర్శగా కాకుండా, భారత కమ్యూనిస్టు ఉద్యమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాజకీయ, సైద్ధాంతిక చర్చకు ఆహ్వానంగా ముందుకు తెస్తోంది.

1. కమ్యూనిస్టు ఉద్యమానికి ఐక్యత ఎందుకు అవసరం?

1848లో కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక ప్రపంచ కార్మికవర్గానికి ఐక్యతా సందేశాన్ని ఇచ్చింది. ప్రపంచ కార్మికులారా ఏకంకండి! అనే పిలుపు కేవలం ఒక నినాదం కాదు. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా శ్రమజీవులందరూ సంఘటితమై పోరాడాలనే చారిత్రక పిలుపు. మార్క్సిజం మనకు నేర్పింది సమాజాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం, దోపిడీ మూలాలను గుర్తించడం, కార్మికవర్గాన్ని రాజకీయంగా సంఘటితం చేయడం. అలాంటి మార్క్సిజాన్ని అనుసరిస్తున్నామని చెప్పుకునే కమ్యూనిస్టు పార్టీలు తమ మధ్య ఉన్న విభేదాలను శాశ్వతంగా కొనసాగించడం ఎంతవరకు సమంజసం?

సిద్ధాంతశీ పై భిన్నభిప్రాయాలు ఉండవచ్చు .రాజకీయ వ్యూహాల్లో తేడాలు ఉండవచ్చు. పోరాట పద్ధతుల్లో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. కానీ ఇవేవీ చర్చకు అతీతమైనవి కావు. భిన్నాభిప్రాయాలను పరిష్కరించుకోవడానికి కమ్యూనిస్టు పార్టీలకు ఉన్న మార్గం చర్చ, ప్రజాస్వామ్యం, పరస్పర గౌరవం. ఐక్యత అంటే భిన్నాభిప్రాయాలను వదులుకోవడం కాదు. భిన్నాభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకొని ఉమ్మడి లక్ష్యం కోసం కలిసి పనిచేయడం.

2. 1964 విభజన నుంచి నేటి వరకు - ఇంకా ఎన్ని విభజనలు?

1964లో భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సీపీఐ, సీపీఎం మధ్య విభజన జరిగింది. అనంతర కాలంలో నక్సల్బరీ ఉద్యమం నేపథ్యంలో మరో విప్లవ కమ్యూనిస్టు ప్రవాహం ఏర్పడింది. కాలక్రమంలో అనేక పార్టీలు, గ్రూపులు, సంస్థలు ఆవిర్భవించాయి. ప్రతి విభజనకు దాని కాలంలోని రాజకీయ, సైద్ధాంతిక, వ్యూహాత్మక కారణాలున్నాయి. వాటిని చారిత్రకంగా పరిశీలించాలి. కానీ నేడు మనం ఆలోచించాల్సింది గతంలో ఎవరు సరైనవారు, ఎవరు తప్పు అనే చర్చను నిరంతరం కొనసాగించడం మాత్రమే కాదు.

గత విభజనల నుంచి మనం ఏమి నేర్చుకున్నాం? భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఎలాంటి ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకోవాలి? ఇప్పటికే ఉన్న కమ్యూనిస్టు శక్తులను ఎలా ఐక్యం చేయాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి.

విభజనల చరిత్రను సమర్థించుకుంటూ కాలం గడపడం కంటే, ఐక్యతకు కొత్త చరిత్రను నిర్మించడం నేటి అవసరం.

3. ఎంసీపీఐ(యు) ఐక్యతకు సిద్ధంగా ఉన్నప్పుడు ఇతర పార్టీలు ఎందుకు ముందుకు రావడం లేదు?

ఈ ప్రశ్న భారత కమ్యూనిస్టు ఉద్యమంలో గంభీరమైన చర్చకు దారితీయాలి. ఎంసీపీఐ(యు) ఆవిర్భావ లక్ష్యాల్లో కమ్యూనిస్టు ఐక్యతకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. పార్టీ పేరులోని 'యు' అంటే యూనిటీ - ఐక్యత. ఇది కేవలం పేరులోని అక్షరం మాత్రమే కాకుండా, కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత పట్ల ఒక రాజకీయ ఆకాంక్షను ప్రతిబింబిస్తుంది. కమ్యూనిస్టు ఉద్యమంలోని విభజనలను అధిగమించి, మార్క్సిజం-లెనినిజం పునాదిగా ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలనే లక్ష్యం చర్చకు రావాలి.

అయితే ప్రశ్న ఏమిటంటే:

సీపీఐ, సీపీఎం మధ్య చారిత్రక విభేదాలను అధిగమించే చర్చలు ఎందుకు పరిమితంగా ఉన్నాయి? విప్లవ కమ్యూనిస్టు శక్తుల మధ్య ఐక్యతకు ఉన్న అడ్డంకులను తొలగించడానికి ఎందుకు సమగ్ర ప్రయత్నం జరగడం లేదు? చిన్న, పెద్ద పార్టీలనే తేడా లేకుండా అన్ని కమ్యూనిస్టు సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఎందుకు చొరవ చూపడం లేదు? ఐక్యత గురించి మాట్లాడే పార్టీలు తమ ఆచరణలో ఐక్యతకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాయి?

ఈ ప్రశ్నలకు సమాధానాలు వ్యక్తిగత విమర్శలతో కాకుండా రాజకీయ, సైద్ధాంతిక చర్చల ద్వారా రావాలి.

ఎంసీపీఐ(యు) ఇతర పార్టీలను ప్రశ్నించడం వెనుక ఉద్దేశం ఎవరినీ తక్కువ చేయడం కాదు. భారత కమ్యూనిస్టు ఉద్యమం బలపడాలనే ఆకాంక్ష. ఐక్యతకు సిద్ధంగా ఉన్నవారు చర్చకు రావాలి. ఐక్యతను వ్యతిరేకిస్తున్నవారు ఉంటే తమ అభ్యంతరాలను సిద్ధాంతపరంగా వివరించాలి. మౌనం సమస్యకు పరిష్కారం కాదు.

4. కేంద్రీకృత ప్రజాస్వామ్యం - ఐక్యతకు అసలైన ప్రాతిపదిక

కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం ఒక ముఖ్యమైన సంస్థాగత సూత్రం. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే కేవలం క్రమశిక్షణ పేరుతో నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను కింది స్థాయి కార్యకర్తలపై రుద్దడం కాదు. దాని స్ఫూర్తి ప్రజాస్వామ్య చర్చ, సమిష్టి నిర్ణయం, సమిష్టి బాధ్యత.

పార్టీలోని కింది స్థాయి కమిటీల నుంచి ఉన్నత స్థాయి కమిటీల వరకు అభిప్రాయాలను వ్యక్తపరిచే అవకాశం ఉండాలి. మెజారిటీ నిర్ణయాన్ని ఆమోదించిన తరువాత మైనారిటీ అభిప్రాయం కలిగిన వారు కూడా నిర్ణయాన్ని అమలు చేయడంలో భాగస్వాములు కావాలి. అదే సమయంలో మెజారిటీ నాయకత్వం మైనారిటీ అభిప్రాయాలను గౌరవించాలి. ఐక్య కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కూడా ఈ సూత్రాలే ప్రాతిపదిక కావాలి. ఏ పార్టీ నాయకత్వం ఆధిపత్యం చెలాయించాలనే ఆలోచనకు తావుండకూడదు. ఏ ఒక్క పార్టీ తన చారిత్రక అనుభవమే అంతిమ సత్యమని భావించ కూడదు. సమిష్టి నాయకత్వం, ప్రజాస్వామిక చర్చ, సమిష్టి నిర్ణయాలు, జవాబుదారీతనం ఐక్యతకు పునాదులు కావాలి.

5. వర్గ పోరాటంతోపాటు కుల నిర్మూలన పోరాటం కూడా అవసరం

భారత కమ్యూనిస్టు ఉద్యమం తన గత అనుభవాలను సమీక్షించుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన అంశం కుల సమస్య. భారత సమాజంలో కులం కేవలం సామాజిక గుర్తింపు మాత్రమే కాదు. అది ఆర్థిక వనరులు, భూమి, విద్య, ఉద్యోగాలు, అధికార పంపిణీతో ముడిపడిన వ్యవస్థ. కుల వివక్షను విస్మరించి వర్గ పోరాటం గురించి మాట్లాడటం అసంపూర్ణం. అలాగే ఆర్థిక దోపిడీని విస్మరించి కేవలం కుల సమస్యతోనే సమాజ విముక్తి సాధ్యమని భావించడం కూడా అసంపూర్ణం.

అందుకే కమ్యూనిస్టు ఉద్యమం వర్గం, కులం మధ్య ఉన్న సంబంధాన్ని శాస్త్రీయంగా విశ్లేషించాలి. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, దళితులకు భూమి, ఆదివాసీలకు స్వయం నిర్ణయ హక్కులు, మహిళలకు సమానత్వం, కార్మికులకు ఆర్థిక భద్రత వంటి అంశాలను ఉమ్మడి కార్యాచరణలో చేర్చాలి. వర్గ పోరాటంలో కుల ప్రశ్నను, కుల నిర్మూలన పోరాటంలో వర్గ ప్రశ్నను విస్మరించ కూడదు. ఇది భారత కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతకు ఒక ముఖ్యమైన సైద్ధాంతిక ప్రాతిపదిక కావాలి.

6. మహాజన ఫ్రంట్ నుంచి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ వరకు -- అనుభవాలను సమీక్షించాలి

భారతదేశంలో వామపక్ష, బహుజన శక్తుల ఐక్యత కోసం గతంలో వివిధ ప్రయత్నాలు జరిగాయి. కమ్యూనిస్టు, బహుజన, సామాజిక న్యాయ ఉద్యమాల మధ్య సంబంధాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో అనేక ప్రయోగాలు ముందుకు వచ్చాయి. కృషి మహాజన ఫ్రంట్ వంటి ప్రయత్నాల నుంచి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ వరకు వచ్చిన అనుభవాలను కూడా సమీక్షించాలి. ఈ ప్రయత్నాలు ఎందుకు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు? వాటిలో రాజకీయ పరిమితులు ఏమిటి? నాయకత్వాల మధ్య సమన్వయ లోపాలేమిటి? బహుజన ఉద్యమాలను వామపక్ష రాజకీయాలతో అనుసంధానం చేయడంలో ఎక్కడ బలహీనతలు ఏర్పడ్డాయి?

ఈ ప్రశ్నలను నిజాయితీగా చర్చించాలి.

సీపీఎం, సీపీఐతో సహా అన్ని వామపక్ష శక్తులు ఈ అనుభవాలను సమిష్టిగా విశ్లేషించాలి. ఒక ప్రయత్నం ఆశించిన ఫలితం ఇవ్వకపోతే దాన్ని వదిలేయడం మాత్రమే పరిష్కారం కాదు. దాని వైఫల్యాలకు కారణాలను గుర్తించి మరింత మెరుగైన ఐక్య కార్యాచరణను నిర్మించాలి.

7. నేటి పాలక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం అవసరం

దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి.

తరువాయి భాగం రేపటి సంచికలో...



మాలోతు సాగర్
ఎంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు. సెల్ నెంబర్ 7013805411

విప్లవం ఎందుకు వెనుకబడింది..?

ఓటమిని లెక్కించడం కాదు... దాని కారణాలను వెతకడం..

ఒకప్పుడు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాగల శక్తిగా కనిపించిన ఎర్రజెండా నేడు ఎందుకు అనేక చోట్ల పరిమిత ప్రభావానికే పరిమితమవుతోంది? కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమం, అదే ప్రజల విస్తృత రాజకీయ ఆకాంక్షలకు ఎందుకు సమగ్ర నాయకత్వాన్ని అందించలేకపోతోంది..? అనేక త్యాగాలు, పోరాటాలు, జైళ్లు, నిర్బంధాలు, అమరత్వాలు ఉన్నప్పటికీ ఉద్యమం తన చారిత్రక అవకాశాలను పూర్తిగా ఎందుకు వినియోగించుకోలేక పోయింది..? ఈ ప్రశ్నలు కమ్యూనిస్టు ఉద్యమాన్ని వ్యతిరేకించేవి కావు. దాని చరిత్రను గౌరవిస్తూ, దాని పరిమితులను అర్థం చేసుకోవాలనే ప్రయత్నం.



ఒక ఉద్యమం గతంలో సాధించిన విజయాలను మాత్రమే చెప్పుకుంటూ వర్తమానాన్ని వివరించలేదు. అదే విధంగా, ప్రస్తుత బలహీనతలను చూపించి గతంలోని పోరాటాలన్నింటినీ నిరర్థకమని కొట్టిపారేయడమూ చారిత్రక అవగాహన కాదు. చరిత్రను అర్థం చేసుకోవాలంటే విజయాలను, వైఫల్యాలను రెండింటినీ పరిశీలించాలి. ఏ పరిస్థితుల్లో ప్రజా ఉద్యమాలు విస్తరించాయి..? ఏ సందర్భాల్లో ప్రజల నుంచి దూరమయ్యాయి..? ఏ సిద్ధాంతపరమైన అంచనాలు వాస్తవికతను పట్టుకు న్నాయి.? ఎక్కడ సిద్ధాంతం యాంత్రిక సూత్రంగా మారింది..? ఏ సంస్థాగత నిర్మాణాలు ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేశాయి..? ఎక్కడ నాయకత్వం, సంస్థ, సిద్ధాంతం ప్రజలపై ఆధిపత్యం చెలాయించే స్థితికి చేరాయి..? లాంటి అంశాలను వాస్తవికతతో సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

అయితే భారత కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సంక్షోభానికి పార్టీల మధ్య చీలికలే ప్రధాన కారణమని కొందరు భావిస్తున్నారు. కమ్యూనిస్టులంతా ఒకే పార్టీగా ఉంటే వారి బలం పెరుగుతుందని, ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించగలరని, ప్రజా ఉద్యమాలకు సమన్వయ నాయకత్వం లభిస్తుందని వారు వాదిస్తున్నారు. ఈ వాదనలో కొంత వాస్తవం ఉంది. అనవసరమైన విభజనలు శక్తులను చీల్చవచ్చు. పరస్పర విమర్శలు వ్యక్తిగత శత్రుత్వాలుగా మారితే ప్రజల్లో విశ్వాసం తగ్గవచ్చు. ఒకే సమస్యపై పనిచేసే సంస్థలు పరస్పరం పోటీపడటం వల్ల ఉమ్మడి పోరాటాలు బలహీనపడవచ్చు. కానీ చీలికలన్నింటినీ ఒకే కారణంతో వివరించగలమా..? అన్ని విభేదాలూ వ్యక్తిగత అహంకారాల వల్లే ఏర్పడ్డాయా..? పార్లమెంటరీ రాజకీయాలు, సాయుధ పోరాటం, ఎన్నికల భాగస్వామ్యం, సామాజిక మార్పు, కుల నిర్మూలన, జాతీయస్థాయి పరిణామాలు వంటి అంశాలపై వచ్చిన విభేదాలన్నీ కేవలం నాయకుల మధ్య తగాదాలేనా..? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఐక్యతా - విలీనమే పరిష్కారమని ప్రకటించడం తొందరపాటు అవుతుంది. ఎందుకంటే ఒకే సంస్థలో ఉండటం ఐక్యతకు హామీ కాదు. బయటికి ఒకటిగా కనిపించే పార్టీ లోపల తీవ్రమైన అధికార పోటీలు, అభిప్రాయ స్వేచ్ఛపై పరిమితులు, సామాజిక ప్రాతినిధ్య లోపాలు ఉండవచ్చు. మరోవైపు వేర్వేరు సంస్థలు కొన్ని సమస్యలపై ప్రజాస్వామికంగా కలిసి పనిచేయగల స్థితిలో ఉండవచ్చు. అందువల్ల మనం పరిశీలించాల్సింది పార్టీల సంఖ్య మాత్రమే కాదు, వాటి మధ్య విభేదాల స్వభావం, ప్రజలతో సంబంధం, అంతర్గత ప్రజాస్వామ్యం, రాజకీయ లక్ష్యాలు, ఆ లక్ష్యాలను సాధించడానికి ఎంచుకున్న పద్ధతులను కూడా.

మార్క్సిజం సమాజాన్ని దాని భౌతిక పరిస్థితులు, ఉత్పత్తి సంబంధాలు, వర్గ సంబంధాలు, చారిత్రక మార్పుల ఆధారంగా అర్థం చేసుకునే పద్ధతిని అందిస్తుంది. కానీ ఏ సిద్ధాంతమూ ఒక దేశపు నిర్దిష్ట చరిత్రను అధ్యయనం చేయడానికి బదులుగా నిలవదు. అందుకే సమాజం మారుతున్నప్పుడు దానిని విశ్లేషించే రాజకీయ సంస్థలు కూడా తమ అంచనాలను పరీక్షించుకోవాలి. భారతదేశంలో కులం కేవలం సామాజిక గుర్తింపు కాదు. అది శ్రమ విభజన, గౌరవం, భూమి, విద్య, వనరులు, సామాజిక అధికారంతో ముడిపడిన చారిత్రక నిర్మాణం. అదే సమయంలో వర్గ సంబంధాలు కూడా వాస్తవమైన ఆర్థిక అసమానతలను నిర్మిస్తాయి. కులం, వర్గం ఎల్లప్పుడూ ఒకే అర్థాన్ని ఇవ్వవు కాబట్టి ఒకదానిని మరొకదానిలో కలిపేయలేం. వాటి మధ్య సంబంధాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో అధ్యయనం చేయాలి.

మరోవైపు నేటి కార్మిక ప్రపంచం కూడా మారింది. కర్మాగార కార్మికులతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులు, వలస కార్మికులు, గిగ్ కార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేసేవారు విస్తృతంగా ఉన్నారు. వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, పర్యావరణ విధ్వంసం, ఆదివాసీ భూములపై ఒత్తిడి, మహిళల శ్రమకు లభించని గుర్తింపు ఇవి వేర్వేరు సమస్యల్లా కనిపించినా వాటి మధ్య అనేక సంబంధాలు ఉన్నాయి. ఈ మార్పులను అర్థం చేసుకోకుండా పాత సంస్థాగత పద్ధతులనే కొనసాగిస్తే ప్రజలతో సంబంధం బలహీనపడే ప్రమాదం ఉంది. ఇక్కడ ప్రశ్న మార్క్సిజం అవసరమా కాదా అన్నది కాదు. మారుతున్న వాస్తవికతను విశ్లేషించడానికి దాన్ని ఎంత శాస్త్రీయంగా ఉపయోగిస్తున్నామన్నదే అసలు ప్రశ్న. ప్రజల విముక్తి కోసం ఏర్పడిన రాజకీయ సంస్థలో ప్రజలే నిర్ణయాల కేంద్రంగా ఉన్నారా..? విమర్శను శత్రుత్వంగా చూస్తున్నామా, లేక తప్పులను సరిదిద్దుకునే అవకాశంగా తీసుకుంటున్నామా..? నాయకత్వం తన నిర్ణయాలకు జవాబుదారీగా ఉందా..? కులం, లింగం, సామాజిక నేపథ్యం, ఆర్థిక స్థితి కారణంగా కొందరికి నిర్ణయాధికారం దూరమవుతోందా..? సిద్ధాంతాన్ని ప్రజల జీవితాలను అర్థం చేసుకునే సాధనంగా వాడుతున్నామా, లేక ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను సమర్థించుకునే భాషగా మార్చుకున్నామా..? ఇవి సంస్థాగత ప్రశ్నలే కాదు. రాజకీయ నైతికతకు సంబంధించిన ప్రశ్నలు కూడా. స్వేచ్ఛ, సమానత్వం గురించి మాట్లాడే ఉద్యమం తనలోనే ప్రశ్నించే హక్కును కాపాడలేకపోతే, సమాజంలో ప్రజాస్వామ్యాన్ని ఎలా విస్తరిస్తుంది..? దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే సంస్థ తనలో అధికార కేంద్రీకరణను గుర్తించకపోతే, కొత్త సంబంధాలను ఎలా నిర్మిస్తుంది..? అయితే ఈ సమస్యలన్నింటినీ వ్యక్తుల స్వభావానికి మాత్రమే ఆపాదించలేం. సంస్థాగత నియమాలు, అధికార పంపిణీ, రాజకీయ ఒత్తిళ్లు, భద్రతా పరిస్థితులు, సామాజిక నేపథ్యాలు, నాయకత్వ ఎంపిక విధానాలు కూడా వ్యక్తుల ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. అందువల్ల వ్యక్తిని విమర్శించడం మాత్రమే కాకుండా, అలాంటి ప్రవర్తనను ప్రోత్సహించే నిర్మాణాలను కూడా పరిశీలించాలి.

ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు ఉద్యమం తప్పనిసరిగా ఒకే మార్గాన్ని అనుసరించాలని ప్రకటించదు. అన్ని పార్టీలూ వెంటనే విలీనం కావాలని కూడా ముందుగానే తీర్మానించదు. సాయుధ పోరాటం, పార్లమెంటరీ రాజకీయాలు, ప్రజా ఉద్యమాలు, బహిరంగ రాజకీయ కార్యాచరణ వంటి భిన్న అనుభవాలను ఒకే కొలమానంతో కొట్టిపారేయదు. వాటి లక్ష్యాలు, చారిత్రక పరిస్థితులు, పద్ధతులు, ఫలితాలను ఆధారాలతో పరిశీలించాలనుకుంటుంది. అలాగే, వామపక్షాల బలహీనతకు వాటి అంతర్గత సమస్యలే కారణమని చెప్పి రాజ్యాధికారం, పెట్టుబడిదారీ శక్తులు, మత రాజకీయాలు, ఎన్నికల వ్యవస్థ, మీడియా ప్రభావం వంటి బాహ్య పరిస్థితులను విస్మరించదు. అంతర్గత, బాహ్య కారణాలు ఎలా పరస్పరం ప్రభావితం చేసుకున్నాయో పరిశీలిస్తుంది. మావో అనుభవాన్ని చైనా మార్గాన్ని అనుకరించడానికి కాకుండా, నిర్దిష్ట సమాజాన్ని అధ్యయనం చేయడం, విజయాల నుంచి మాత్రమే కాకుండా వైఫల్యాల నుంచి కూడా నేర్చుకోవడం అనే కోణంలో చూస్తుంది. కులం--వర్గం సంబంధాన్ని పరిశీలిస్తుంది. మాజీ మావోయిస్టులు బహిరంగ రాజకీయాల్లోకి రావడం, కొత్త పార్టీలు లేదా ఫ్రంట్ల ప్రతిపాదనలు, పాత వామపక్షాల ఐక్యత చర్చలను ఒకే రాజకీయ పరిణామంగా కలిపేయకుండా వాటి మధ్య తేడాలను గుర్తిస్తుంది. అన్నింటికంటే ముఖ్యంగా, విమర్శ తర్వాత ఏం చేయాలి అనే ప్రశ్నకు సమాధానం వెతుకుతుంది. ప్రజా సమస్యలపై ఉమ్మడి కార్యాచరణ సాధ్యమా..? కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ఎలా రూపొందించాలి..? నాయకత్వానికి జవాబుదారీతనం ఎలా కల్పించాలి..? చిన్న సంస్థలు, పెద్ద సంస్థలు సమాన గౌరవంతో ఎలా పనిచేయాలి..? భిన్నాభిప్రాయాలను శత్రుత్వంగా మారకుండా ఎలా నిర్వహించాలి..? ఐక్యత ప్రజల భాగస్వామ్యంతో ఎలా నిర్మితమవుతుంది..?

ఈ ప్రశ్నలకు సిద్ధంగా ఉన్న సమాధానాలు ఉన్నాయని భావించడం లేదు. కానీ వాటిని అడగకుండా ముందుకు వెళ్లలేమని మాత్రం భావించాలి. విప్లవం వెనుకబడిందా లేదా అన్నది నినాదాలతో నిర్ణయించలేం. దాన్ని చరిత్రతో, సమాజంతో, ప్రజల అనుభవాలతో, ఆచరణ ఫలితాలతో పరీక్షించాలి. ఎర్రజెండా గతంలో ఏమి సాధించింది అన్నది ఎంత ముఖ్యమో, అది నేడు ప్రజలకు ఏమి అందించగలదు అన్నది కూడా అంతే ముఖ్యం. ఆ ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నం విస్మరించకూడదనిది.



దారా
rajenderdamera@gmail.com

కీలక ఖనిజరంగంలో అమెరికన్ సంస్థలతో పనిచేసేందుకు సిద్ధం

- సింగరేణి ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్, జియో సైన్స్ ల్యాబొరేటరీ సౌకర్యాలు
- కీలక ఖనిజ విస్తరణపై యూఎస్ కాన్సులేట్ బృందానికి వివరించిన సింగరేణి
- ఖనిజరంగంలో సాంకేతిక,వ్యాపార భాగస్వామ్యానికి అమెరికాలో అనేక అవకాశాలు
- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతితో అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధి బృందం భేటీ



గోదావరిఖని, జనంసాక్షి : కీలక ఖనిజ రంగంలో సాంకేతిక, ఉమ్మడి భాగస్వామ్యం, తదితర అంశాలపై హైదరాబాద్ అమెరికన్ కాన్సులేట్ కు చెందిన పొలిటికల్, ఎకనామిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్ సారథ్యంలోని ఉన్నత స్థాయి అధికారుల బృందం శుక్రవారం సాయంత్రం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సింగరేణి సంస్థతో పలు వ్యాపార సంబంధ అంశాలు, అవకాశాలపై ఇరు పక్షాల వారు సుదీర్ఘంగా చర్చించారు. మైనింగ్ రంగంలో అపార అనుభవం గల సింగరేణి సంస్థ కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించిందని, ఇప్పటికే పలు దేశాలతో ఉమ్మడి భాగస్వామ్యం, సాంకేతిక సహకారంపై చర్చిస్తోందని సంస్థ చైర్మన్ వివరించారు. దీనిపై అమెరికన్ బృందం వారు స్పందిస్తూ తమ దేశంలో కీలక ఖనిజ రంగంలో ఉన్న పలు సంస్థలతో కలిసి పని చేయడానికి అవకాశాలు ఉన్నాయని వివరించారు. సింగరేణి సంస్థ ఇటీవల కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన జియో సైన్స్ ల్యాబొరేటరీలో ఉన్న సౌకర్యాలు, ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్‌లో దాగి ఉన్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి అంశాలపై కూడా అమెరికన్ బృందం ఆసక్తి చూపించింది.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రోత్సాహం, సహకారంతో సింగరేణి కీలక ఖనిజ రంగంలో ముందుకువెళ్తోందని సీఎండీ పేర్కొన్నారు. కీలక ఖనిజ రంగంలో విదేశీ పెట్టుబడులను, సాంకేతిక, పరిశోధన సంస్థల భాగస్వామ్యాన్ని సింగరేణి సంస్థ కోరుతోందని వివరించారు. అమెరికాలో పలు సంస్థలు ఇటువంటి ఆసక్తిని కలిగి ఉన్నాయని కాన్సులేట్ సభ్యులు తెలియజేశారు.ఏప్రిల్ లో అమెరికాలో జరిగే కీలక ఖనిజ సదస్సులో పాల్గొనవలసిందిగా సింగరేణిని ఆహ్వానించారు. నేటి ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను శోధిస్తున్నామన్నారు. తెలంగాణలో సింగరేణి ప్రాంతంలో కూడా వీటి ఏర్పాటుకు సుముఖంగా ఉన్నామని అమెరికన్ ప్రతినిధులు తెలిపారు. మూతపడిన ఓపెన్ కాస్ట్ గనులను సద్వినియోగం చేసేందుకు సింగరేణి పలు ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, డాటా సెంటర్లకు పీక్ అవర్స్ లో నిరంతరాయ విద్యుత్ అందించటం కోసం ఈ ప్లాంట్‌లు ఉపయోగపడతాయని సింగరేణి అధికారులు వివరించారు. తగిన పెట్టుబడి, భాగస్వామ్యంతో ఈ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అలాగే సమీపంలో గోదావరి నది నుండి కూడా నీటిని వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే పలు అమెరికన్ కంపెనీలు డాటా సెంటర్ లు ఏర్పాటు చేశాయని, మరికొన్ని కంపెనీలు కూడా వీటి ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయని.. తెలంగాణ ప్రాంతంలో ఉన్న సౌకర్యాలు వీటి ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నట్లు అమెరికన్ కాన్సులేట్ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అమెరికన్ బృందాన్ని సింగరేణి గనులను, జియో సైన్స్ ల్యాబ్ ను సందర్శించాలని ఆహ్వానించారు. ఈ సమావేశంలో అమెరికన్ కాన్సులేట్ బృందానికి చెందిన పొలిటికల్, ఎకనామిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్, పొలిటికల్, ఎకనామిక్ స్పెషలిస్ట్ లు శ్రీమలి కరి, శిబా త్రిపాఠి, కమర్షియల్ స్పెషలిస్ట్ సునేల్ కుమ్మర్, సింగరేణి సంస్థ తరపున చైర్మన్ తో పాటు డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్, కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్, జనరల్ మేనేజర్ (బిజినెస్ డెవలప్ మెంట్) కె. రామదాసు, జనరల్ మేనేజర్ (ఎక్స్ ప్లోరేషన్) పంకజ్ కులశ్రేష్ఠ, జనరల్ మేనేజర్ (పవర్ ప్రాజెక్ట్స్) గురు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరంలో 'భూతం' కలకలం!

- సోషల్ మీడియాలో ఎర్రటి ఆకారం ఫొటో వైరల్
- మైలారం, ఖాసీంపేట, మాదాపూర్ పరిసరాల్లో భయాందోళనలు
- పుకార్లు నమ్మొద్దు.. ఎస్సై నరేందర్‌రెడ్డి స్పష్టీకరణ

గన్నేరువరం, నవంబర్ 6 (జనంసాక్షి): గన్నేరువరం మండలంలో 'భూతం' కనిపించిందంటూ ప్రచారం కలకలం రేపుతోంది. గత రెండు రోజులుగా ఎర్రటి ఆకారం ఉన్న ఓ ఫొటో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో మైలారం, ఖాసీంపేట, మాదాపూర్, గన్నేరువరం చౌరస్తా పరిసర ప్రాంతాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. రాత్రి వేళ పొలం వద్ద ఎర్రటి దుస్తుల్లో ఓ ఆకారం నిలబడి ఉన్నట్లు ఫొటోలో కనిపిస్తోంది. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు, పశువులను చూసుకునేందుకు భయపడుతున్నారు. అయితే ఆ ఫొటో నిజమైనదా? లేక చీకట్లో తీసిన అస్పష్ట చిత్రమా? అనేది స్పష్టత లేకపోవడంతో పలు ఊహాగానాలు వ్యాపిస్తున్నాయి. ఈ ప్రచారంపై గన్నేరువరం ఎస్సై జి. నరేందర్‌రెడ్డి స్పందిస్తూ ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. వైరల్ అవుతున్న ఫొటో చీకట్లో లైటు వెలుతురులో తీసిన అస్పష్ట చిత్రంలా ఉందని తెలిపారు. భూతం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ప్రజలను భయపెట్టేలా ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి వేళ అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వైరల్ ఫోటోపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్థులు కోరుతున్నారు.వైరల్ ఫోటోపై విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఐటీ కారిడార్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు కృషి



శేరిలింగంపల్లి, నవంబర్ 06 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ ఐటి కారిడార్ పరిధిలో ఉదయం సాయంత్రం వేళల్లో పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ తెలిపారు. ఈ మేరకు సైబరాబాద్ జాయింట్ పోలీస్ కమిషనర్(ట్రాఫిక్ విభాగం) సన్ ప్రీత్ సింగ్ తో కలిసి శుక్రవారం కమిషనరేట్ పరిధి బయోడైవర్సిటీ జంక్షన్, ఐకియా, టీ వర్క్స్, క్వాల్ కామ్, దల్లాస్ సెంటర్ రోడ్, మైండ్ స్పేస్ రోటరీ, లైం స్టోర్ రోడ్, నాలెడ్జ్ సిటీ రోడ్ తదితర ప్రాంతాలలో ఇతర అధికారులతో కలిసి సిపి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైటెక్ సిటీ బయోడైవర్సిటీలో పీక్ అవర్స్ లో ఉండే ట్రాఫిక్ జామ్ ను వీలైనంత మేర తగ్గించడమే తమ లక్ష్యం అని, తద్వారా ఉద్యోగులు, వాహనదారుల సమస్యకు కొంత వెసులుబాటు కల్పించాలన్నది తమ ప్రధాన ఆశయంగా ఆయన అభివర్ణించారు. ట్రాఫిక్ నియంత్రణకై పీక్ అవర్స్ లో వన్ వే ట్రాఫిక్ సిస్టంను అమలు చేయాలా వద్దా అనే మీమాంసలో తాము ఈ పర్యటనను చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో పీకవర్స్ లో ట్రాఫిక్ లో స్టడీతోపాటు ఎక్కడెక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుందో, ఎక్కడెక్కడ బ్లాకులు ఏర్పడుతున్నాయో సవివరనాత్మకంగా నివేదికను తయారు చేయమని కోరడం జరిగిందని, ఇదే విషయాన్ని క్రింది స్థాయి అధికారులకు సూచించడం జరిగిందన్నారు. రోడ్డును ఆనుకొని ఉన్న ఏయే బిల్డింగ్ వల్ల ఎంత ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది, ఏయే భవనం నుండి ఎన్ని వాహనాలు ఆ సమయంలో బయటికి వస్తున్నాయి, ఆ బిల్డింగ్ కి సంబంధించిన పార్కింగ్ ఎంత ఉంది అని బ్లాక్ వైజ్ గా లెక్కలు సేకరించి తద్వారా ఒక పకడ్బందీ ప్రణాళికను సిద్ధంచేసి అనుకున్న లక్ష్యాన్ని చేరే దిశగా నిర్దిష్ట కార్యాచరణను రూపొందించి అమలు చేయడం జరుగుతుందని సిపి రమేష్ వివరించారు.

బోర్ల బాదుడు.. భూగర్భ జలాలకు ముప్పు

సత్యనారాయణపురం కాలనీలో యథేచ్ఛగా తవ్వకాలు

- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు.. వందల అడుగుల డ్రిల్లింగ్
- నిబంధనలకు విరుద్ధంగా 6 1/2 అంగుళాల బోర్ల ఏర్పాటు
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. నీటి ఎద్దడి ముప్పు
- అక్రమ బోర్ల తవ్వకాలను అడ్డుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి

బోడుప్పల్-జనంసాక్షి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి డివిజన్‌లో పరిధిలోని సత్యనారాయణపురం కాలనీలో బోర్ల తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం నూతనంగా బోర్లు వేయడంపై ఆంక్షలు విధించి, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొందరు వాటిని బేఖాతరు చేస్తూ వందల అడుగుల లోతులో బోర్లు వేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలకు తూట్లు

ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా 6 అంగుళాల డ్రిల్లింగ్‌తో బోర్లు వేస్తుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నిబంధనల ప్రకారం ఇంటి ఆవరణలో 4 1/2 అంగుళాల బోరు వేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా అధిక వ్యాసంతో బోర్లు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇష్టారాజ్యంగా బోర్లు తవ్వడం వల్ల ఇప్పటికే ఉన్న బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోయి, భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ముప్పు

మరోవైపు ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని, కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల



భూగర్భ జలాల పునఃపూరణకు ఆటంకం కలగడంతో పాటు నీటి వనరులపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే పెరుగుతున్న పట్టణీకరణ, అధిక నీటి వినియోగం కారణంగా భూగర్భ జలాలపై భారం పడుతున్న తరుణంలో విచ్చలవిడిగా బోర్లు వేస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోతే బోర్లలో నీటి మట్టాలు మరింత తగ్గి వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

అనుమతులపై అధికారుల స్పష్టత ఏది..?





కొత్తగా బోర్లు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నిస్తే.. కలెక్టర్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకున్నామని చెబుతూ తవ్వకాలు కొనసాగిస్తున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు.నిజంగానే అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేశారు? బోర్ల తవ్వకాలపై సంబంధిత శాఖల అనుమతులు, నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.ఇప్పటికే భూగర్భ జలాలు తగ్గిపోతున్న పరిస్థితుల్లో ఇష్టారాజ్యంగా బోర్లు వేస్తే భవిష్యత్తులో కాలనీ ప్రజలకు నీటి కష్టాలు తప్పవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి సత్యనారాయణపురం కాలనీలో జరుగుతున్న నూతన బోర్ల తవ్వకాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని అనుమతులు, నిబంధనలను పరిశీలించి అక్రమంగా జరుగుతున్న తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని,ప్రజలకు భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుటుంబ కలహాలే జంట హత్యలకు కారణం

నిందితుడిని అరెస్టు చేశాం.. కత్తి, కారు, మొబైల్ స్వాధీనం



శంషాబాద్,నవంబర్6(జనంసాక్షి) : మీర్‌పేట్‌లో కుటుంబ కలహాల నేపథ్యం లో కక్ష పెంచుకున్న వ్యక్తి తన అత్త, మరదలిని కత్తితో పొడిచి హత్య చేయగా, మరో వ్యక్తిని తీవ్రంగా గాయపరిచాడని శంషాబాద్ డీసీపీ బి. రాజే ష్ వెల్లడించారు. ఈ జంట హత్యల కేసులో నిందితుడు మహమ్మద్ సిద్ధిఖీ (42)ని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నవంబర్ 4న బడంగ్‌పేటలోని సాయి విహార్ నగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ వివాదాలతో తనపై కక్ష పెంచుకున్న నిందితుడు నిరంజన్ బీ, ఆమె అల్లుడు యూసుఫ్, యూసుఫ్ భార్య మహమ్మద్ రేష్మాపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో నిరంజన్ బీ, రేష్మా అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన యూసుఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా డు. అనంతరం నిందితుడు కారులో పరారయ్యాడు. మీర్‌పేట్ పోలీసులు, శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి ఈ నెల 5న నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, టీఎస్ 12 ఈఎం 9451 నంబర్ గల వాగన్‌ఆర్ కారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీపీ వి.సి. సజ్జనార్ ఆదేశాల మేరకు, డీసీపీ బి. రాజేష్ పర్యవేక్షణలో ఏసీపీ డి.వి. ప్రదీప్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

ప్రజా అవసరాల భూముల విక్రయాన్ని అడ్డుకుంటాం!


- రూ.2 వేల కోట్ల విలువైన భూముల అమ్మకానికి యత్నం
- కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి భూములపై ఎమ్మెల్యే అభ్యంతరం
- ఫైర్‌స్టేషన్, పెట్రోల్ బంకుకు స్థలాలేవి? ■పార్టీలకు అతీతంగా ఉద్యమించాలని పిలుపు



కూకట్‌పల్లి, నవంబర్ 6 (జనంసాక్షి): ప్రజా అవసరాలకు, భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను విక్రయించడాన్ని సహించేది లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భూముల అమ్మకాల నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.2 వేల కోట్ల విలువైన భూములను విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో పార్కులు, ఇండోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలు వంటి ప్రజోపయోగ సదుపాయాలను అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. కేపీహెచ్‌బీ వంటి పెద్ద నివాస ప్రాంతంలో పూర్తిస్థాయి అగ్నిమాపక కేంద్రం లేదని, పెట్రోల్ బంకు కోసం కేటాయించాల్సిన స్థలాన్ని సైతం అమ్మకానికి పెట్టేందుకు టెండర్లు పిలవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. భూముల విక్రయాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విలేకరులపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని విమర్శించారు. విక్రయాలపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు, ప్రజాసంఘాలు, అన్ని పార్టీల నాయకులు ప్రభుత్వ భూముల పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమ్మకాల నిర్ణయాన్ని ఉపసంహరించు కోకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని, టెండర్లలో పాల్గొనే ప్రయత్నాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

తెలంగాణ కరువు కష్టాలు అమిత్ షాకు కనిపించలేదా?

అమీర్‌పేట, నవంబర్ 6 (జనం సాక్షి): తెలంగాణలో 31 జిల్లాల పరిధిలోని 365 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నా కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనలో ఎలాంటి సాయం ప్రకటించకపోవడం బీజేపీ నాయకత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ విమర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ప్రజలు ఎదుర్కొంటున్న కరువు సమస్యలపై స్పందించకుండా మతపరమైన అంశాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. కరువు కారణంగా రైతులు, వ్యవసాయ కూలీలు, సామాన్య కుటుంబాలు పంట నష్టాలు, తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు సాధారణం కంటే 24 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, కరువు సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం కోరిందని తెలిపారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కరువు సాయం కోసం ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలు, ప్రజల తాగునీటి సమస్యల పరిష్కారానికి కేంద్రం సహకరించాలని, తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నిధులు విడుదలయ్యే వరకు కాంగ్రెస్ పోరాడుతుందని కోట నీలిమ స్పష్టం చేశారు.



అనుమానాస్పద స్థితిలో విదేశీ వ్యక్తి మృతి

శేరిలింగంపల్లి, నవంబర్ 06 (జనం సాక్షి): శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విదేశీ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు శుక్రవారం గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం... అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతానికి చెందిన మిచెల్ బ్రయాన్ లీ (41) తన సొంత వ్యాపార పనుల నిమిత్తం వ్యాపార భాగస్వామి డేవిడ్ వుతో కలిసి ఈ నెల 2వ తేదీన హైదరాబాద్‌కు వచ్చాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఎల్ఎన్ టెర్మినల్‌లో ఉన్న మ్యారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్ 12వ అంతస్తులోని 1218వ నంబర్ గదిలో బస చేశాడు. కాగా, ఈ నెల 4వ తేదీ సాయంత్రం నుంచి మిచెల్ తనకు వస్తున్న ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన హోటల్ సిబ్బంది గది తలుపులు తెరిచి చూడగా, మంచంపై అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే 108కు సమాచారం అందించగా, అక్కడికి చేరుకున్న వైద్య బృందం అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించింది. ఈ మేరకు అందిన ఫిర్యాదును స్వీకరించిన గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకోవడంతో పాటు మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని, మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని మరింత లోతుగా విచారిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.



నదిలో అక్రమార్కులు నిల్వ ఉంచిన ఇసుక దంపులు

అధికారులపై నమ్మకం సడలుతోందా?

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన మండల స్థాయి అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యమా..లేక అక్రమార్కులకు అండదండలు ఉన్నాయా? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో అక్రమ దందాను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా బహిరంగంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేస్తారా? లేక యథావిధిగా చూసీచూడనట్లు వదిలేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.!

బరితెగించిన ఇసుక మాఫియా!

రాజోలిలో ఇసుక మాఫియా ఆగేదెప్పుడు?

- యథేచ్ఛగా తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు
- స్థానిక అధికారులపై ప్రజల్లో అనుమానాలు

రాజోలి, నవంబర్ 6 (జనంసాక్షి): మండల కేంద్రమైన రాజోలిలో జోరుగా ఇసుక దందా నడుస్తోంది. శుక్రవారం పగటిపూటే తుంగభద్ర నదిలో ఇసుక దంపులు కనిపించడం అక్రమ ఇసుక తవ్వకాలు, నిల్వలపై అనుమానాలకు తావిస్తోంది. పగలు ఇసుకను నిల్వ చేసి, రాత్రి వేళల్లో మినీ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ ఇసుక దందా బహిరంగంగా సాగుతున్నా సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇందుకు స్థానిక అధికారుల అండ దండలు పుష్కలంగా ఉండడంతో అక్రమరవాణా జరుగుతోందని ప్రజల్లో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమపై ఎలాంటి చర్యలు ఉండవనే ధీమాతోనే అక్రమార్కులు మరింతగా బరితెగిస్తున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. అక్రమ ఇసుక రవాణాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిని బెదిరించడం భౌతిక దాడులకు దిగడంతో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోలేక ఎవరికీ చెప్పుకోవాలో అని చూస్తూ ఉండిపోతున్నమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు రాజోలిలో జరుగుతున్న అక్రమ ఇసుక మాఫియా ఆగడాలపై దృష్టి సారించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగాల్సిందే!

స్థానిక స్థాయిలో చర్యలు ఫలించడం లేదనే భావన ప్రజల్లో బలపడుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇసుక నిల్వ చేస్తున్న ప్రాంతాలు, తరలింపు మార్గాలు, రాత్రి వేళల్లో తిరుగుతున్న మినీ టిప్పర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలంటున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఇసుక తరలించే మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను గుర్తించి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
07 నవంబర్ 2026

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

● అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 6 (జనం సాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోస్గి, కొడంగల్ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టి, ముఖ్య మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూకార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, రైతుల వివరాలను ముందుగానే సేకరించి సమగ్ర జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం మండల స్థాయిలో ఎంపీడీవోలు వెంటనే టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ అధికారులు, ఏఈవోలతో సమన్వయం చేసుకోవాలనిఆదేశించారు. గ్రామాల వారీగా ఎంతమంది రైతులు, ప్రజలు కార్యక్రమానికి హాజరవు తారనే వివరాలను సేకరించి తుది జాబితా రూపొం దించాలన్నారు.రైతులు, ప్రజలను కార్యక్రమానికి తరలించే బాధ్యతను మండల స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని, వ్యవసాయ శాఖ అధికారులు తమ శాఖ విధులతో పాటు రైతుల సమీకరణలోనూ అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎంపీడీవోలు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు.కార్యక్రమానికి తరలించే బస్సుల వివరాలు, బస్సు నంబర్లు, పోలీస్ సిబ్బంది కాంటాక్ట్ నంబర్లు, బస్సులు బయలుదేరాల్సిన సమయానికి సంబంధించిన వివరాలను ప్రత్యేక ఎక్సెల్ షీట్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలు, రైతులతో వచ్చే బస్సులన్నీ ఉదయం 9 గంటలలోపు కార్యక్రమ ప్రాంగణానికి చేరుకునేలా ప్రయాణ సమయాన్ని ముందుగానే నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు అల్పాహారం, భోజనం అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించా రు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, శుభ్రమైన నీటిని వినియో గించాలని, పరిశు భ్రమైన వాతావరణంలో ఆహారాన్ని సిద్ధం చేసి పంపిణీ చేయాలని సూచించారు. ఆహార నాణ్యత విషయం లో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.మున్సిపల్ అధికారులు కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల సుందరీకరణ, పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలుతీసుకోవాలన్నారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బస్సుల రాకపోకలు, ప్రజల భద్రతకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు కూడా అవసరమైన భద్రతా ఏర్పాట్లు,అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది అందుబాటుపై ముందస్తు చర్యలుతీసుకోవాలన్నారు.మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు సంబంధించి ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని,చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులే కుండా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.కార్యక్రమం విజయ వంతంగా, ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీ య సంఘటనలు, ప్రతికూల వ్యాఖ్యలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు అధికారులు సమన్వ యంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను,ఎస్ డీసీ రాజేందర్ గౌడ్, ఏవో అనిల్ కుమార్, ఆర్డీవో రమేష్, సీ సెక్షన్ అధికారిని జయసుధ, ప్రజారోగ్య శాఖ ఎస్ ఈ విజయ్ భాస్కర్, విద్యుత్ శాఖ ఎస్ ఈ నవీన్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, డీ పీ ఆర్ వో రషీద్, సివిల్ సప్లై డీ ఎం సైదులు, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మద్దూరు, గుండు మల్ తహసీల్దార్లు మహేశ్, భాస్కర స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



నంగునూరు, నవంబర్ 6 (జనం సాక్షి) : రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్ గౌడ్ కోరారు. మండలంలోని పాలమాకుల, సిద్ధన్నపేట, గట్లమల్యాల, ఖాతా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు.తూకాల్లో వ్యత్యాసాలు లేకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు తాగునీరు, నీడ సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు ఓజాలు, సంఘ పురేందర్ ఇంగి నరేష్,, అచ్చిన సత్తయ్య, ఉపసర్పంచ్ చంద్రం, పీఏసీఎస్ డైరెక్టర్లు ముత్యాల యాదగిరి, గాండ్ల రమేష్, నాయకులు , సురేష్, శ్రీకాంత్ యాదవ్, రజినీకాంత్, ఐలేని యాదగిరి గౌడ్, బసవరాజు రాములు, రవి యాదవ్, శేఖర్ రెడ్డి, అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



నంగునూరు, నవంబర్ 6 (జనం సాక్షి) : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ అన్నారు. నంగునూరు మండలంలోని రాజగోపాల్‌పేట, వెంకటాపూర్, అంక్షాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, తేమ శాతం మరియు నాణ్యత ప్రమాణాలపై ముందుగానే అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ రంగు అశోక్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, జిన్నా శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, జీవన్ నాయక్, ప్రభాకర్, స్థానిక సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, నాయకులు కాటన్ కనకయ్య, నరసింహారెడ్డి, విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూనీడులో పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి



కొత్తపల్లి, నవంబర్ 6 (జనం సాక్షి) : భూనీడు గ్రామంలో పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ ప్రజలు, యువకులు చేపట్టిన నిరసన దీక్ష 8వ రోజుకు చేరుకుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీ మేరకు సగం ప్రభుత్వ కార్యాలయాలు భూనీడులో, మిగిలిన సగం కార్యాలయాలు కొత్తపల్లిలో ఏర్పాటు చేయాలని దీక్ష చేపట్టిన వారు డిమాండ్ చేస్తున్నారు. మండల ఏర్పాటు విషయంలో భూనీడు గ్రామానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టాలని కోరుతున్నారు. భౌగోళికంగా నందిగామ, తిమ్మారెడ్డిపల్లి, గోకుల్‌నగర్, దుప్పటిగట్టు, గొర్లోనిబావి, గొల్లగడ్డ, వాల్యానాయక్ తండా, కిషన్‌నగర్ తదితర గ్రామాలకు భూనీడు అందుబాటులో ఉంటుందని, ప్రజల సౌకర్యార్థం ఇక్కడ పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొన్నారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి

● జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు



మెదక్, నవంబర్ 6 (జనం సాక్షి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను ఓపికగా విని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం హవేలిఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని, ఫిర్యాదుల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎస్ఐ కృష్ణయ్యతో పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సివిల్ వివాదాల్లో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకోకుండా, సంబంధిత వ్యక్తులకు న్యాయస్థానాన్ని ఆశ్రయించే విధానంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి గ్రామంలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు సూచనలు చేయడంతో పాటు, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. సీసీటీవీస్, ఈ సాక్ష్య, అప్లికేషన్లలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో సీఐలు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దాల కాలనీ ప్రజల కల సాకారం

● రూ. 3 కోట్లతో పూర్తయిన గూర్లపల్లి సీసీ రోడ్డు

● శనివారం మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ప్రారంభం



మక్తల్, నవంబర్ 6 (జనంసాక్షి) : మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండి, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు సృష్టించిన గూర్లపల్లి రోడ్డు సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు రూ. 3 కోట్ల నిధులతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తి అయ్యాయి. ఈ నూతన రహదారిని శనివారం రోజున రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తమ చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత ప్రజలు నానా తంటాలు పడ్డారని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నాటి పాలకులు కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చొరవ తీసుకుని, వెంటనే ప్రత్యేకంగా రూ. 3 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి పనులను నాణ్యతతో పూర్తి చేయించారని వారు హర్షం వ్యక్తం చేశారు. నూతన రోడ్డు ప్రారంభం కానుండటంతో 7వ వార్డు ప్రజలు, కాలనీవాసులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏర్పాట్లను పరిశీలించిన వారిలో స్థానిక కౌన్సిలర్ కలాల్ శ్రీవిద్య నీల గౌడ్, మున్సిపల్ పట్టణ అధ్యక్షులు ఏ. రవికుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు రహీం పటేల్, సరిత గోవిందరావు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి



అమీన్‌పూర్, నవంబర్ 6 (జనం సాక్షి) : అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో ఉన్న సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలిని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి డిప్యూటీ కమిషనర్ కుమారి లలిత శ్రావణిని కోరారు. శుక్రవారం అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీలు, ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని కోరారు. ఆమెను కలిసిన వారిలో బీరంగూడ దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, సభ్యులు లక్ష్మికాంత రావ్, అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దండు రమేష్ యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజు, మహేష్ గౌడ్ ,శ్రీనివాస్,ప్రకాష్, మనోహర్, రామ కృష్ణ యాదవ్, రాము, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్, సురేష్ నాయక్ తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పారదర్శకంగా సర్వే చేపట్టాలి

● మెదక్ ఆర్డీవో రమాదేవి



పాపన్నపేట, నవంబర్ 6 (జనంసాక్షి) : భూముల డిజిటల్ రీసర్వే పనులను ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం ముద్దాపూర్ గ్రామంలో రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి,సిబ్బందికీ తగు సూచనలు చేశారు. గ్రామ పరిధిలో మొత్తం 405 ఎకరాల సాగు భూమికి సంబంధించి 188 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చేలా రీసర్వే పనులు చేపట్టామన్నారు. 189 ఎకరాల భూమికి సంబంధించిన రీసర్వే పనులు పూర్తైనట్లు వెల్లడించారు. తహసీల్దార్ సతీష్ కుమార్,ఆర్ఐ శరత్ తదితరులు ఉన్నారు.

రీ-సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



జడ్చర్ల, నవంబర్ 6 (జనంసాక్షి) : జడ్చర్ల మండలం అమ్మాపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మీనాంబురం ఆలయం సమీపంలో నిర్వహిస్తున్న ఆలయ భూముల రీ-సర్వే ప్రక్రియను ఆమె పరిశీలించి, పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో సమర్థవంతంగా నిర్వహించాలి

● జిల్లా స్థాయి అధికారులకు హెచ్ఆర్ఎంఎస్, ఈ-శాంక్షన్స్, ఈ-పెన్షన్‌పై శిక్షణ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 6 (జనం సాక్షి) : ప్రభుత్వ శాఖల్లో ఆర్థిక, పరిపాలనా సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఆన్‌లైన్ విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్ సూచించారు. జిల్లా ట్రెజరీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు)కు వివిధ ప్రభుత్వ ఆర్థిక, పరిపాలనా సేవలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ఎంఎస్, ఈ-శాంక్షన్స్, ఈ-పెన్షన్, ఈ-సర్వీస్ రిజిస్టర్, వార్షిక రహస్య నివేదికలు, వార్షిక పనితీరు నివేదికలు, సెలవులు, ఉద్యోగుల సేవా వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగుల సేవా వివరాల నమోదు, ఆన్‌లైన్‌లో ఆర్థిక అనుమతులు పొందడం, భవిష్య నిధి, పింఛను ప్రక్రియలు, వార్షిక నివేదికలు, సెలవుల మంజూరు తదితర అంశాలను ఆన్‌లైన్‌లో నిర్వహించే విధానాలను వివరించారు. అధికారులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రభుత్వ ఆన్‌లైన్ సేవలను సక్రమంగా వినియోగించుకోవడంపై శిక్షణ ఇచ్చారు. జిల్లా ట్రెజరీ శాఖ ఉపసంచాలకులు ఎం. శ్రీనివాస్, ఉపఖజానా అధికారి సంపత్ స్వరూప్ తదితరులు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన డీడీఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు కార్పొరేట్ స్థాయి హంగులు

● రూ.50 కోట్లతో వనపర్తిలో అత్యాధునిక విద్యా సముదాయం

● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి బ్యూరో నవంబర్ 6 (జనం సాక్షి) : ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో తీర్చిదిద్ది, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా వనపర్తి పట్టణంలో రూ.50 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల అత్యాధునిక భవన సముదాయాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. నాలుగు అంతస్తులతో నిర్మిస్తున్న ఈ విద్యా సముదాయంలో పాఠశాల, జూనియర్ కళాశాలతో పాటు అత్యాధునిక సైన్స్ ల్యాబ్‌లు, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దిష్ట గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విద్యాభ్యాసం చేసిన ఈ పాఠశాలను అత్యాధునిక విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడం వనపర్తి ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో విద్యారంగంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటైన వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది
- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల,నవంబర్ 06 (జనంసాక్షి): ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యందు సిఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్, పరకాల, నడి కూడా, ఆత్మకూరు , దామెర, సంగెం, గీసుకొండ మండలాలు,15,16,17వ డివిజన్ లకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 6841 మందికి 47కోట్ల 94 లక్షల 56వేల 510 రూ విలువగల చెక్కులను పంపిణీ చేశామన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పరకాల ఇందిరా మహిళా డైరీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్,సన్న బియ్యం పంపిణీ,మహాలక్ష్మి ,గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

పచ్చని సంసారంలో వివాహేతర సంబంధం చిచ్చు..

- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య..
- అర్ధరాత్రి నిద్రలోనే భర్తపై ఘాతుకం..
- ఎడ్లబండిపై మృతదేహం తరలింపు..
- పంచాయతీ జరగాల్సిన రోజుకు ముందే దారుణం..
- గొల్లబుద్ధారంలో కలకలం..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): కలకాలం కలిసి జీవించాల్సిన భార్యాభర్తల బంధంలో వివాహేతర సంబంధం చిచ్చుపెట్టింది. ఏడడుగులు నడిచి, జీవితాంతం తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భార్యే మరో వ్యక్తి మోజులో పడి కట్టుకున్న భర్త ప్రాణాలు తీసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో ప్రియుడితో కలిసి హత్యకు పథకం రచించినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి వేళ ఇంట్లో నిద్రిస్తున్న భర్తను హతమార్చి, మృతదేహాన్ని ఎడ్లబండిపై గ్రామ శివారుకు తరలించి పడేసినట్లు సమాచారం. క్షణిక సుఖాల కోసం కట్టుకున్న బంధాన్ని తెంచుకుని, ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న ఈ ఘటన భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారం గ్రామంలో తీవ్ర కలకలం రేపింది.

వివాహేతర సంబంధమే చిచ్చు..

గొల్లబుద్ధారం గ్రామానికి చెందిన అజ్మీర చందు నాయక్ (39)కు భార్య పావనితో కొంతకాలంగా కుటుంబ కలహాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో అదే గ్రామానికి చెందిన ధరావత్ సంతోష్‌తో పావనికి వివాహేతర సంబంధం ఏర్పడినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న చందు నాయక్ భార్యను పలుమార్లు నిలదీయడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది. కుటుంబ సమస్యను పరిష్కరించుకుని కలిసి జీవించాల్సిన పరిస్థితుల్లో వివాదం హత్యకు దారితీసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పంచాయతీకి ముందే ఘాతుకం..

భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు మూడు రోజుల క్రితం స్థానిక సర్పంచ్‌ను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయంపై శుక్రవారం పంచాయతీ నిర్వహించేందుకు సమయం కేటాయించినట్లు సమాచారం. అయితే పంచాయతీ జరిగితే తమ వ్యవహారం బయటపడుతుందనే భయంతో ముందుగానే చందు నాయక్‌ను అడ్డు తొలగించుకోవాలని పావని, సంతోష్ నిర్ణయించుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న చందు నాయక్‌పై దాడి చేసి హతమార్చినట్లు తెలుస్తోంది.

ఎడ్లబండిపై మృతదేహం తరలింపు..

హత్య అనంతరం మృతదేహాన్ని ఎడ్లబండిపై తీసుకెళ్లి చికినపల్లి గ్రామ శివారులో పడేసినట్లు సమాచారం. గ్రామస్తులకు విషయం తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఒకవైపు కుటుంబ బంధాన్ని తెంచుకున్న ఘటన, మరోవైపు మృతదేహాన్ని గ్రామ శివారులో పడేసిన తీరు స్థానికులను విస్మయానికి గురిచేసింది.



ఘటనా స్థలానికి పోలీసు అధికారులు..

సమాచారం అందుకున్న భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్‌రావు, భూపాలపల్లి, గణపురం సీఐలు శ్రీనివాస్, కరుణాకర్‌రావు, ఎస్సై పవన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఘటన వెనుక ఉన్న కారణాలు, నిందితుల పాత్ర, హత్యకు సంబంధించిన ఇతర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్షణికావేశాలకు బలవుతున్న కుటుంబ బంధాలు..

ఒక కుటుంబంలో భార్యాభర్తల మధ్య ఎన్ని విభేదాలు, సమస్యలు ఉన్నా వాటిని మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. కానీ వివాహేతర సంబంధాలు, అనుమానాలు, వ్యక్తిగత విభేదాలు చివరకు హత్యల వరకు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. ఒక వ్యక్తి ప్రాణం కోల్పోవడమే కాకుండా, అతడిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల జీవితాల్లోనూ తీరని విషాదాన్ని మిగిల్చే ఇలాంటి ఘటనలు సమాజాన్ని కలచివేస్తున్నాయి. చందు నాయక్ హత్యతో గొల్లబుద్ధారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం

- సి-సెక్షన్లను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు
- డిఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్



నిర్మల్ బ్యూరో నవంబర్ 06 (జనంసాక్షి) : జిల్లాలో సి-సెక్షన్ (శస్త్రచికిత్స) ప్రసవాలను తగ్గించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. అర్హులైన వారందరికీ హెచ్‌పీవీ టీకాలు వేయించాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధనలో వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ నయనారెడ్డి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాకేష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఆకాష్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారుల వైఖరి మారాలి

- లేకుంటే మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం
- కాటారం ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల



మహా ముత్తారం నవంబర్ 6 (జనం సాక్షి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై కాటారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల ఆగ్రహం చేశారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి నిశాంత్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుపేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు సక్రమంగా అందించ డంలో క్షేత్రస్థాయి అధికారుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. అయితే కొన్ని శాఖల అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం సరికాదని కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల అన్నారు. అధికారులు తమ పనితీరును మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. లేనిపక్షంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో పాటు జిల్లా కలెక్టర్‌కు సంబంధిత అధికారులపై ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరిం చారు. మహా ముత్తారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావే శంలో ఆమె పాల్గొని వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారుల నివేదికలను సమీక్షిం చారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికా రుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండల సమావేశాలకు స్పెషల్ ఆఫీసర్, ఇంజనీరింగ్, ఎక్సైజ్, అటవీశాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు హాజరుకాకపోవడం పట్ల ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రోజుకు దాదాపు 20 గంటలు కష్టపడుతూ మంథని నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలనే దృఢ సంకల్పంతో పని చేస్తున్నారని, ఆయన పనితీరును, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతను అధికా రులు స్ఫూర్తిగా తీసుకోవాలని పంతకాని తిరుమల సూచించారు మంజూరైన మహిళా భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనుల్లో కూడా వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ నిధులు మంజూరైన తర్వాత పనులు ఆలస్యం కాకుండా సంబంధిత శాఖల అధికా రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఇకపై నిర్వహించే మండల జనరల్ బాడీ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజర య్యేలా చర్యలు తీసుకో వాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్య లకు అధికారులు సమాధా నాలు చెప్పడంతో పాటు వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందిం చాలని సూచిం చారు. ఈ సమావేశంలో కాటారం డివిజన్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండగొర్ల బాపు, మండల సర్పంచులు, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ శాఖలకు సంబంధించిన నివేదికలను సమర్పించి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.



సైక్లింగ్ పోటీల్లో భూపాలపల్లి విద్యార్థినుల ప్రతిభ

- రాష్ట్ర స్థాయికి ఎంపిక..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో భూపాలపల్లి విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేట హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో రేగొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు సత్తా చాటారు. అండర్-14 విభాగంలో వై. అంజలి, అండర్-17 విభాగంలో ఎం. గౌతమి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లాకు గర్వకారణంగా నిలిచిన విద్యార్థినులను జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీహెచ్. రఘు, ఫిజికల్ డైరెక్టర్ విజిత, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ ఇదే స్ఫూర్తితో రాణించాలని రఘు ఆకాంక్షించారు.

గుస్సాడి సంబరాల్లో సుగుణక్క

ఆకట్టుకున్న సాంప్రదాయ నృత్యాలు



కెరమేరీ, నవంబర్ 6 (జనంసాక్షి) : కెరమెరి మండలం రాంజీ గూడ, భీమన్ గొంది గ్రామాల్లో నిర్వహించిన గుస్సాడి, దండారి వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఆదివాసీ సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్న ఆమెకు గ్రామస్థులు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం డోలు వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు.అనంతరం గ్రామాల్లో నిర్వహించిన గుస్సాడి, దండారి నృత్యాలను ఆత్రం సుగుణక్క ఆసక్తిగా తిలకించారు. ఆదివాసీ కళాకారుల నృత్య ప్రదర్శనలను వీక్షించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న సుగుణక్క గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గుస్సాడి, దండారి వేడుకల నిర్వహణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో గొయగం సర్పంచ్ ఆత్రం ఆనంద్ రావ్, ఉప సర్పంచ్ రాందాస్,పటేల్ సిదాం భీము,దండారి ఊరి పెద్ద ఆత్రం దేవురావు,పొత్ రాజ్ కమిటీ చైర్మన్ సిదాం రాజు,ఉప సర్పంచ్,కేరమేరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుజాయిత్ ఖాన్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో
కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- జీవో నంబర్ 14 రద్దు చేసే వరకు దశలవారీగా పోరాటం
- మాజీ చీఫ్ విప్ , మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 6 (జనం సాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 14 లో మార్పు చేయడాన్ని నిరసిస్తూ... ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ , బీసీ ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం కేయూ జంక్షన్ ఎస్టీఎస్సీ వద్ద ఉన్న మహాత్మా జ్యోతి బా పూలే విగ్రహం వద్ద పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీసీ నేత విమర్శించారు. బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన భవన నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, కులవృత్తుల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతి సంవత్సరం బీసీ సంక్షేమానికి రూ.20 కోట్లు కేటాయించాల్సి ఉండగా, బడ్జెట్‌లో ఎంత కేటాయించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గౌడ కులస్తుల ఆరాధ్య దైవం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి, ఇతర కుల సంఘాల ప్రముఖ నాయకుల జయంతి వేడుకలు నిర్వహించు కోవడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కనీసం కార్యక్రమాల కు వచ్చే వారికి తాగునీరు, టీ, అల్పాహారం వంటి ఏర్పాట్లు కూడా చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవోను రద్దు చేసే వరకు బీసీ వర్గాల తరపున దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బీసీ, దళిత విద్యార్థులు, కుల సంఘాలు ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ఆశయాల స్ఫూర్తితో బీసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని తెలిపారు.

రక్షణ, ఉత్పత్తిలో ఖైరిగూడ ఉపరితల గని అగ్రస్థానం

- జాతీయ స్థాయిలో ఐదు నక్షత్రాల గుర్తింపు
- జీఎం ఎం.శ్రీరమేష్



రెబ్బెన, నవంబర్ 6 (జనంసాక్షి): బెల్లంపల్లి ఏరియా పరిధిలోని ఖైరిగూడ ఉపరితల గని రక్షణ, బొగ్గు ఉత్పత్తి, నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఐదు నక్షత్రాల గుర్తింపు పొందడం గర్వకారణమని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖైరిగూడ ఉపరితల గని జాతీయ స్థాయిలో ఐదు నక్షత్రాల గుర్తింపు సాధించిన సందర్భంగా శుక్రవారం గని వద్ద ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం అధికారులు, ఉద్యోగులను అభినందిస్తూ వారి కృషిని కొనియాడారు. ఇప్పటివరకు గనికి లభించిన పతకాలు, జ్ఞాపికలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ, కార్మిక సంక్షేమం తదితర 84 అంశాల ఆధారంగా జాతీయ స్థాయిలో ఇతర గనులతో పోటీ పడి ఖైరిగూడ గని ఈ ఘనత సాధించిందన్నారు. మొత్తం 100 మార్కులకు గాను 91కు పైగా మార్కులు సాధించి ఐదు నక్షత్రాల గుర్తింపు పొందడం విశేషమన్నారు. ఈ విజయానికి ప్రతి ఒక్క ఉద్యోగి అంకితభావం, సమష్టి కృషి కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాథమిక ప్రాణరక్షణ చర్యగా గుండెపై ఒత్తిడి కలిగించి ప్రాణాలు కాపాడే విధానాన్ని (సీపీఆర్) రెస్క్యూ సిబ్బంది ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి ఎం. నరేందర్, జీఎం ప్రత్యేక అధికారి ఇ. స్వామిరాజు, ఏరియా ఇంజనీర్ బి. వీరన్న, ప్రాజెక్టు మేనేజర్ జె. శంకర్, ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఇన్‌చార్జి పీఈ ఎస్. రాజు, రక్షణ అధికారి గౌతమ్ రాజేష్ రెడ్డి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజనులు సాంకేతికంగా వైజ్ఞానికంగా ఎదగాలి : శాస్త్రవేత్త మహమ్మద్ హర్షద్



సారంగాపూర్, నవంబర్ 6(జనం సాక్షి) : గిరిజన ప్రజల 75 ఏళ్ల ఘనమైన చరిత్ర, వారి సంస్కృతి మరియు విజయాలను స్మరించు కోవడానికి ప్రభుత్వం నవంబర్ 15వ తేదీ నుండి వారం రోజుల పాటు వేడుకలను నిర్వహించాలని యోచిస్తోంది. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని భారతదేశం నవంబర్ 15న జనజాతీయ గౌరవ్ దివస్‌గా జరుపుకుంటుంది. బిర్సా ముండా దోపిడీకి గురిచేసే బ్రిటిష్ వలస వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి, ' ఉల్గులన్ ' (విప్లవం) కోసం పిలుపునిస్తూ బ్రిటిష్ అణచివేతకు వ్యతిరేకంగా ఒక ఉద్యమానికి నాయకత్వం వహించారనీ శాస్త్రవేత్త మహమ్మద్ హర్షద్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలో నిర్మల్ జిల్లా పెండల్దారి గ్రామాన్ని సందర్శించారు. ప్రత్యేక గిరిజన గ్రామంగా తీసుకొని వారికి సాంకేతికంగా వైజ్ఞానికంగా ఎదుగుదలకు కృషి చేస్తానని తెలిపారు. వంశపారపర్యంగా వస్తున్నటువంటి సంస్కృతిని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం గుస్సాడివృత్యాన్ని తిలకించారు. పూర్వికులు చెట్ల పసురు వైద్యాన్ని నిర్ధారణ చేసి భావితరాలకు అందే విధంగా చూడాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఏపీ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెండల్దారి గ్రామస్తులకు సేమియా కీర్ స్వీట్ అట్ల పోతరెడ్డి అందించారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): గణపురం మండలం గొల్లపల్లి గ్రామంలో చెల్పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నష్టం జరగకుండా, మద్దతు ధరకు కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు. రైతు సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో చెల్పూర్ పాక్స్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ సభ్యులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
07 నవంబర్ 2026

రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



హుజూర్‌నగర్, నవంబర్ 6 (జనంసాక్షి) : హుజుర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల, నీటిపారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ మండల కేంద్రంలో రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, పలు సూచనలు చేసిన చేశారు.రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని, ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్, గ్రీనరీ, త్రాగునీరు, పైలాన్ స్తూపం,సభాస్థలి పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, గ్రీనరీలో నాటిన మొక్కలకు నీరు అందించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని,అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కే నరసింహ, ఆర్డీవో శ్రీనివాసులు,హౌసింగ్ పీడీ జబ్బార్, సంబంధిత శాఖల అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య, మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు కృషి

- ఆరు లైన్లుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ
- రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సూర్యాపేటలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన



సూర్యాపేట, నవంబర్ 6 (జనంసాక్షి) : జిల్లాలో విద్య, వైద్య, మౌలిక సదుపాయాలను పెంపొందించుటకు కృషి చేస్తానని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. రూ.1.17 కోట్ల అంచనా వ్యయంతో ఎస్బిఐ, ఐఓసీఎల్, కోటక్ మహీంద్రా, అక్షర ఫౌండేషన్ వారి సౌజన్యంతో కొనుగోలు చేసిన ఆధునిక వైద్య పరికరాలైన డీజన్ లైట్ వెంటిలేటర్లు, మైక్రోటోన్, కటరీ మెషిన్, బ్రోంకోస్కోప్, డెంటల్ చైర్, సీ ఆర్మ్ తదితర పరికరాలను ప్రారంభించారు.కాంపెన్సేటరీ అపాయింట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా నియామక పత్రాలను అందజేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 190 కోట్ల రూపాయల వ్యయంతో 5 అంతస్తుల 1000 పడకల ఆసుపత్రి భవన నిర్మాణంను నాణ్యతతో వేగంగా రెండు, మూడు నెలలలో పూర్తిచేసి ప్రారంభించడానికి సిద్ధం చేయాలని అన్నారు.జిల్లాలో వైద్యం, విద్య మౌలిక సదుపాయాల పెంపొందించుటకు ప్రయత్నం చేస్తానని అన్నారు. హైదరాబాద్ విజయవాడ 4 లైన్ల నేషనల్ హైవేను 6 లైన్ల రోడ్ గా మంజూరు చేయించి త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.దేవాదుల 6వ ప్యాకేజీ కింద తుంగతుర్తి నియోజకవర్గానికి 1000 కోట్లను మంజూరు చేయించి నీటిని తీసుకొస్తానని అన్నారు. పాత లిఫ్టుల, కొత్త లిఫ్టుల పునరుద్ధరణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇప్పించడం జరిగిందని తెలిపారు.80 శాతం మంది ప్రజలకు సన్న బియ్యం కూడా ఇస్తున్నామని అన్నారు.రాబోవు రోజుల్లో సూర్యాపేట జిల్లాను అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంచుతానని అన్నారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ,జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్,ఎస్బిఐ ఆర్ఎం అనిల్ కుమార్, శ్రీలక్ష్మి, ఐఓసీఎల్ చీఫ్ మేనేజర్ కిరణ్ పత్ర, సీనియర్ మేనేజర్ శంకర్ నారాయణ్, మేనేజర్ రాజశేఖర్, కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రతినిధులు, అక్షర ఫౌండేషన్ సభ్యులు,అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో బంగారు ఆభరణాల చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- రూ.1.80 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



హుజూర్‌నగర్, నవంబర్ 6 (జనంసాక్షి) : పట్టణంలో బంగారు ఆభరణాల చోరీ కేసును హుజూర్‌నగర్ పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సిఐ చరమందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణ పరిధిలో కోడి ఉపేంద్ర కు సంబంధించిన బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వారి మేనల్లుడు అయిన మల్లెబోయిన నిఖిల్ ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నేరస్థుడు నిఖిల్ చిన్నతనం నుండి అమ్మమ్మ, తాతయ్య ల వద్ద ఉంటూ కోదాడ ప్రైవేట్ కాలేజీ లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు తన క్లాస్ మేట్ అయిన పాత నేరస్థుడితో తిరుగుతూ చేడు వ్యసనాలకు బానిసై కోడి పందేలు, బెట్టింగులు ఆడుతూ అప్పులు చేసి వాటిని తీర్చేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వారి అమ్మమ్మకు చెందిన తులన్నర చైన్ దొంగిలించి దాన్ని కరిగించి కొంత భాగాన్ని కరిగించి అప్పులు తీర్చినట్టు,తరువాత తన మేనత్త కోడి ఉపేంద్ర కు సంబంధించిన మూడున్నర తులాల పుస్తెలతాడు దొంగిలించినట్లు దాన్ని అమ్మే క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పట్టణ ఎస్ఐ నరేష్ కు చిక్కినట్లుతెలిపారు. నిందితుడిపై దొంగతనం కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి సుమారు ఒక తులం కరిగించిన బంగారు ముద్దతో పాటు, మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల మొత్తం విలువ సుమారు రూ.1,80,000 ఉంటుందని పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా హుజూర్ నగర్ పరిసర ప్రాంతాల్లో అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని 112 ఫోన్ చేసి వివరాలు అందించాలని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా డిఎస్పీ సూచించారు.

కొట్టాల గ్రామానికి చెందిన యువతి అదృశ్యం

- కుమార్తె ఆచూకీ కోసం తండ్రి పోలీసులకు ఫిర్యాదు

కొడిపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) : మెదక్ జిల్లా కొడిపల్లి మండలం కొట్టాల గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి వైష్ణవి అదృశ్యమైనట్లు కొడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. కొట్టాల గ్రామానికి చెందిన వెంకటేశం తండ్రి అంజయ్య, కులం కుమ్మరి, వృత్తి వ్యవసాయం, తన చిన్న కుమార్తె కనిపించడం లేదని పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుడు వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. తన చిన్న కుమార్తె వైష్ణవి (19) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని, అప్పటి నుంచి ఆమె ఆచూకీ తెలియడం లేదని పేర్కొన్నారు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ సమాచారం లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.అదృశ్యమైన యువతి వైష్ణవి ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు ఉంటుందని, ఇంటి నుంచి వెళ్లేటప్పుడు గోధుమ రంగు టీషర్ట్, పింక్ కలర్ పాయింట్ ధరించి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సిద్ధు తండ్రి పద్మయ్యపై తనకు అనుమానం ఉన్నట్లు ఫిర్యాదుదారుడు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. అయితే ఈ అనుమానంపై ఎలాంటి నిర్ధారణ కాలేదు.యువతి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా



రామాయంపేట, నవంబర్ 6 (జనం సాక్షి) : రైతుల సంక్షేమం, పేద ప్రజల అభ్యున్నతి, నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఆయన విస్తృతంగా పర్యటించి పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రామాయంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గొలిపర్తి పెద్దమ్మ ఆలయం వద్ద, మొదటి వార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు మద్దతు ధర అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రామాయంపేట పట్టణ, మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు 37 కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. రామాయంపేట పట్టణానికి చెందిన లబ్ధిదారులకు 3,500 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే

గొలిపర్తి గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ పొంచమాల నవనీత గణేష్, పీఏసీఎస్ చైర్మన్ బాధే చంద్రం,కౌన్సిలర్లు బైరం స్వప్న కుమార్, గుగులోతు రవి, పుట్టి సందీప్, దేవుని రంజిత్,డాకి శ్యామల స్వామి, కోఆప్షన్ సభ్యురాలు చింతల రాధా భవాని, యాదగిరి, దేమే యాదగిరి, తహసీల్దార్ రజినీకుమారి, మున్సిపల్ కమిషనర్ రవీందర్,ఆర్ఐలు గోపి,గౌస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులు, యువజన నాయకులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 6 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లా కోస్గి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కోస్గి పట్టణం లో సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొ నేందుకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, రాకపోకల మార్గాలు, పార్కింగ్ స్థలా లు తదితర ప్రాంతాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించా రు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలె త్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలు సాగించే మార్గాల్లో రోడ్డు ఓపెనింగ్ పార్టీలను ఏర్పాటు చేసి, రహదారులపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా రూఫ్‌టాప్ సెంట్రీలు, రోప్ పార్టీలు, కీలక కూడళ్లు ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక భద్రతా బలగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగించుకుని తిరిగి వెళ్లే మార్గాన్ని ముషిఫా బోర్డర్ వరకు స్వయంగా పరిశీలించి,మార్గమధ్యంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.బందోబస్తు ముందస్తు ప్రణాళికతో సంబంధిత అధికారుల సమన్వ యంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఎలాం టి భద్రతా లోపాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీ లిస్తూ, ముఖ్యమంత్రి పర్య టనను ప్రశాంతంగా, విజ యవంతంగా నిర్వహించేం దుకు అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎస్పీతో పాటు డీఎస్పీలు నల్లపు లింగ య్య, ఏ. మహేష్, కోస్గి సీఐ సైదులు, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్సైలు చంద్ర శేఖర్, భాగ్యలక్ష్మి రెడ్డి,విజయ్ కుమార్ తదితరు లు పాల్గొన్నారు.

కరువు రైతులకు బ్యాంకు రుణాలు

- అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్మయి
- ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం
- బ్యాంకర్లకు కీలక ఆదేశాలు



రంగారెడ్డి, నవంబర్ 6 (జనంసాక్షి) : కరువు ప్రభావిత రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు. అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక రుణాలుగా పునర్వ్యవస్థీకరించి ఉపశమనం కల్పించాలని చెప్పారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి. అధ్యక్షతన శుక్రవారం ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 18 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో 5 తీవ్ర కరువు ప్రభావిత మండలాలు, 13 మధ్యస్థ కరువు ప్రభావిత మండలాలు ఉన్నాయని తెలిపారు. మధ్యస్థ కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు 12 నెలల మారటోరియంతో పాటు తదుపరి 24 నెలల వరకు, తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లో 12 నెలల మారటోరియం, తదుపరి 48 నెలల వరకు రుణాల చెల్లింపు గడువు కల్పించే విధానాన్ని వివరించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించి అర్హులైన రైతులకు రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ హర్ష పిడి డిఆర్డిఏ శ్రీలత, పిడి మెప్మా వెంకట నారాయణ, వ్యవసాయ శాఖ అధికారి సుజాత పాల్గొన్నారు.

పిల్లల అభిప్రాయాలకే ప్రాధాన్యం

- చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాగా సూర్యాపేట
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, నవంబర్ 6 (జనంసాక్షి) : సూర్యాపేట జిల్లాను చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం మరో ముందడుగు వేసింది.పిల్లల అభిప్రాయాలు, అవసరాలు, సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు యూనిసెఫ్ సహకారంతో చేపట్టిన లిజనింగ్ టు చిల్డ్రన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు.జిల్లాలో గుర్తించిన 100 పాఠశాలల్లో జిల్లా పరిషత్, ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 6 వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.గ్రూప్ డిస్కషన్ల ద్వారా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించారు.తమ ఆలోచనలు, అభిరుచులు, భవిష్యత్తు లక్ష్యాలతో పాటు పాఠశాలలు, గ్రామాల్లో తమకు సురక్షితంగా అనిపించే ప్రాంతాలు, ఇబ్బందులు ఎదురయ్యే ప్రదేశాల గురించి వివరించారు.తమ గ్రామాలు, పాఠశాలల్లో ఎలాంటి సౌకర్యాలు ఉండాలనుకుంటున్నారో, పిల్లలకు అనుకూలమైన అంశాలేమిటో, ఎదురవుతున్న సమస్యలేమిటో తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి భయం, సంకోచం లేకుండా ఉత్సాహంగా చర్చల్లో పాల్గొని తమ మనోభావాలను వ్యక్తం చేశారు.పిల్లల అభిప్రాయాలను వినడం, వారి హక్కులను పరిరక్షించడం ద్వారా మాత్రమే చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాను నిర్మించగలమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు.ఎల్లిసి కార్యక్రమం ద్వారా సేకరించిన అభిప్రాయాలు, సూచనల ఆధారంగా పిల్లల



అవసరాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శక్తి హబ్, సఖీ కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సీఆర్‌పీలు, విద్యాశాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అత్యాధునిక డయాగ్నస్టిక్ ల్యాబ్, సిటీ స్కానింగ్ సౌకర్యం

- నాలుగు రాష్ట్రాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- అనువైన భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి. రాహుల్



భద్రాచలం, నవంబర్ 6 (జనంసాక్షి) : నాలుగు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలందించే కేంద్రంగా ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆసుపత్రికి తెలంగాణ డయాగ్నస్టిక్ ల్యాబ్‌తో పాటు అత్యవసర రోగులకు ఉపయోగపడే సిటీ స్కానింగ్ సదుపాయాన్ని మంజూరు చేసింది. ఈ సౌకర్యాలు అందుబాటులోకి వస్తే మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు స్థానికంగానే అందనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఏరియా ఆసుపత్రిని సందర్శించి, డయాగ్నస్టిక్ ల్యాబ్, సిటీ స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనువైన భవనాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి వైద్య సేవల నిర్వహణ, మౌలిక సదుపాయాలను సమీక్షించారు. చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం ఏరియా ఆసుపత్రికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారని, వారికి అవసరమైన అధునాతన వైద్య పరికరాలు, పరీక్షా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న సీటీ స్కాన్ రేడియాలజీ కేంద్రానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి, తగిన ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. అదేవిధంగా ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న టీ-హబ్ పనుల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సిబ్బంది సమన్వయంతో నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సైదులు, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రాజశేఖర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ మధుకర్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో 15 మేకపిల్లలు మృత్యువాత

చిట్యాల, నవంబర్ 6 (జనం సాక్షి) : చిట్యాల మండలం ఆరేగూడెం గ్రామానికి చెందిన అర్రూరి సత్తయ్య మేకలను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి మేకలను దొడ్డిలో ఉంచి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దొడ్డిలోకి చొరబడిన వీధి కుక్కలు మేకపిల్లలపై దాడి చేసాయి.శుక్రవారం ఉదయం దొడ్డి వద్దకు వచ్చిన సత్తయ్య 15 మేకపిల్లలు చనిపోయి కనిపించడంతో బోరున విలపించాడు. ఈ ఘటనలో తనకు సుమారు రూ.1 లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. మేకల పెంపకమే తన జీవనాధారమని, అప్పులు చేసి మేకపిల్లలను కొనుగోలు చేశానని, ఇప్పుడు అంతా కోల్పోయానని సత్తయ్య కన్నీటిపర్యంతమయ్యాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని, గ్రామంలో వీధి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
07.11.2026



త్వరలోనే కరీంనగర్‌కు వస్తా..

మహా పాదయాత్ర చేస్తా

- కరీంనగర్ శ్రేణుల జోష్ చూడాలని ఉంది
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో నితిన్ నబీ
- రాష్ట్రంలో పార్టీ బలోపేతం పై చర్చ

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 06 (జనంసాక్షి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యాంగబద్ద సంస్థల పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొడుతూ సర్ విషయంలో వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు కరీంనగర్ లో చేపడుతున్న 'మహా పాదయాత్ర'కు తానే స్వయంగా వస్తానని ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ కు నితిన్ నబీ చెప్పారు.వాస్తవానికి ఈనెల 5న కరీంనగర్ రావాల్సి ఉన్నప్పటికీ, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున రాలేకపోయానన్నారు. ఈసారి 'చట్ పూజ' అనంతరం తప్పకుండా కరీంనగర్ వచ్చి మహా పాదయాత్రలో పాల్గొంటానని చెప్పారు. కరీంనగర్ లో కాషాయ శ్రేణుల జోష్ ను చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా నితిన్ నబీన్ బండి సంజయ్ తో చర్చించారు.

పారమితలో అలరించిన 'రూపాలి సాయంత్రం'



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి):దీపావళి పండుగను పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని రేకుర్తి రాజశ్రీ కన్వెన్షన్స్‌లో ఎక్స్‌ప్లోరికా ప్రీమియం స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 'రూపాలి సాయంత్రం' పేరుతో దీపావళి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగను విద్యార్థులకు మరింత అర్థవంతంగా పరిచయం చేయడంతో పాటు, వారిలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ఈ వేడుకలను ప్రత్యేకంగా రూపొందించారు. విద్యార్థుల కళాత్మక నైపుణ్యాన్ని ప్రతిబింబించే ఆర్ట్ ఎగ్జిబిషన్ సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా దీపాల వెలుగుల్లో సేవా స్ఫూర్తిని చాటనున్న ఎక్స్‌ప్లోరికా 'రూపాలి సాయంత్రం' దీపావళి పండుగను పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని రేకుర్తి రాజశ్రీ కన్వెన్షన్స్‌లో ఎక్స్‌ప్లోరికా ప్రీమియం స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 'రూపాలి సాయంత్రం' పేరుతో దీపావళి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. సంస్థ చైర్మన్ డా. ఈ. ప్రసాద్ రావు మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడమే కాకుండా సమాజంలో ప్రేమ, ఐక్యత, మానవత్వం వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. సంస్థ డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనుకర్ రావు, రాకేష్, ప్రాచి, వి.యు. ఎం. ప్రసాద్, వినోద్ రావు ,ప్రిన్సిపాల్ శర్మిష్ఠ, ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట!

అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న సిరిసిల్ల కాంగ్రెస్

- ఎవరికి వారే యమునా తీరే..
- నామినేటెడ్ పదవులే చిచ్చుకు కారణమా?
- కార్యకర్తలకు ప్రాధాన్యం ఏదీ? పదవుల కోసం నాయకుల ప్రయత్నాలేనా?
- బీసీలకు నామినేటెడ్ పదవులు కేటాయిస్తేనే పార్టీకి బలం చేకూరుతుందనే అభిప్రాయాలు

సిరిసిల్ల టౌన్ నవంబర్ 6 (జనంసాక్షి):

సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ నాయకుల మధ్య సమన్వయం కొరవడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొన్నటి వరకు కింది స్థాయి కార్యకర్తలు ఏ నాయకుడి వెంట నడవాలో తేల్చుకోలేని పరిస్థితి ఉండగా, ఇప్పుడు నామినేటెడ్ పదవుల వ్యవహారం పార్టీలో కొత్త చర్చకు దారితీస్తున్నట్లు తెలుస్తోంది.

పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు, పదవుల్లో ప్రాధాన్యం కల్పిస్తామని నాయకులు పదేపదే చెబుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం ఆశించిన స్థాయిలో గుర్తింపు లభించడం లేదని కొందరు కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు, సభల్లో నాయకులంతా సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా, అంతర్గత విభేదాలు అందుకు అడ్డంకిగా మారుతున్నాయనే చర్చ వినిపిస్తోంది.

నామినేటెడ్ పదవుల కోసం ఎవరికి వారే!

నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అధిష్ఠానం ఆదేశాల మేరకు పనిచేస్తున్నట్లు పైకి కనిపిస్తున్నప్పటికీ, పదవుల విషయంలో మాత్రం ఎవరికి వారే తమకు అనుకూలంగా పావులు కదుపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలు నాయకత్వంలో సమన్వయ లోపానికి కారణమవుతున్నాయా? అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

జెండాలు మోయడానికేనా కార్యకర్తలు?

పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు



భావిస్తున్నారు. పార్టీ కోసం జెండాలు మోసి, కార్యక్రమాలను విజయవంతం చేసే కార్యకర్తలకు పదవులు, బాధ్యతలు కేటాయించే సమయంలో ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా ప్రతి ముఖ్యమైన నిర్ణయాన్ని వారితో చర్చించి, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

బీసీలకు పదవులు ఇస్తేనే బలమా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో చేసిన ప్రకటనల నేపథ్యంలో, సిరిసిల్ల నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల కేటాయింపుపై ఆసక్తి నెలకొంది. బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ పదవులు కేటాయిస్తే పార్టీకి మరింత బలం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నామినేటెడ్ పదవుల్లో పద్మశాలీలకు ప్రాతినిధ్యంపై అసంతృప్తి.

నామినేటెడ్ పదవుల కేటాయింపులో జనాభా, సామాజిక ప్రాతినిధ్యం, పార్టీ కోసం పనిచేసిన వారి సేవలను పరిగణనలోకి తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పద్మశాలి సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో పదవులు దక్కడం లేదనే అసంతృప్తి కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులు, కార్యకర్తల్లో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఇతర పార్టీల కంటే సొంత పార్టీలోనే పద్మశాలీలకు తగిన గుర్తింపు లభించడం లేదని ఓ నాయకుడు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.సామాజిక సమీకరణాలతో పాటు పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు కల్పించడం కూడా కీలకమని పేర్కొంటున్నారు.మొత్తానికి, సిరిసిల్ల కాంగ్రెస్‌లో నెలకొన్నట్లు ప్రచారం జరుగుతున్న అంతర్గత విభేదాలకు నాయకత్వం ఎలా ముగింపు పలుకుతుంది? నామినేటెడ్ పదవుల కేటాయింపులో ఎవరికి ప్రాధాన్యం లభిస్తుంది? కార్యకర్తల ఆశలు నెరవేరుతాయా? అన్నది వేచి చూడాల్సిందే. పదవుల పంపకం కంటే పార్టీ ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తేనే సిరిసిల్లలో కాంగ్రెస్ మరింత బలోపేతమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సస్పెండైనా అదే తంతు..!

- ఖాసింపేటలో మళ్ళీ విచారణ
- ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీలత వ్యవహారంలో జిల్లా స్థాయి విచారణ

గన్నేరువరం, నవంబర్ 6 (జనంసాక్షి):

ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం ఆరోపణలతో సస్పెన్షన్ కు గురైన ఖాసింపేట గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ జక్కనపల్లి శ్రీలత వ్యవహారంలో మరోసారి జిల్లా స్థాయి విచారణ జరగడం గన్నేరువరం మండలంలో చర్చనీయాంశమైంది.ఇదివరకే శ్రీలతపై వచ్చిన ఆరోపణలు విచారణలో నిజమని తేలడంతో కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డి ఆర్ డి ఓ) ఆమెను విధుల్లోంచి తాత్కాలికంగా తొలగిస్తూ (సస్పెండ్) ఉత్తర్వులు జారీ చేశారు. దుబాయ్ లో ఉన్న భర్త పేరుతో కూలీ, సొంత పనులకు ఉపాధి కూలీల వాడకం, నకిలీ జాబ్ కార్డులు, 100 రోజులు నిండకుండానే వేరే జాబ్ కార్డుల పేర్లతో పనులు చూపించడం వంటి తీవ్ర ఆరోపణలు ఆమెపై ఉన్నాయి.

మళ్ళీ విచారణ...

సస్పెన్షన్ వివరాలపై జిల్లా స్థాయి అధికారి ఏపీడి పి. క్రిష్ణ శుక్రవారం ఖాసింపేట గ్రామపంచాయతీలో విచారణ చేశారు. ఈ విచారణలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కర్నే చంద్రయ్య, ఉప సర్పంచ్ సందవేణి ఐలయ్య, ఫిర్యాదుదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఫిర్యాదుదారులు తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారుల ముందు ఉంచినట్లు తెలిసింది. గ్రామ ప్రజలు కూడా జరిగిన అవకతవకలపై అధికారులకు వివరించారు.

ప్రజల డిమాండ్...

సస్పెన్షన్ తోనే సరిపెట్టకుండా, దుర్వినియోగం చేసిన మొత్తాన్ని ఆమె నుండి రికవరీ చేయాలని, ఈ వ్యవహారంలో నిజాలు పూర్తిగా బయటకు తీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. విచారణ నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని గ్రామంలో ఉత్కంఠ నెలకొంది.

నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తాం

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాలని శ్రీనివాస్
- ప్రస్తుతం రూ. 70 లక్షల యూఐడీఎఫ్ నిధులతో శరవేగంగా అభివృద్ధి పనులు
- డివిజన్ అభివృద్ధి కోసం 3 కోట్లు కేటాయించామని వెల్లడి

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 06 (జనంసాక్షి)

:నగరపాలక సంస్థ అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా శుక్రవారం 20వ డివిజన్ రేకుర్తిలో పర్యటించారు. ధర్మపురి కాలనీలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ పర్వతం మల్లేషంతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నగరపాలక సంస్థ కు చెందిన 31.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం డివిజన్ కార్పొరేటర్, స్థానిక మహిళలు దృష్టికి తెచ్చిన సమస్యల పై కాలనీల్లో పాదయాత్ర చేసి డ్రైనేజీ, కల్వర్టు సమస్యలను తనిఖీ చేసి పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డివిజన్ లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని



శ్రీనివాస్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ లో విలీనం చెందిన శివారు ప్రాంత డివిజన్ కావడంతో చాలా సమస్యలు ఉన్నాయని సంబంధిత రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు, త్రాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలన్నీటిని ప్రాధాన్యత క్రమంలో దశలవారిగా పరిష్కరిస్తామని తెలిపారు. రేకుర్తి డివిజన్లలలో సమస్యల పరిష్కారం కోసం వివిధ గ్రాంట్ల కింద దాదాపు 3 కోట్ల నిధులు కేటాయించామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు, యూఐడిఎఫ్ నిధులతో ఇప్పటికే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు ప్రారంభం చేశామన్నారు. యూఐడిఎఫ్ నుండి ప్రస్తుతం 70 లక్షలతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. శివారు ప్రాంతంగా ఉన్న రేకుర్తి డివిజన్ తో పాటు ఇతర శివారు ప్రాంత డివిజన్లను అభివృద్ధి బాట పట్టిస్తున్నట్లు తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా సమాధుల పండుగ జరుపుకునుట కు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న శ్మశానవాటికల్లో చదును కార్యక్రమాలు, తాగునీరు, విద్యుత్ దీపాలు, నిరంతర పారిశుద్ధ్య వసతులు కల్పించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ నగర సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలి

న్యాయమూర్తి బి. అనురాధ

మంథని, నవంబర్ 06, (జనంసాక్షి) : విద్యార్థులకు చట్టాల పట్ల అవగాహన కల్పించి, వారి హక్కులు, బాధ్యతలపై చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా మంథని గర్ల్స్ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి. అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు వివిధ చట్టాలు, వాటి ప్రాధాన్యత, విద్యార్థుల హక్కులు, చట్టపరమైన బాధ్యతల గురించి వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా అన్యాయాలను ఎదుర్కొనే ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె. రాఘోత్తం రెడ్డి, న్యాయవాది కాచే శశిభూషణ్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి ఝాన్సీ, రావుల తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

మంటగలిసిన మానవత్వం

అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి స్మశాన వాటికనే గతి...

స్పందించిన ప్రభుత్వ విప్ ఏరియా ఆసుపత్రికి తరలింపు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):

సాటి మనిషి ఆపదలో ఉంటే ఆదుకోవాల్సిన క్రమంలో మానవత్వం మంట కలిసిన సంఘటన వేములవాడలో శుక్రవారం చోటుచేసుకుంది..అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ యువకుడిని కనీసం తను కిరాయి తీసుకుని ఉంటున్న ఇంట్లో ఉండేందుకు కూడా ఇంటి యజమానులు అనుమతించకపోవడంతో కుటుంబ సభ్యులు చేసేదేమీ లేక అతడిని స్మశానవాటికకు తరలించారు. బతికుండగానే వైకుంఠధామంలో కాలం వెళ్లదీస్తూ మృత్యువు కోసం ఎదురుచూస్తున్న ఆ యువకుడి పరిస్థితి స్థానికులను కలచివేసిన సంఘటన చోటుచేసుకుంది.చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన అమృత కుటుంబం గత కొన్నేళ్లుగా వేముల వాడలో అద్దెకు నివాసం ఉంటోంది. కుటుంబానికి చెందిన మర్రిపల్లి రాకేష్ కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జాండీస్‌తో పాటు శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడంతో కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రులు తిప్పినా అతని ఆరోగ్యం మెరుగుపడలేదన్నారు.ప్రస్తుతం రాకేష్ పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉండగా అద్దె ఇంటి యజమాని రాకేష్‌ను ఇంట్లోకి అనుమతించలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక అనారోగ్యంతో ఉన్న రాకేష్‌ను కుటుంబ సభ్యులు వేములవాడ వైకుంఠధామానికి తరలించారు.బతికుండగానే స్మశాన వాటికలో ఉండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.ఒక మనిషి ప్రాణాలతో పోరాడుతున్న సమయంలో కనీస మానవత్వం చూపించలేదంటూ కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమవుతున్నారు.తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెంటనే స్పందించి మున్సిపల్ పాలకవర్గమును, అధికారులు ఆదేశించి అతడికి వెంటనే మెరుగైన వైద్య సహకారం అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఆయన సూచనల మేరకు వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,మున్సిపల్ కమిషనర్ లోకేష్ తో కలిసి మరిపల్లి రాకేష్ ను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య చికిత్స చేపిస్తున్నారు.?ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ వేములవాడలో మర్రిపల్లి రాకేష్ అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడని తెలిపారు. ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న దృష్ట్యా, వారు ఉంటున్న అద్దె ఇల్లు ఖాళీ చేయించడంతో,ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ వ్యక్తిని





బయటకు తీసుకురావాల్సిన అత్యంత దయనీయ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ?తన కుమారుడిని కాపాడుకోవడానికి ఆ తల్లి అమృత పడుతున్న ఆవేదనను గమనించి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమస్యను తెలియగానే ఎమ్మెల్యే తక్షణమే స్పందించారని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రాకేష్‌ను వెంటనే సిరిసిల్ల లోని ఏరియా ఆసుపత్రికి తరలించి, తగిన చికిత్స అందించడం కోసం వైద్యులతో మాట్లాడి ఐసీయూలో చేర్పించడం జరిగిందనన్నారు.వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కొండ రాజశేఖర్ పాల్గొన్నారు.

కల్తీ పాల తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి

హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపి విక్రయాలు



ఇబ్రహీంపట్నం (జనంసాక్షి): రంగారెడ్డి జిల్లాలో కల్తీ పాల తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. ఇబ్రహీంపట్నం మండలం పోచారంలోని కల్తీ పాల కేంద్రంపై దాడులు నిర్వహించారు. హైడ్రోజన్ పెరాక్సైడ్, పాలపొడి కలిపి కల్తీ పాలు తయారుచేస్తున్నట్లు గుర్తించారు. 100 లీటర్ల పాలు, 35 పాలపొడి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఉపాధి కోసం రష్యా వెళ్లి.. ఆర్మీలో చిక్కి..

ఏజెంట్ మోసంతో యుద్ధ భూమికి చేరిన పర్శరాములు



- అతడి రాక కోసం ఎదురుచూస్తున్న భార్య,చిన్నారులు..
- క్షేమ సమాచారం కోసం కుటుంబ సభ్యుల ఆవేదన..

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 6 (జనంసాక్షి):

కుటుంబానికి అండగా నిలవాల్సిన భర్త ఎక్కడున్నాడో తెలియదు.. నాన్న ఎప్పుడు తిరిగి వస్తాడో తెలియని ఇద్దరు చిన్నారులు.. ప్రతి ఫోన్ మోగినప్పుడూ భర్త నుంచి క్షేమ సమాచారం వచ్చిందేమోనని ఎదురుచూసే భార్య.. ఇలా ఓ నిరుపేద కుటుంబం నెలలుగా కన్నీళ్లతో కాలం వెళ్లదీస్తోంది. కుటుంబ పోషణ కోసం ఉపాధి వెతుక్కుంటూ విదేశాలకు వెళ్లిన ఓ యువకుడు ఏజెంట్ మోసానికి బలై రష్యా సైన్యంలో చిక్కుకోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.

గార్డెనింగ్ పని అని నమ్మించి..

వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామానికి చెందిన గోనెల పర్శరాములు కుటుంబ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకోవాలనే ఆశతో విదేశాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్‌కు చెందిన ఓ ఏజెంట్‌ను సంప్రదించగా, రష్యాలో గార్డెనింగ్ పని ఇప్పిస్తానని నమ్మించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.ఇందుకోసం సదరు ఏజెంట్‌కు రూ 2.50 లక్షలు చెల్లించి గత జనవరిలో పర్శరాములు రష్యా వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత కొంతకాలం కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడినప్పటికీ ఆ తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి.

యుద్ధ భూమిలో ఉన్నాడన్న సమాచారంతో ఆందోళన..

తనను రష్యా సైన్యంలో చేర్చుకున్నారని,రష్యా–ఉక్రెయిన్ యుద్ధ ప్రాంతానికి పంపించారని గతంలో కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా పర్శరాములు సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు. అప్పటి నుంచి అతడి పరిస్థితి ఏమిటో తెలియని ఆందోళన కుటుంబాన్ని వెంటాడుతోంది. జూలై 31 నుంచి ఇప్పటివరకు కుటుంబ సభ్యులకు ఎలాంటి క్షేమ సమాచారం అందకపోవడంతో వారి ఆవేదన మరింత పెరిగింది.భర్త కోసం భార్య ఎదురుచూపులు.. పిల్లలకు తండ్రి జ్ఞాపకాలే దిక్కు..ఒకవైపు భర్త ఎక్కడున్నాడో, ఎలా ఉన్నాడో తెలియని ఆందోళన.. మరోవైపు ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుపై బెంగ.. ఈ రెండింటి



మధ్య పర్శరాములు భార్య శిరీష తీవ్ర మానసిక వేదనకు గురవుతోంది. కుటుంబానికి అండగా నిలుస్తాడని విదేశాలకు పంపిన భర్త తిరిగి ఎప్పుడు వస్తాడో తెలియని పరిస్థితి ఆమెను కలచివేస్తోంది.తండ్రి రాక కోసం ఎదురుచూస్తున్న పిల్లలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక ఆమె కన్నీటి పర్యంతమవుతోంది.

ప్రభుత్వమే ఆదుకోవాలంటూ వేడుకోలు..

తన భర్తను ఎలాగైనా సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలనే ఆశతో ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కుటుంబ సభ్యులు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి భారత విదేశాంగ శాఖ ద్వారా పర్శరాములు ఆచూకీ తెలుసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. యుద్ధ ప్రాంతంలో ఆయనకు ఎలాంటి ప్రమాదం జరగకముందే అవసరమైన దౌత్య చర్యలు చేపట్టి సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని భార్య శిరీష, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.కుటుంబాన్ని బతికించుకోవాలనే ఆశతో విదేశీ గడ్డపై అడుగుపెట్టిన పర్శరాములు..ఇప్పుడు తన కుటుంబానికే అందనంత దూరంలో చిక్కుకుపోయాడు. ఆయన తిరిగి వస్తాడనే ఆశతో భార్య, పిల్లలు ఎదురుచూస్తున్నారు. వారి ఎదురుచూపులకు ముగింపు పలికి, ఆ కుటుంబంలో మళ్లీ ఆనందం నింపేలా ప్రభుత్వాలు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు : అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనంసాక్షి: నగరంలోని అన్ని డివిజన్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 17, 19వ డివిజన్ల లో శుక్రవారం రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్ కు 20 లక్షల కేటాయించిన విషయం తెలిసిందేనన్నారు. ఆ నిధులతో ప్రతి డివిజన్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్తో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఇందూరు అభివృద్ధిపై చర్చించానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన మూడేళ్లలో ఎమ్మెల్యే ఫండ్ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని గుర్తు చేశారు. కార్పొరేషన్లో ఉన్న బడ్జెట్ తో పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఇందూరులో బీజేపీ గెలిచిందని నిధులు కేటాయించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మేయర్ ఉమా రాణి, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, చింతా ప్రసూన, పసునూరి రాము, మమత శివ, మాయావార్ సాయిలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పని చేస్తున్నాం
- కోటి యాభై లక్షలతో నిర్మించబోయే ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్



హుజురాబాద్, నవంబర్ 6 (జనం సాక్షి) : హుజురాబాద్ పట్టణ ప్రజలు తమపై పెట్టిన నమ్మకానికి తగ్గట్టుగా పని చేస్తున్నామని, హుజురాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రూ.15 కోట్లు రూపాయలను అభివృద్ధికి మంజూరు చేపించామని ఇందులో భాగంగా హుజురాబాద్ ప్రధాన చౌరస్తాలో పట్టణ సుందరీకరణలో భాగంగా 4 చౌరస్తాల అభివృద్ధికి నేడు శ్రీకారం చుట్టారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరలో గల చౌరస్తా అభివృద్ధికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో కోటి యాభై లక్షల రూపాయలతో నాలుగు ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తున్నామని, 4.5 కోట్లతో సీసీ రోడ్లు,2.5 కోట్లతో డ్రైనేజ్ పనులకు, చిన్నపిల్లలు ఆహ్లాదంగా ఉండడానికి చిల్డ్రన్ పార్క్ తో పాటు ఇతర అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.గ్రామాల్లో ఐ మాక్స్ లైట్స్,58 లక్షలతో గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బందికి కలగకుండా బోర్లను మంజూరు చేపించామని తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇతర నాయకుల్లాగా మాటలు చెప్పమని, ఏదైతే చెప్తామో దాన్ని చేసి చూపిస్తామని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద ప్రజలకు వరంగా మారిందని,ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని, పీసీసీ ఆదేశాల మేరకు మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమానికి నియోజకవర్గ ఇంచార్జిగా హుజురాబాద్ మండల పరిధిలోని ధర్మరాజుపల్లిలో దీపావళి పండుగ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో జరుపుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,50,000 వేల ఇళ్లు మంజూరు కాగా 2,21,500 ఇళ్లు పూర్తి అయ్యాయని, నియోజకవర్గ వ్యాప్తంగా 5500 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 2500 పై చిలుకు ఇళ్లు పూర్తి అయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వాన్ని, ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ అధ్యక్షుడు,జిల్లా అధికార ప్రతినిధులు, యూత్, సేవాదళ్, మైనారిటీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ డీసీపీ

- జేఎన్టీయూ, మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాల సందర్శన
- పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా భద్రతా ఏర్పాట్లు
- అడిషనల్ డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్



గోదావరిఖని, జనంసాక్షి : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో టీజీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేపట్టిన భద్రతా ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో, పెద్దపల్లిలోని మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో చేపట్టిన భద్రతా చర్యలు,పోలీస్ బందోబస్తు,పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

అసంపూర్తిగా సెంట్రల్ లైటింగ్ పనులు



ఆర్మూర్,నవంబర్ 6(జనం సాక్షి): ఆర్మూర్ పట్టణంలోని కోటార్మూర్-కరీంనగర్ రోడ్డు వైపు చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.ముఖ్యంగా విద్యుత్ సంబంధిత సెంట్రల్ లైటింగ్ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ పనులు పూర్తి చేయకుండానే దీపావళి పండుగ సందర్భంగా ప్రారంభోత్సవానికి అధికారులు సన్నాహాలు చేస్తుండటంపై స్థానికంగా చర్చ జరుగుతోంది.పనుల్లో జరుగుతున్న తీవ్ర జాప్యంపై ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి,అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తికా కుండానే ప్రారంభోత్సవానికి ఎలా సిద్ధమవుతున్నారంటూ సంబంధిత అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, కూడా పనుల జాప్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన కమిషనర్ శ్రీహరి రాజు,అసంపూర్తిగా ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తామని తెలిపారు. అయితే ప్రారంభోత్సవానికి ముందే అన్ని పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్మూర్ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కరీంనగర్ ఆర్టీసీ బస్ స్టాండ్లో వ్యక్తి దారుణ హత్య



కరీంనగర్, క్రైమ్ నవంబర్ 06 (జనంసాక్షి) : కరీంనగర్ ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంగణంలో గురువారం రాత్రి ఒక వ్యక్తి దారుణంగా హత్యకు గురైన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

కరీంనగర్ ఆర్టీసీ బస్ స్టేషన్లో కంట్రోలర్గా విధులు నిర్వహిస్తున్న అంబటి వెంకట్ రామ్ రెడ్డి తెలిపిన బస్ స్టాండ్ ఆవరణలో ఒక వ్యక్తి తలకు తీవ్ర రక్త గాయాలై చనిపోయినట్లు ఆటో డ్రైవర్లు ఆయనకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించగా, మృతుడిని జహీరాబాద్ మండలం, చిరాగ్పల్లి గ్రామానికి చెందిన ముద్ది సుధాకర్ ఏ సిద్ధు (22) గా గుర్తించారు. ఆయన కరీంనగర్కు చెందిన మిర్జా ఇబ్రహీం బేగ్ ఏ సుఫియా (23)తో కలిసి తిరుగుతూ, చెడు అలవాట్లకు బానిసలై ఆర్టీసీ బస్ స్టాండ్ పరిసరాల్లో నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తెలిసింది.

గత మూడు రోజులుగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ముద్ది సుధాకర్, మిర్జా ఇబ్రహీం బేగ్ను అసభ్యకరమైన పదజాలంతో దూషించడంతో ఆయనపై కక్ష పెంచుకున్నాడు. 5 తేదీన రాత్రి సుమారు 11:40 నుండి 11:50 గంటల మధ్యలో, ఆర్టీసీ బస్ స్టాండ్లోని మిడిల్ గేట్ (వాసవి లాడ్జి బోర్డు సమీపంలో) వద్ద సుధాకర్ నేలపై పడుకొని ఉండగా, మిర్జా ఇబ్రహీం బేగ్ వచ్చి ఆయనతో వాగ్వాదానికి దిగాడు. కోపంతో సుధాకర్ను చంపాలనే ఉద్దేశంతో సమీపంలో ఉన్న ఒక సిమెంట్ రాయిని తీసుకొని అతని తలపై బలంగా మోదడంతో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు బ్లూ కోర్ట్ సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని భద్రతా కారణాల దృష్ట్యా మరియు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడు మిర్జా ఇబ్రహీం బేగ్ పై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నవంబర్ 8వ తేదీన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 06 (జనం సాక్షి); రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నవంబర్ 8వ తేదీన జిల్లాలో మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నవంబర్ 8వ తేదీన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం నిర్వహణపై జిల్లాలోని ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ అధికారులతో శుక్రవారం అదనపు కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పూర్తయిన ఇళ్ల ముందు గోడలపై "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" అనే లోగో స్టిక్కర్ను అతికించాలని, లబ్ధిదారుల వివరాలను రాయాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి ఎదుట లబ్ధిదారుల కుటుంబ సభ్యులందరితో కలిసి దీపం వెలిగించి, 'ఇందిరమ్మ ఇళ్లు' మొబైల్ యాప్ ద్వారా ఫోటో తీసి, లబ్ధిదారులు లేదా వారి కుటుంబ సభ్యుల సోషల్ మీడియా ఖాతాల్లో అప్ లోడ్ చేయాలని తెలిపారు. జిల్లాలోని ఆయా గ్రామాల. పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు అధికారి ద్వారా, పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద లబ్ధిదారుల ఫోటోలను తీసి, సోషల్ మీడియా ఖాతాల్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ఇల్లు నిర్మించకముందు, నిర్మించిన తర్వాత ఉన్న స్థితిని చూపేలా ఒక ఫ్లెక్సీని తయారు చేసి, అందరికీ కనిపించేలా ప్రముఖ ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తమ పరిధిలో పూర్తిగా పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను గుర్తించాలని, లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు.ప్రజా ప్రతినిధులు, గృహ నిర్మాణ శాఖ, ఆయా శాఖల అధికారులు ఇందిరమ్మ గృహ కమిటీలతో సమన్వయం చేసుకుని, పూర్తయిన ఇళ్లను సందర్శించి, లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు.ఇట్టి టెలి కాన్ఫరెన్స్లో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఇంచార్జి హౌసింగ్ పీడీ సాజిద్ తదితరులు ఉన్నారు.

మహిళా ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా... వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కమాన్పూర్, నవంబర్ 06, (జనంసాక్షి): ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ లో మహిళా ఆరోగ్య వికాసం - గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాన్పూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెబల్ రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది అని పేర్కొంటూ, మహిళల సంక్షేమం కోసం వికాస తరంగిణి సంస్థ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని రెబల్ రాజ్ కుమార్ అభినందించారు. ప్రతి మహిళ తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్ బండి శంకర్, ఉపసర్పంచ్ గడ్డం రాజ మహేందర్, జెమినీ గౌడ్, దండేపల్లి విజయ్, నాగరాజు, సాంబరాజు, బండి లక్ష్మణ్, మాదాసు శివ, అంగన్వాడీ టీచర్ బుద్ధుల లావణ్య, ఆశా వర్కర్లు సుంకిత రాజేశ్వరి, మహిళా గ్రూప్ సభ్యురాలు బండి సౌమ్య, చొప్పరి జ్యోతి పాల్గొన్నారు.

రైతు పొలంలో పులి పిల్ల సంచారం

భయాందోళనల్లో గ్రామస్థులు.. మోతేలో రాజరాజేశ్వర ఆలయం సమీపంలో గుర్తింపు

- పొలాల వైపు వెళ్లాలంటేనే జంకుతున్న రైతులు
- అటవీశాఖ అధికారులు స్పందించాలని గ్రామస్థుల విజ్ఞప్తి



వేల్పూర్, నవంబర్ 6 (జనం సాక్షి): వేల్పూర్ మండలం మోతే గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయం సమీపంలో రైతు పొలంలో పులి పిల్ల కనిపించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. పొలానికి వెళ్లిన రైతు పులి పిల్లను గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. దీంతో చుట్టుపక్కల రైతులు, గ్రామస్థులు అటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. పులి పిల్ల అక్కడే ఉండటంతో తల్లి పులి కూడా సమీపంలోనే ఉండవచ్చని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లే రైతుల భద్రతపై ఆందోళన నెలకొంది. అటవీశాఖ అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని పులి పిల్ల ఆచూకీ తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జీడికే.ఓసి-5లో సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్పై అవగాహన




గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి ఆర్జీ.వన్ పరిధి జీడికే.ఓసి-5ను డీజీఎం (ఎస్ఎంటిసి) జివిఎన్విజయ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. గనిలోని అధికారులు, సిబ్బందికి ఓపెన్ కాస్ట్ గనులలో పాటించాల్సిన సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాల నిర్వహణ, భద్రతా నియమాలు పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలనీ, గనిలో భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేస్తూ అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అనిల్ గబలే, సేఫ్టీ ఆఫీసర్ గంధం రాములు, ఆఫ్లోడింగ్ ఇన్చార్జ్ ఎ. రవి, ప్రాజెక్ట్ ఇంజనీర్ పి. శైలేంద్ర కుమార్, ఏ.ఐ.టి.యు.సి పిట్ సెక్రటరీ గుర్రం ప్రభుదాస్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను వేధించి, దాడికి పాల్పడిన రౌడీషీటర్ అరెస్ట్

అమీర్పేట /బోరబండ,(జనం సాక్షి): మహిళను వేధిస్తూ, వెంబడించి దాడికి పాల్పడటంతో పాటు ఆమెను, కుమారుడిని హత్య చేస్తానని బెదిరించిన రౌడీషీటర్ను బోరబండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహ్మద్ ఫరూక్ (32) తనతో సంబంధాన్ని కొనసాగించేందుకు నిరాకరించినప్పటికీ తరచూ వేధిస్తున్నాడని, వెంబడిస్తూ అసభ్యంగా దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో తనను, తన మైనర్ కుమారుడిని చంపుతానని బెదిరిస్తున్నట్లు తెలి పింది. ఈ నెల 4న బాధిత రాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో రెండు హత్య కేసుల్లోనూ అతడికి ప్రమేయం ఉందని ఇన్స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

ధన త్రయోదశికి ఆభరణాలపై భారీ రాయితీలు!

- మేకింగ్ ఛార్జీలపై 50 శాతం వరకు డిస్కౌంట్
- దీపావళి వరకు కళ్యాణ్, జయాలుకాస్ ఆఫర్లు
- మలబార్లో నవంబర్ 30 వరకు 30 శాతం రాయితీ
- పండుగ కొనుగోళ్లకు వినియోగదారులకు ప్రత్యేక అవకాశం



కరీంనగర్ టౌన్, నవంబర్ 6 (జనం సాక్షి): ధన త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్లోని ప్రముఖ జువెలరీ సంస్థలు బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రత్యేక రాయితీలు ప్రకటించాయి. కళ్యాణ్ జువెలర్స్, జయాలుకాస్ సంస్థలు మేకింగ్ ఛార్జీలపై 50 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తుండగా, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 30 శాతం రాయితీ ప్రకటించింది. కళ్యాణ్ జువెలర్స్లో మేకింగ్ ఛార్జీలపై 50 శాతం ప్రత్యేక ఆఫర్ దీపావళి వరకు అందుబాటులో ఉంటుందని సంస్థ మార్కెటింగ్ మేనేజర్ తెలిపారు. తమ సంస్థపై నమ్మకంతో ఆదరిస్తున్న వినియోగదారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కరీంనగర్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు చెప్పారు. జయాలుకాస్లోనూ మేకింగ్ ఛార్జీలపై ఫ్లాట్ 50 శాతం రాయితీని దీపావళి వరకు అందిస్తున్నట్లు మార్కెటింగ్ మేనేజర్ వెల్లడించారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్లో మేకింగ్ ఛార్జీలపై 30 శాతం రాయితీ నవంబర్ 30 వరకు కొనసాగుతుందని సంస్థ ప్రతినిధి తెలిపారు. హిందూ సంప్రదాయంలో ధన త్రయోదశి రోజున బంగారం, వెండి కొనుగోలు చేయడం శుభప్రదమనే విశ్వాసం ఉంది. ఈ నేపథ్యంలో పండుగ కొనుగోళ్లకు సిద్ధమవుతున్న వినియోగదారులను ఆకట్టుకునేలా జువెలరీ సంస్థలు ప్రత్యేక ఆఫర్లు అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఆయా సంస్థల నిర్వాహకులు పట్టణ ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

కరీంనగర్లో కేఎఫ్సీపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

తనిఖీల్లో నాసిరకం వంట నూనె గుర్తింపు.. అధికారులకు సహకరించని సిబ్బంది


కరీంనగర్ టౌన్, నవంబర్ 6 (జనంసాక్షి) : నగరంలోని ప్రముఖ ఫాస్ట్ఫుడ్ రెస్టారెంట్ కేఎఫ్సీపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల నాణ్యత, తయారీలో ఉపయోగిస్తున్న వంట నూనె ప్రమాణాలు, పరిశుభ్రతను పరిశీలించేందుకు అధికారులు రెస్టారెంట్కు వెళ్లారు. ఈ తనిఖీల్లో నాసిరకం వంట నూనెను గుర్తించినట్లు సమాచారం. అయితే తనిఖీలకు వచ్చిన అధికారులకు తొలుత రెస్టారెంట్ సిబ్బంది సహకరించకపోవడంతో వాగ్వివాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. దీంతో అధికారులు రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు సహకరించడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలను కొనసాగించారు. ఈ సందర్భంగా వంట నూనె నాణ్యత, నిల్వ ఉంచిన విధానం, వంటగది పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాల అమలును పరిశీలించారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?

నిత్యం పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఫాస్ట్ఫుడ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్న నేపథ్యంలో ఆహార నాణ్యత విషయంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత ఎక్కువగా ఇష్టపడే ఇటువంటి రెస్టారెంట్లలో నాణ్యమైన ముడి సరుకులు, ప్రమాణాలకు అనుగుణమైన వంట నూనెను ఉపయోగించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని పేర్కొంటున్నారు. ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నగరంలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలోనూ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

విప్లవ విద్యార్థి ఉద్యమాలకు పునాది జంపాల చంద్రశేఖర్ ప్రసాద్


- పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, నగర అధ్యక్షుడు సిర్రం పవన్ కుమార్
- ఘనంగా జేసీఎస్ ప్రసాద్ వర్ధంతి ర్యాలీ, నివాళులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 6 జనం సాక్షి: ప్రగతిశీల విప్లవ విద్యార్థి ఉద్యమాలకు, విప్లవ చైతన్యానికి జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ (జేసీఎస్ ప్రసాద్) నిలువెత్తు ప్రతీక అని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, నగర అధ్యక్షుడు సిర్రం పవన్ కుమార్ కొనియాడారు. పిడిఎస్యూ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్ నుండి జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ గ్రంథాలయం వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పిడిఎస్యూ నాయకులు మాట్లాడుతూ... నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాల వెల్లువలో ఉస్మానియా యూనివర్సిటీలో జార్జ్ రెడ్డి నాయకత్వంలో పిడిఎస్యూ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. మతోన్మాదుల చేతిలో జార్జ్ రెడ్డి దారుణ హత్యకు గురైన అనంతరం, జేసీఎస్ ప్రసాద్ విప్లవ విద్యార్థి నిర్మాణాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తరింపజేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కేవలం విద్యారంగ సమస్యలకే పరిమితం కాకుండా దోపిడీ, అసమానతలు లేని సమసమాజ స్థాపన కోసం ఆయన నిరంతరం తపించారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ఆనాటి పాలకులు ఆయనను ఎన్కౌంటర్ పేరుతో పొట్టనబెట్టుకున్నారని, ఆయన అమరుడై 50 ఏళ్లు గడిచినా ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటికీ సజీవంగానే ఉన్నాయని స్పష్టం చేశారు.ప్రస్తుత దేశ రాజకీయ వాతావరణంపై నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ... నేడు విద్యను కార్పొరేట్ వ్యాపారుల గుప్పిట్లో పెట్టి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. విద్యను కాషాయీకరించే విధానాలను తీసుకువచ్చి విద్యార్థుల మెదళ్లను కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. జేసీఎస్ ప్రసాద్ పోరాట స్ఫూర్తితో విద్యార్థులందరూ అప్రమత్తమై విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ నగర నాయకులు మనోజ్, భవాని, శ్రీకర్, దత్తు, రాజా, వంశీ, సాయి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దత్తత వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం

- చిన్నారి భవిష్యత్తే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చొరవ
- హామా-1956 ప్రకారం దత్తత ప్రక్రియ పూర్తి
- రిట్ అప్పీల్ ఉపసంహరణకు ప్రభుత్వానికి నివేదిక



జగిత్యాల బ్యూరో, నవంబర్ 6 (జనం సాక్షి): జగిత్యాల జిల్లాలో వివాదాస్పదంగా మారిన దత్తత వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవతో సామరస్యపూర్వకంగా పరిష్కరించింది. చిన్నారి సంక్షేమం, భవిష్యత్తు భద్రత, చట్టపరమైన హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సంబంధిత కుటుంబాలు, అధికారులతో సమన్వయం చేసింది. హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం-1956 (హామా) ప్రకారం జగిత్యాల సబ్రిజిస్ట్రార్ కార్యాలయంలో దత్తత ప్రక్రియను పూర్తి చేశారు. సంబంధిత బాలల సంక్షేమ అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. వివాదం పరిష్కారం కావడంతో గతంలో దాఖలైన రిట్ అప్పీల్ను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా యంత్రాంగం తెలిపింది. చిన్నారి శ్రేయస్సు, భవిష్యత్తే లక్ష్యంగా మానవతా దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఆగ్రోఫారెస్ట్రీతో అదనపు ఆదాయం

యాచారం, (జనం సాక్షి): సంప్రదాయ పంటలతోపాటు వేప, చింత, కుంకుడు, మునగ వంటి చెట్లను పెంచడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి సురేష్ సూచించారు. యాచారం రైతు వేదికలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆగ్రోఫారెస్ట్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ ఉద్యాన సంచాలకురాలు అరుణ, రాంబాబు, నవీన, రవినాథ్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బ్రాంచ్ (21537), N అన్నారం, పెన్ పహాడ్ (మం), జిల్లా: సూర్యాపేట.

బంగారు ఆభరణములు వేలం ప్రకటన

ఈ క్రింద పేర్కొనబడిన ఖాతాదారుడు మా బ్యాంక్ నందు బంగారు అభరణములు తాకట్టు పెట్టి అప్పు తీసుకొని బకాయి తీర్చనందున సదరు ఆభరణములను బ్యాంక్ ఆవరణలో తేది. 13-11-2026న సాయంత్రం 4-00 గంటలకు బహిరంగ వేలం వేసి అట్టి సొమ్ము వారి ఋణ ఖాతాకు జమ చేసుకొనుటకు నిర్ణయించడమైనది.

వేలం జరుగు ప్రదేశం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్రాంచ్(21537), N అన్నారం, పెన్ పహాడ్ (మం),

వ. నెం	అకౌంట్ నెం	ఖాతాదారుని పేరు, చిరునామా	బంగారం (మొత్తం బరువు గ్రాములలో)
1	44305786206	శ్రీరాముల సంధ్య, W/O శ్రీరాముల కోటయ్య, N అన్నారం, పెన్ పహాడ్ (మం), సూర్యాపేట జిల్లా	10.9 గ్రాములు

వేలంలో పాల్గొనదలచిన వారు KYC, రూ.10,000 ధరావత్తు చెల్లించి పాల్గొనగలరు. వేలంలో గెలుపొందిన వారు ఆఫరు ధరను అదే రోజు చెల్లించ వలెను. లేనిచో అప్పటి వరకు చెల్లించిన మొత్తం తిరిగి ఇవ్వబడదు. ఏ కారణం లేకుండా వేలం వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. మరిన్ని వివరములకు బ్యాంకు పని దినములలో సంప్రదించగలరు.

తేది.: 13-11-2026,
స్థలం: N అన్నారం
-ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్

అసైన్డ్ భూముల ఆక్రమణలపై కొరడా

- రాందాస్‌పల్లిలో 10 ఎకరాల్లో ఆక్రమణలు తొలగింపు
- సర్వే నంబర్ 86లో ప్రహరీ గోడను కూల్చివేత
- భూకబ్జాలపై ఉపేక్షించేది లేదు
- ఇబ్రహీంపట్నం ఆర్ఐ మాధవి హెచ్చరిక

రంగారెడ్డి, నవంబర్ 6 (జనంసాక్షి) : అసైన్డ్ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఇందులో భాగంగా అదిబట్ల సర్కిల్ పరిధిలోని రాందాస్‌పల్లి గ్రామ సర్వే నంబర్ 86లోని దాదాపు 10 ఎకరాల అసైన్డ్ భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను శుక్రవారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. రెవెన్యూ యాక్షన్ తో కబ్జాదారుల్లో గుబులు పుట్టుకుంది. ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) మాధవి, జీపీఓ సుదర్శన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో కలిసి ఈ తొలగింపు చర్యలు చేపట్టారు. విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మించడాన్ని తీవ్రంగా పరిగణించిన అధికారులు, జేసీబీల సహాయంతో వాటిని పూర్తిగా తొలగించారు.

10 ఎకరాల భూమిలో కూల్చివేతలు..

రాందాస్‌పల్లి గ్రామ సర్వే నంబర్ 86లో దాదాపు 10 ఎకరాల



అసైన్డ్ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి, దాని చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు తేలడంతో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) మాధవి, జీపీఓ సుదర్శన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది జేసీబీల సహాయంతో ఘటనా స్థలానికి చేరుకుని అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడలను పూర్తిగా కూల్చివేశారు. కాగా, గత వారం రోజుల క్రితం కబ్జాదారుల హెచ్చరికలు జారీ చేశారు. ప్రీకాస్టింగు గోడలను తొలగించాలని సూచించారు. వారి నుండి ఎలాంటి ప్రతిస్పందన లేకపోవడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఆక్రమణలను తొలగించారు.

కబ్జాదారుల్లో కలకలం..

విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ఆక్రమణదారులు వేసిన పథకాన్ని అధికారులు తిప్పికొట్టారు. ఈ కూల్చివేత చర్యతో ప్రాంతీయ భూకబ్జాదారులు, అక్రమార్కుల్లో తీవ్ర కలకలం రేగింది. ప్రభుత్వం పేద రైతులకు సాగు చేసుకునేందుకు మాత్రమే పట్టాలు ఇచ్చిందని, అమ్మకాలు, కొనుగోళ్లు చేసేందుకు వీలులేదని అధికారులు తేల్చి చెప్పారు. దాంతో కబ్జాదారుల్లో కలకలం మొదలైంది.

ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు..

ప్రభుత్వ, అసైన్డ్ , పీఓటీ భూముల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవి అన్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ప్రాకారాలు, నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అసైన్డ్ భూములు పేదల సంక్షేమం కోసం కేటాయించినవని, వీటిని ఆక్రమించుకోవాలని చూస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుంటే స్థానిక ప్రజలు వెంటనే రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అసైన్డ్ భూముల పరిరక్షణలో భాగంగా రాబోయే రోజుల్లో కూడా ఆక్రమణలపై నిరంతరం నిఘా ఉంచి, కఠిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

తెల్లాపూర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 1.904 కిలోల గంజాయి స్వాధీనం



రామచంద్రాపురం, నవంబరు 6 (జనం సాక్షి) : బీహార్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలించి విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను కొల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.904 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్‌లోని జె.పి. కాలనీలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు నవంబరు 6న పోలీసులకు సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టి ఇర్ఫాన్ ఆలం (22), అజహరుద్దీన్ అన్సారీ (22)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నల్లరంగు బ్యాగును పరిశీలించగా రెండు ప్యాకెట్లలో 1.904 కిలోల గంజాయి లభించింది. విచారణలో ఈ నెల 2న బీహార్ సరిహద్దు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద సుమారు రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్లు నిందితులు వెల్లడించారు. రైలు మార్గంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి జె.పి. కాలనీలోని తమ నివాసంలో ఉంచినట్లు తెలిపారు. లేబర్ క్యాంపుల్లో పనిచేసే కార్మికులకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అల్వాల్‌లో రూ.83 లక్షలతో రోడ్ల నిర్మాణం

- ఐదు కాలనీల్లో సీసీ, బీటీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం



అల్వాల్, నవంబరు 6 (జనంసాక్షి) : అల్వాల్ డివిజన్ పరిధిలోని ఐదు కాలనీల్లో రూ.83 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతోపాటు కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. వాసవి నగర్, భీమ్‌నగర్ రావులో రూ.8 లక్షల చొప్పున, సంపత్ చిత్తరయ్య కాలనీలో రూ.24 లక్షలు, రిటైర్డ్ కాలనీలో రూ.18 లక్షలు, బీహెచ్ఈఎల్ కాలనీలో రూ.25 లక్షలతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నుంచి డంపింగ్ కేంద్రం తరలింపు

- ఎన్‌హెచ్ఆర్‌సీ జోక్యంతో కీలక ముందడుగు..
- జవహర్‌నగర్‌లో ప్రత్యామ్నాయ స్థలం ఎంపిక
- 100కుపైగా ఫిర్యాదులతో విచారణ చేపట్టిన కమిషన్
- నాలుగు స్థలాలను పరిశీలించి సర్వే నంబరు 168 ఎంపిక
- తరలింపునకు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ హామీ

అల్వాల్, నవంబరు 6 (జనంసాక్షి) : మచ్చబొల్లారం సాయిరెడ్డినగర్ హిందూ శ్మశానవాటికలో కొనసాగుతున్న చెత్త డంపింగ్ కేంద్రాన్ని జవహర్‌నగర్‌కు తరలించేందుకు మార్గం సుగమమైంది. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) సభ్యురాలు విజయభారతి సయాని నేతృత్వంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి, మున్సిపల్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి, ఇతర అధికారులు నాలుగు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించారు. జవహర్‌నగర్ సర్వే నంబరు 168లోని స్థలాన్ని ఎంపిక చేయగా.. డంపింగ్ యార్డు, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను అక్కడికి తరలిస్తామని కలెక్టర్, కమిషనర్ కమిషన్ సమక్షంలో హామీ ఇచ్చినట్లు విజయభారతి వెల్లడించారు.

100కుపైగా ఫిర్యాదులతో కమిషన్ జోక్యం

మచ్చబొల్లారం సర్వే నంబరు 199లోని హిందూ శ్మశానవాటికలో డంపింగ్ యార్డు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్వహణపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 100కుపైగా ఫిర్యాదులు ఎన్‌హెచ్ఆర్‌సీకి అందాయి. దీంతో కమిషన్ ఈ అంశాన్ని విచారణకు స్వీకరించింది. సభ్యురాలు విజయభారతి సయాని గతంలో రెండు, మూడు పర్యాయాలు స్వయంగా అక్కడ పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతున్నట్లు గుర్తించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు.

నాలుగు స్థలాల పరిశీలన

ఈ క్రమంలో శుక్రవారం జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, జేఏసీ ప్రతినిధులతో కలిసి విజయభారతి క్షేత్రస్థాయిలో పర్యటించారు. గతంలో ప్రతిపాదించిన నాలుగు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించారు.



వాటిలో జవహర్‌నగర్ పరిధిలోని సర్వే నంబరు 168లో గల స్థలాన్ని ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు.

కమిషన్ సమక్షంలో అధికారుల హామీ

మచ్చబొల్లారం శ్మశానవాటికలోని డంపింగ్ యార్డు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఎంపిక చేసిన స్థలానికి తరలిస్తామని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు విజయభారతి తెలిపారు. ఈ పరిణామంపై కమిషన్ సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. ఎన్‌హెచ్ఆర్‌సీ జోక్యంతో తమ సుదీర్ఘ పోరాటానికి ఫలితం లభించే దిశగా అడుగులు పడటంపై స్థానికులు, శ్మశానవాటిక పరిరక్షణ జేఏసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డేది..!

- యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు
- నాలాను పూడ్చి భారీ షెడ్డు నిర్మాణం
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 6 (జనం సాక్షి) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఎల్బీనగర్ జోన్ నాగోల్ సర్కిల్ పరిధిలోని తట్టి అన్నారంలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ కొందరు నిర్మాణదారులు యథేచ్ఛగా భవనాలు, భారీ షెడ్లు నిర్మిస్తున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తట్టి అన్నారం నుంచి నాగోల్ వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న నాలాను పూడ్చివేసి భారీ షెడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలా ఆక్రమణకు గురైతే వర్షాకాలంలో వరదనీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి కీలకమైన అంశంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అలాగే ఇక్కడ నిర్మించే షెడ్డు కు ఇలాంటి అనుమతులు లేకపోవడం మరో కోణం. అదేవిధంగా తట్టి అన్నారంలోని అన్నవరం సత్యనారాయణ స్వామి కాలనీలోనూ అనుమతులు లేకుండా భారీ షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నిర్మాణాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఫిర్యాదులు అందుతున్నా



అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని ప్రశ్నిస్తున్నారు.అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, అనుమతులకు విరుద్ధంగా అదనపు నిర్మాణాలు చేయడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు పట్టణ ప్రణాళిక దెబ్బతింటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తట్టి అన్నారంలో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, నాలా ఆక్రమణలను అడ్డుకోవాలని, అనుమతులు లేని షెడ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలు భారీగా తగ్గింపు

- నెలవారీ పాస్ రూ.8,500 నుంచి రూ.4,000కు కుదింపు
- నవంబర్ 8 నుంచి కొత్త ధరలు అమలు..



ముషీరాబాద్, నవంబర్ 6 (జనం సాక్షి) : రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా మెట్రో--ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ.275కు తగ్గించినట్లు తెలిపారు. ఇందులో మెట్రోకు రూ.200, ఆర్టీసీకి రూ.75 కేటాయించగా, రోజుకు నాలుగు సింగిల్ జర్నీలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి రూ.4,000కు తగ్గించారు. ఇందులో మెట్రోకు రూ.3,000, ఆర్టీసీకి రూ.1,000 కేటాయించారు. ఈ పాస్ ద్వారా నెలకు గరిష్టంగా 50 రౌండ్ ట్రిప్పులు ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ తగ్గింపుతో నెలవారీ పాస్ వినియోగదారులకు రూ.4,500 వరకు ఆదా అవుతుందని వివరించారు. తగ్గించిన కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజా రవాణాను మరింత అందుబాటులోకి తీసుకురావడం, ప్రయాణికుల ఖర్చులు తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్ రెడి రాక

- భారీ పెట్టుబడులకు ప్రణాళికలు
- ప్రపంచ పారిశ్రామిక వేతలతో సమావేశం
- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- ఆధునిక వ్యవసాయ సాగుపై రైతులకు దశ దిశ నిర్దేశం
- మహిళా సాధికారత దిశగా మహిళా సంఘాలతో సీఎం ముఖాముఖి
- ప్రపంచ దేశ పారిశ్రామిక నేతలకు ఆకర్షించే వేదికగా కొడంగల్
- సీఎం బర్త్ డే గిఫ్ట్‌గా అనేక అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలు మరిన్ని వరాల జల్లులు

వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 6 (జనం సాక్షి) : ప్రపంచ దేశాల పెట్టుబడులు బడ పారిశ్రామికవేతలను ఆకట్టుకోవడానికి ఒక గ్రామంలో హీరో మహేష్ బాబు శ్రీమంతుడు సినిమాలో వేదికను ఏర్పాటు చేసిన సన్నివేశం వెండితెరపై చూసాం... కానీ అదే తరహాలో ప్రపంచ పారిశ్రామికవేత్తలను తెలంగాణ రాష్ట్రానికి పరిచయం చేసి పెట్టుబడులను ఆకర్షించడానికి శ్రీమంతుడు సీన్ సీఎం రేవంత్ రెడ్డి ఇలాఖ వికారాబాద్ జిల్లా కొడంగల్ లో వేదిక ఏర్పాటయింది. దాదాపు 9100 కోట్ల పెట్టుబడులతో సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ వేదికగా భారీ ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగానే ఈ నెల ఏడవ తేదీ నుంచి 9వ తేదీ వరకు వరుసగా వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. అందులో భాగంగానే జిల్లా



అధికార యంత్రాంగం గత వారం రోజులుగా కసరత్తు చేసి కార్యక్రమాలను రూపొందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం రోజున రైతు మేళ ప్రారంభిస్తారు. ఆధునిక వ్యవసాయ పనిముట్లు ఆధునిక వ్యవసాయం తక్కువ వర్షపాతంతో ఎక్కువ పంటలు పండించే విధానం. రైతులకు అధిక లాభాలు వచ్చే పంటలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపడతారు. ఆదర్శ రైతులకు అర్థమయ్యే విధంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సాగుబడి కొనసాగించడానికి శాస్త్రవేత్తలు వారికి దిశ దశ నిర్దేశం చేస్తారు. ప్రపంచ దేశాల పెట్టుబడులను ఆకర్షించే కొడంగల్ ను వేదికగా చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమావేశమై భారీ ప్రణాళికలకు రూపకల్పన చేయనున్నారు. తెలంగాణ లోని వివిధ ప్రాంతాలతో పాటు కొడంగల్ లో పారిశ్రామిక వాడ ఏర్పాటు కు అనువైన ప్రాంతంగా గుర్తింపు తెస్తూ ఇక్కడ భారీ పెట్టుబడులు పెట్టడానికి ప్రణాళికలు రూపొందించనున్నారు. ఫలితంగా నిరుద్యోగ యువతీ యువకులకు అధిక ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. అంతేకాకుండా లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ ఎక్స్టెన్షన్ ప్రారంభించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం రోజున మహిళా సాధికారత దిశగా మహిళా సంఘాలతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నవారు. అంతేకాకుండా ఆదివారం రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు జరగనున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పగ్గాలు చేపట్టిన తర్వాత రెండోసారి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నారు. ఈసారి పుట్టినరోజు వేడుకలకు కొడంగల్ వేదిక కానున్నది. సొంత నియోజకవర్గం పుట్టినరోజు వాటికి తోడు దీపావళి పండగ అన్ని కలిసి రావడంతో ధూంధాంగా కార్యక్రమాలు జరగనున్నాయి. బర్త్ డే గిఫ్ట్ దీపావళి సందర్భంగా కొడంగల్ కు మరిన్ని వరాలను సీఎం రేవంత్ రెడ్డి కురిపించే అవకాశం ఉంది. అదే రోజు పాఠశాలలు కళాశాలలు పోలీస్ భవనాలు సమీకృత భవనాలు ఆరోగ్య ఉప కేంద్రాలు అంగన్వాడి భవనాలు ప్రారంభించి కొన్నిటికి శంకుస్థాపనలు చేయమన్నారు. సోమవారం రోజున సాయంత్రం కొడంగల్ లో భారీ రైతు బహిరంగ సభ జరగనున్నది. ఈ కార్యక్రమం ముగించుకొని సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ వెళ్తారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు రైతులు మహిళలు పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యేలు మంత్రులు కార్పొరేషన్ చైర్మన్లు భారీగా తరలి రావడానికి అవకాశం ఉన్నందున వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి చర్యలు చేపట్టారు.

రెనివట్లలో సదర్ వేడుకలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

- జిల్లా కలెక్టర్‌కు శ్రీకృష్ణ యాదవ సంఘం వినతి



మద్దూరు, నవంబర్ 6 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రెనివట్ల గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గత ఐదేళ్లుగా రెనివట్ల గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలను ఈ ఏడాది కూడా మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు సదర్ వేడుకలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, ఇతర కార్యక్రమాల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్ వేడుకల కోసం కేటాయించిన నిధుల్లో రెనివట్ల గ్రామానికి కూడా తగిన వాటా కేటాయించి, యాదవుల సంప్రదాయ పండుగను విజయవంతం చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శ్రీకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు. జి. నాగులు యాదవ్, జి. పకిరప్ప యాదవ్, జి. నర్సిములు యాదవ్, పి. రాములు యాదవ్, వై. కనకప్ప యాదవ్, జి. మల్లేష్ యాదవ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
07 నవంబర్ 2026

చాయ్‌ల సరసన ఇప్పపువ్వు టీ

మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఇప్ప పువ్వు టీ-స్టాల్ ప్రారంభించిన మంత్రి సీతక్క



ములుగు జిల్లా, నవంబర్ 6 (జనంసాక్షి) : అల్లం చాయ్, మసాలా చాయ్, గ్రీన్ టీ, లెమన్ టీ.. ఇలా ఎన్నో రకాల చాయ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండగా.. ఇప్పుడు వాటి సరసన ఇప్ప పువ్వు చాయ్ కూడా చేరింది. ఇప్పటికే ఇప్ప పువ్వుతో తయారు చేస్తున్న లడ్డూలు ప్రత్యేక గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో, ఇప్ప పువ్వు టీకి కూడా విస్తృత ప్రచారం కల్పించేందుకు మంత్రి సీతక్క స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామం వద్ద మహిళా స్వయం సహాయక సంఘాల చే ఇప్ప పువ్వు టీ స్టాల్‌ను మంత్రి ఏర్పాటు చేయించి ప్రారంభించారు. అడవుల్లో సహజంగా లభించే ఇప్ప పువ్వు ఆదివాసి గిరిజనుల జీవన విధానంలో భాగమని, తరతరాలుగా వారు ఇప్ప పువ్వును వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అటవీ ఉత్పత్తులను కేవలం సేకరించి విక్రయించడానికే పరిమితం కాకుండా, వాటికి అదనపు విలువ జోడించి మార్కెట్‌లో విక్రయించగలిగితే మహిళలకు మెరుగైన ఆదాయం లభిస్తుందని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులతో వినూత్న ఉత్పత్తులను తయారు చేసి వ్యాపారవేత్తలుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. ఇప్ప పువ్వు టీకి ప్రజల్లో ఆదరణ పెరిగేలా తానే ప్రచారం చేస్తానని, మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ములుగు ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఇప్ప పువ్వు టీని ప్రత్యేక ఆకర్షణగా పరిచయం చేయడంతో పాటు, ఈ ఉత్పత్తిని మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అటవీ సంపదకు విలువను జోడించి ఆదివాసి గిరిజన మహిళల చేతుల్లో ఆర్థిక సంపదగా మార్చడమే లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు.

గ్రామపంచాయతీల సొంత ఆదాయం
ఇక నేరుగా గ్రామపంచాయతీ ఖాతాల్లోనే..

చట్ట సవరణ అమలుకు ఉత్తర్వులు జారీ..

- గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం
- ఉత్తర్వులు వెలువడటం పట్ల మంత్రి సీతక్క హర్షం
- పల్లెల ఆర్థిక స్వావలంబనకు కీలక ముందడుగు
- మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి) : గ్రామపంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకునే ఆదాయం ఇకపై ట్రెజరీలో జమ కాకుండా నేరుగా గ్రామపంచాయతీల సొంత ఖాతాల్లోనే జమ అయ్యేలా చేసిన చట్ట సవరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం-2026ను అక్టోబర్ 9, 2026 నుంచి అమల్లోకి తీసుకొస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో నంబర్ 43ను శుక్రవారం నాడు జారీ చేసింది. గతంలో గ్రామపంచాయతీలు సమకూర్చుకున్న సొంత ఆదాయం ట్రెజరీ ద్వారా ఖర్చు చేయాల్సి రావడంతో గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులోకి రావడంలో జాప్యం జరిగేది. అత్యవసర పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, రహదారులు, ఇతర స్థానిక అవసరాల కోసం గ్రామపంచాయతీలు నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. గ్రామాల అవసరాలకు అనుగుణంగా సొంత ఆదాయాన్ని వేగంగా వినియోగించుకునేలా ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. మంత్రి సీతక్క చొరవతో గ్రామపంచాయతీలకు ఆర్థిక స్వావలంబన పెంచే దిశగా తీసుకున్న ఈ నిర్ణయానికి ఇప్పుడు అమలు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రామపంచాయతీల సొంత ఆదాయం నేరుగా వాటి ఖాతాల్లోనే జమ కావడంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వేగంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడనుంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన మరింత వేగంగా జరిగే అవకాశం ఉంది. గ్రామాల అభివృద్ధికి గ్రామపంచాయతీలే మరింత బాధ్యతతో నిర్ణయాలు తీసుకునేలా, స్థానిక సంస్థలకు ఆర్థిక స్వేచ్ఛను పెంచే దిశగా ఈ చట్ట సవరణ కీలక అడుగుగా ప్రభుత్వం పేర్కొంది.చట్ట సవరణ ఉత్తర్వులు వెలువడటం పట్ల మంత్రి సీతక్క హర్షం చేశారు. పల్లెల ఆర్థిక స్వావలంబనకు కీలక ముందడుగు అని వ్యాఖ్యానించారు.

చెంచులకు అర్హులందరికీ ఉపాధి.. మరిన్ని పనిదినాలు కల్పిస్తాం

చెంచు గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తున్నామని, అవసరమైన మేరకు మరిన్ని పనిదినాలు అందిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే చెంచు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీల సంఖ్య అధికంగా ఉందని పేర్కొన్నారు. కూలి కోసం కూటీ కోసం చెంచుల వలస బాట అని ఓ దిన పత్రికలో వచ్చిన కథనానికి మంత్రి సీతక్క స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెప్పించుకున్నారు. చెంచు గ్రామాల్లో ఉపాధి అవకాశాలను మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో మేట్లను నియమించి, ఉపాధి పనుల గుర్తింపు, కూలీల సమీకరణను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి, ఏడాది పొడవునా ఉపాధి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద అర్హులైన చెంచు కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పించడంతో పాటు, జలసిరి కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ వంటి పనులను చేపట్టి స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచుతున్నామని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఇప్పటికే ఆమోదం పొందిన పనులను వేగంగా ప్రారంభించేలా ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. చెంచు కుటుంబాలు ఉపాధి కోసం తమ గ్రామాలను విడిచి వలస వెళ్లాల్సిన పరిస్థితి రాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ స్థానికంగానే పని కల్పిస్తూ, అవసరమైన మేరకు అదనపు పనిదినాలు అందిస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

ఫీజులు తీసుకుని సర్టిఫికెట్లు ఆపేస్తారా?

10వ తేదీలోగా విద్యార్థినుల సర్టిఫికెట్లు అందేలా చూడాలని ఆర్జేడీకి సూచన

- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించం.. ఇతర విద్యాసంస్థలు జాగ్రత్త
- ఇలాంటి ప్రవర్తనను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా..
- ఇలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతా
- నల్ల మల్లారెడ్డి స్కూల్‌పై గద్వాల విజయలక్ష్మి సీరియస్



హైదరాబాద్ (జనంసాక్షి) : ఫీజులు చెల్లించినప్పటికీ ఇద్దరు మైనర్ విద్యార్థినుల అకడమిక్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఫిర్యాదుపై ఘట్కేసర్ మండలం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి తీవ్రంగా స్పందించారు. సీఎం ప్రజావాణిని ఆశ్రయించిన ఇద్దరు బాలికలు తమకు అవసరమైన సర్టిఫికెట్లు అందక చదువు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యను స్వయంగా విన్న గద్వాల విజయలక్ష్మి వెంటనే స్కూల్ ఎడ్యుకేషన్ రాజేడీ సోమిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.

'ఫీజులు చెల్లించిన తర్వాత కూడా పిల్లల సర్టిఫికెట్లు ఎందుకు నిలిపివేస్తున్నారు? వారి చదువు ఆగిపోయే పరిస్థితి రావడం ఏ మాత్రం సహించేది కాదు. 10వ తేదీలోగా వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలి" అని ఆర్జేడీకి స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారం కాకపోతే విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని గద్వాల విజయలక్ష్మి తెలిపారు. ఈ అంశంపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు కూడా ఆమె అధికారికంగా లేఖ రాశారు. విద్యార్థినులకు అవసరమైన విద్యా ధ్రువపత్రాలను వెంటనే అందజేయడంతో పాటు, వారు చేసిన వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. "విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరూ ఆటలాడకూడదు. ఫీజులు లేదా పరిపాలనా సమస్యల పేరుతో పిల్లల చదువును అడ్డుకోవడం సహించం. విచారణలో తప్పిదం నిర్ధారణైతే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తప్పవు" అని గద్వాల విజయలక్ష్మి హెచ్చరించారు. రాష్ట్రంలోని ఇతర విద్యాసంస్థలు కూడా ఈ అంశాన్ని గమనించాలని, విద్యార్థులను వేధించడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం లేదా వారి విద్యకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని స్పష్టం చేశారు. "పిల్లల చదువు ఆగకూడదు. వారి విద్యా హక్కు, భవిష్యత్తు విషయంలో సీఎం ప్రజావాణి రాజీపడదు" అని గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. కాగా శుక్రవారం జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 83 దరఖాస్తులు అందాయి..

ఉప్పల్ ఫైర్ స్టేషన్‌పై ఏసీబీ దాడులు

ఐదుగురు అధికారుల వద్ద అనుమానాస్పద నగదు గుర్తింపు

- 80 ఆన్‌లైన్ లావాదేవీలపై ఆరా





ఉప్పల్, నవంబర్ 6 (జనంసాక్షి): ఉప్పల్ భగాయత్‌లోని ఫైర్ స్టేషన్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం కలకలం రేపింది. ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారుల వ్యవహారాలపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. తనిఖీల సందర్భంగా సుమారు ఐదుగురు ఫైర్ అధికారుల వద్ద అనుమానాస్పద నగదును గుర్తించినట్లు తెలుస్తోంది. నగదు మూలాలు, ఆదాయ వివరాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం.

80 లావాదేవీలపై విచారణ

మరోవైపు సుమారు 80 ఆన్‌లైన్ లావాదేవీల వివరాలపై ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. ఏ ఖాతాల నుంచి నగదు బదిలీ అయింది? ఎవరి ఖాతాల్లోకి చేరింది? అనే కోణంలో విచారణ సాగుతున్నట్లు సమాచారం. ఫైర్ స్టేషన్ పరిధిలోని అధికారిక విధులు, భద్రతా తనిఖీలు, ధ్రువపత్రాల జారీలో ఏమైనా అక్రమాలు జరిగాయా? అనే అంశాలనూ పరిశీలించే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ఎలాంటి అక్రమాలు అధికారికంగా నిర్ధారణ కాలేదు. ఏసీబీ పూర్తిస్థాయి విచారణతో నగదు, లావాదేవీల వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఇద్దరిని బలిగొన్న మూఢనమ్మకం

భర్తకు దిష్టితీసిన సామగ్రిని చెరువులో కలిపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి భార్య, ఆమె తండ్రి మృతి





కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 6 (జనం సాక్షి) : మూఢనమ్మకం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. భర్తకు దిష్టి తీయిస్తే కష్టాలు తొలగిపోతాయన్న నమ్మకంతో కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నం విషాదాంతమైంది. దిష్టి తీసిన సామగ్రిని చెరువులో కలిపేందుకు వెళ్లిన భార్య, ఆమె తండ్రి ప్రమాదవశాత్తు నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. ఒకరిని కాపాడే ప్రయత్నంలో మరొకరు మృత్యువాత పడ్డారు. రాత్రివేళ చెరువు వద్దకు వెళ్లడం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. కామారెడ్డి మండలం లింగాయిపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

లింగాయిపల్లి డబుల్ బెడ్రూమ్ కాలనీకి చెందిన సోమిశెట్టి మల్లేషం రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమయ్యాడు. అతనికి దిష్టి తీయించాలని కుటుంబ సభ్యులు భావించి ఓ భూతవైద్యుడిని సంప్రదించారు. భూతవైద్యుడు సూచించిన విధంగా భార్య రజిత (40), టేక్రియాల్‌కు చెందిన ఆమె తండ్రి సంకరి పెద్ద నర్సయ్య (60) లు కలిసి గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నిమ్మకాయలు, కొబ్బరి కాయలు, పసుపు బియ్యం తదితర వస్తువులతో మల్లేషంకు దిష్టి తీశారు. దిష్టితీసిన సామగ్రిని నీటిలో కలిపేందుకు తండ్రీ, కుమార్తెలు సమీపంలోని కోటాల్‌పల్లి గ్రామ శివారులోని గోవిందకుంటకు వెళ్లారు. సామగ్రిని నీటిలో కలిపే క్రమంలో లోతు అంచనా వేయక ముందుగా రజిత ప్రమాదవశాత్తు నీటమునిగింది. ఆమెను కాపాడబోయిన తండ్రి నర్సయ్య కూడా నీట మునిగి గల్లంతయ్యాడు. తండ్రీ, కుమార్తెలు ఇంటికి తిరిగిరాకపోవడంతో అనమానం వచ్చిన కుటుంబ సభ్యులు, కాలనీవాసులు కుంట వద్దకు వెళ్లి చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాదాపు రాత్రి 11 గంటల ప్రాంతంలో రజిత మృతదేహం నీటిపై తేలింది. శుక్రవారం ఉదయం రెస్క్యూ బృందాలు, గ్రామస్తులు కలిసి నర్సయ్య మృతదేహాన్ని గుర్తించి వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు. మృతురాలు రజితకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెద్ద నర్సయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా, జరిగిన ఘటనలో తండ్రితో కలిసి పెద్ద కుమార్తె రజిత మృతిచెందింది. దీంతో లింగాయిపల్లి, ట్రేక్రియాల్ రెండు గ్రామాల్లోనూ విషాదఛాయలు అలముకున్నాయి.

అమెరికన్ సంస్థలతో పని చేసేందుకు సిద్ధం

సింగరేణి ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్, జియో సైన్స్ ల్యాబొరేటరీ సౌకర్యాలు

- కీలక ఖనిజ విస్తరణపై యూఎస్ కాన్సులేట్ బృందానికి వివరించిన సింగరేణి
- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తో అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధి బృందం భేటీ



హైదరాబాద్ (జనంసాక్షి) : కీలక ఖనిజ రంగంలో సాంకేతిక, ఉమ్మడి భాగస్వామ్యం, తదితర అంశాలపై హైదరాబాద్ అమెరికన్ కాన్సులేట్ కు చెందిన పొలిటికల్ మరియు ఎకనామిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్ సారథ్యంలోని ఉన్నత స్థాయి అధికారుల బృందం శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థతో పలు వ్యాపార సంబంధ అంశాలు, అవకాశాలపై ఇరు పక్షాల వారు సుదీర్ఘంగా చర్చించారు. మైనింగ్ రంగంలో అపార అనుభవం గల సింగరేణి సంస్థ కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించిందని, ఇప్పటికే పలు దేశాలతో ఉమ్మడి భాగస్వామ్యం, సాంకేతిక సహకారంపై చర్చిస్తోందని సంస్థ చైర్మన్ వివరించారు. దీనిపై అమెరికన్ బృందం వారు స్పందిస్తూ తమ దేశంలో కీలక ఖనిజ రంగంలో ఉన్న పలు సంస్థలతో కలిసి పని చేయడానికి అవకాశాలు ఉన్నాయని వివరించారు. సింగరేణి సంస్థ ఇటీవల కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన జియో సైన్స్ ల్యాబొరేటరీలో ఉన్న సౌకర్యాలు, ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ లో దాగి ఉన్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి అంశాలపై కూడా అమెరికన్ బృందం ఆసక్తి చూపించింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రోత్సాహం, సహకారంతో సింగరేణి కీలక ఖనిజ రంగంలో ముందుకువెళ్తోందని సీఎండీ పేర్కొన్నారు. కీలక ఖనిజ రంగంలో విదేశీ పెట్టుబడులను, సాంకేతిక, పరిశోధన సంస్థల భాగస్వామ్యాన్ని సింగరేణి సంస్థ కోరుతోందని వివరించారు. అమెరికాలో పలు సంస్థలు ఇటువంటి ఆసక్తిని కలిగి ఉన్నాయని కాన్సులేట్ సభ్యులు తెలియజేశారు ఏప్రిల్ లో అమెరికాలో జరిగే కీలక ఖనిజ సదస్సులో పాల్గొనవలసిందిగా సింగరేణిని ఆహ్వానించారు. నేటి ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను శోధిస్తున్నామని, తెలంగాణలో సింగరేణి ప్రాంతంలో కూడా వీటి ఏర్పాటుకు సుముఖంగా ఉన్నామని అమెరికన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ అమెరికన్ బృందాన్ని సింగరేణి గనులను, జియో సైన్స్ ల్యాబ్ ను సందర్శించాలని ఆహ్వానించారు. ఈ సమావేశంలో అమెరికన్ కాన్సులేట్ బృందానికి చెందిన పొలిటికల్, ఎకనామిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్, పొలిటికల్, ఎకనామిక్ స్పెషలిస్ట్‌లు శ్రీమతి కరి, శిబా త్రిపాఠి, కమర్షియల్ స్పెషలిస్ట్ సునేల్ కుమ్మర్, సింగరేణి సంస్థ తరఫున చైర్మన్‌తో పాటు డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్, కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్, జనరల్ మేనేజర్ (బిజినెస్ డెవలప్ మెంట్) కె. రామదాసు, జనరల్ మేనేజర్ (ఎక్స్ ప్లోరేషన్) పంకజ్ కులశ్రేష్ట, జనరల్ మేనేజర్ (పవర్ ప్రాజెక్ట్స్) గురు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

1,135 మంది జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇటీవల కోల్ బెల్ట్ ప్రజా ప్రతినిధుల సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు సింగరేణిలో బదిలీ వర్కర్ లేదా జనరల్ అసిస్టెంట్ ట్రైనీలుగా పనిచేస్తున్న దాదాపు 1,135 మంది కార్మికులను జనరల్ అసిస్టెంట్ లుగా క్రమబద్ధీకరణ చేయడానికి సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 డిసెంబర్ 31వ తేదీ నాటికన్నా ముందు ఉద్యోగంలో చేరి బదిలీ వర్కర్ లేదా జనరల్ అసిస్టెంట్ ట్రైనీలుగా పని చేస్తున్న కార్మికులకు ఇది వర్తిస్తుంది. 2025 డిసెంబర్ 31 వ తేదీ అంతకుముందు ఏ క్యాలెండర్ సంవత్సరంలోనైనా సరే భూగర్భ విభాగంలో పనిచేసిన వారైతే 190 పని దినాలు, ఓపెన్ కాస్ట్ గనులు లేదా బయట విభాగాల్లో పనిచేసిన వారైతే 240 పని దినాలు పూర్తి చేసి ఉన్నవారికి మాత్రమే ఈ అవకాశం వర్తిస్తుంది. సంస్థ చైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశంపై జనరల్ మేనేజర్ (పర్సనల్) ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్మెంట్ విభాగం సర్కులర్ ను విడుదల చేసింది. ఆయా ఏరియాలలో పనిచేస్తున్న అర్హుల జాబితాలను ఈ నెల 23వ తేదీ లోగా సమర్పించాలని ఏరియా జీఎంలను యాజమాన్యం కోరింది. అర్హుల జాబితాలోని ఉద్యోగులను 2026 సెప్టెంబర్ 1వ తేదీ నుండి క్రమబద్ధీకరిస్తారు.

అమెరికాలో నల్లగొండ యువతి అదృశ్యం

- శ్రీజ ఆచూకీ కోసం మంత్రి కోమటిరెడ్డి నిరంతర ప్రయత్నాలు



హైదరాబాద్, నవంబర్ 06 (జనంసాక్షి) : అమెరికాలోని బోస్టన్ యూ నివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న నల్ల గొండకు చెందిన యువతి కోయ శ్రీజారెడ్డి అదృశ్యం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శ్రీజ ఆచూకీని త్వరగా కనుగొనేందుకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిరంతరం సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే బోస్టన్ కాన్సులేట్ జనరల్, కేంద్ర విదేశాంగ శాఖతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఈ-మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. అలాగే బోస్టన్‌లోని తానా ప్రతినిధి కృష్ణప్రసాద్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి శ్రీజ ఆచూకీ కోసం తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పంపిన ఈ-మెయిల్స్‌కు స్పందించిన సంబంధిత వర్గాలు స్థానిక పోలీసుల సహకారంతో శ్రీజ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించాయి. స్థానిక పోలీసులు, విద్యార్థులతో కలిసి యువతి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని కృష్ణప్రసాద్ మంత్రికి తెలిపారు. శ్రీజ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నందున ఆమె ఆచూకీని వీలైనంత త్వరగా కనుగొనాలని బోస్టన్ కాన్సులేట్ జనరల్‌ను మంత్రి మరోసారి కోరారు. మంత్రి ఆదేశాల మేరకు ఆయన కార్యాలయం ప్రత్యేకంగా ప్రతి గంటకు ఒకసారి తాజా సమాచారాన్ని సేకరిస్తోంది. శ్రీజకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని ఎప్పటికప్పుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి చేరవేస్తున్నట్లు బోస్టన్ నుంచి తానా ప్రతినిధి కృష్ణప్రసాద్ వెల్లడించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370